

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00

సంపుటి: 16
సంచిక: 191

ఆదివారం 1-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 1-10-2023



50 గోల్డెన్ బాబీ

50 ఏళ్లు పూర్తి చేసుకున్న బాలీవుడ్ బంపర్ హిట్ చిత్రం బాబీ (1973) కి సంబంధించిన జ్ఞాపకాలు, తెలిసిన విషయాలు, తెలియని విషయాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. బాగా ఇష్టపడి చేసిన సినిమా పరాజయం పాలైతే లేచి నిల్చోవడానికి, అడుగులు వేయడానికి, పరుగులు తీయడానికి శక్తి కావాలి. ఆ శక్తి రావాలంటే 'ఎలాగైనా హిట్టు కొడతాను' అనే కసి ఉండాలి. 'మేరా నామ్ జోకర్' సినిమాతో పరాజయం, అప్పుల పాలైన రాజ్ కపూర్‌లో ఆ కసి దండిగా ఉంది. కసి సంగతి సరే, ఇప్పుడొక సూపర్‌స్టారుడు కావాలి కదా. అప్పుల పాలైన తనతో సినిమా చేయడానికి ఎవరు ధైర్యం చేస్తారు? 'ఇక అంతా అయిపోయింది. మిగిలింది ఏమీలేదు' అనుకున్నప్పుడు ఎక్కడ లేని ధైర్యం వస్తుందట. ఆ ధైర్యంతోనే కుమారుడిని హీరోగా పెట్టి 'బాబీ' తీసి తిరుగులేని విజయాన్ని అందుకున్నాడు రాజ్ కపూర్. ఆర్‌కే స్టూడియోస్‌కు ఇది మకుటాయమాన చిత్రం అయింది. రిషి కపూర్, డింపుల్ కపాడియాలను ఎక్కడికో తీసుకెళ్లింది. 'బాబీ' గురించి రెండు ముక్కల్లో చెప్పాలంటే...కమర్షియల్ రోమాంటిక్ ఫిల్మ్ 'ఫార్మట్'ను సెట్ చేసింది. మినీ-స్కర్ట్స్, హాట్ ప్యాంట్స్, లెదర్ ఔట్‌ఫిట్స్, వోవర్ సైజ్‌డ్ గ్లాసెస్, పోల్కా-డాటెడ్ నాటెడ్ టాప్స్ మన దేశంలోని ఫ్యాషన్ ఇండస్ట్రీలో కొత్త ట్రెండ్స్‌ను మోసుకొచ్చాయి.

వైరల్

ఈ స్టూడెంట్ వయసు జస్ట్... 92



'చదువుకు వయసుతో పనేమిటి' అనేది పాత డైలాగే కావచ్చు గానీ 92 సంవత్సరాల సలీమాఖాన్‌కు మాత్రం ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకోవడం, నేర్చుకోవడం అంటే ఇష్టం. ఆ ఇష్టమే బామ్మను 92 ఏళ్ల వయసులోనూ బడి బాట పట్టించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బులందర్‌షహర్‌కు చెందిన సలీమాకు బడి సౌకర్యం లేకపోవడం, రకరకాల పరిస్థితుల వల్ల చదువుకునే అవకాశం దొరకలేదు.

ఆరు నెలల క్రితం బడిలో చేరిన సలీమా పిల్లలతో పాటు క్లాస్‌రూమ్‌లో కూర్చునేది. చదవడం, రాయడం నేర్చుకుంది. 'నేను కూడా చదవగలుగుతున్నాను. రాయగలుగుతున్నాను అనే సంతోషాన్ని చెప్పడానికి మాటలు లేవు' అంటుంది సలీమాఖాన్. 'మొదట్లో ఆమెకు చదువు చెప్పడానికి టీచర్‌లు తటపటాయించారు. అయితే ఆమెను వద్దనడానికి మా దగ్గర ఏ కారణం కనిపించలేదు. ఆమె పట్టుదల చూసి టీచర్‌లకు ఉత్సాహం వచ్చింది. అక్షరాస్యురాలిని కావాలి అనే ఆమె పట్టుదల టీచర్‌లకు నచ్చింది' అంటుంది స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ప్రతిభ శర్మ.

నిదుర పోరా తమ్ముడా

జనరల్ కంపార్ట్‌మెంట్‌లో సీటు దొరకదు. నిదురపోయే చోటు అసలు దొరకదు. కాయకష్టం చేసి బండెక్కిన బీదసాదలు నిదురకు ఆగగలరా? ఏదో ఒక ప్లాన్ చేస్తారు. రైల్లో ఒక కుర్రవాడు చేసుకున్న ఏర్పాటు పోయిన్నెల నుంచి ఈ నెల వరకు పది లక్షల లైకులు పొంది ఇంకా వైరల్‌గానే ఉంది. ఎందుకంటే జనరల్ తిప్పలు అందరికీ తెలిసినవే కదా.





'నిదుర పోరా తమ్ముడా' అని పాడింది లతా మంగేష్కర్.

'కునుకు పడితే మనసు కాస్త కుదుట పడతది' అన్నాడు ఆత్రేయ.

'నిదర ముదర పోయాక పాడె వొక్కటే వల్లకాడు ఒక్కటే' అన్నాడు జాలాది.

నిజమే. నిద్ర పట్టాక, గాఢంగా నిద్ర కమ్ముకున్నాక మనం ఎక్కడ పడుకున్నామో ఎక్కడ తెలుస్తుంది? అందుకే నిద్ర సుఖమెరగదు అన్నారు పెద్దలు.

అదేం ఖర్మోగాని రైలెక్కితే నిద్ర పోవాలనిపిస్తుంది. బెర్తులున్నవారు చక్కా తొమ్మిది దాటగానే దుప్పట్లు పరుచుకుని, కప్పుకుని గుర్రుపెడతారు. మరి జనరల్‌లో ఉన్నవారో?

పుష్పక విమానంలో ఎంతమంది ఎక్కినా మరొకరికి చోటుంటుంది. మన రైల్వే వారు జనరల్ కంపార్ట్‌మెంట్‌కు ఇదే సూత్రం అప్లై చేస్తారు. ఎంతమందెక్కినా ఏదో ఒక మూల కూలబడతారని టికెట్లు తెగ ఇస్తారు. ఎక్కాక బాత్‌రూమ్‌కు వెళ్లడానికి కూడా వీల్లేని తాకిడి.

జనరల్‌లో ఎవరెక్కుతారు? బీదసాదలు. కాయకష్టం చేసి సొంత ఊరికో, ఏదో కొంపలంటుకు పోయే వర్తమానం అందినందుకో అప్పటికప్పుడు టికెట్ కొనుక్కుని ఎక్కుతారు. లేకపోయినా ఎక్కుతారు. నిద్రకు టికెట్‌తో పని లేదు. కిటికీల్లో నుంచి చల్లగాలి తగులుతుంటే, వెళ్లే రైలు ఊయల వలే ఊగుతుంటే ఎలాగైనా చోటు చూసుకుని పడుకో అంటుంది.

రెండు బెర్తుల మధ్య కింద పడుకునేవారు ఎప్పుడూ కనపడతారు. లగేజ్ స్టాండ్ ఎక్కి నిద్ర పోయేవారు కూడా మన దేశంలో విరివిగా విస్తృతంగా ఉన్నారు. అయితే ఈ కుర్రవాడు మాత్రం అసాధ్యుడు. పైన ఉన్న రెండు బెర్తులకు దుప్పటి కట్టి ఒక బెర్తు సృష్టించాడు. ఆ తర్వాత దానిలోకి జారి ఒళ్లెరగని నిద్ర పోయాడు.

హాతిమ్ ఇస్మాయిల్ అనే కేరళ ట్రావెలర్ ఈ వీడియో తీసి పోయిన నెల ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తే ఇప్పటికి 10 లక్షల లైక్స్ వచ్చాయి. అంత మంచి సెటప్ చేసుకుని నిద్రపోతున్నవాణ్ణి చూసి కొందరు కుళ్లుకున్నారు. కొందరు దుప్పటి నాణ్యతను శ్లాఘించారు. మరికొందరు ఇకపైన స్లీపర్ బుక్ చేసుకోకుండా ఇదే ఫార్ములా వాడుతానని అన్నారు. ఆగ్రా రైలు ఇలాగే ఉంటుందని మరొకరు అన్నారు.

ఈ మధ్య జనరల్ కంపార్ట్‌మెంట్‌లు పెరగాలనే డిమాండ్ వినిపిస్తోంది. జనరల్ కంపార్ట్‌మెంట్‌లు ఎందుకు తక్కువ ఉంటాయో రైల్వేవారు ఎప్పుడూ చెప్పరు. ప్రభుత్వాలకు ఓట్లు కావాలి. వారి మాటలకు పగటి కలలు చూసే జనం బోగీల్లో ఇలాంటి నిద్రకే ఉపక్రమించాలి.

బంగారంలాంటి కూతురు



దివ్యాకృతి సింగ్, అనూష్, హృదయ్, సుదీప్తిలతో కూడిన ఇండియన్ టీమ్ ఈక్వెస్ట్రియన్ డ్రస్సేజ్ ఈవెంట్‌లో బంగారు పతకాన్ని గెలుచుకొని చరిత్ర సృష్టించింది. ఈ బృందంలో ఒకరైన దివ్యాకృతిసింగ్‌కు తండ్రి విక్రమ్ రాథోడ్ అన్నిరకాలుగా అండగా నిలిచాడు. ఆమె ట్రైనింగ్ కోసం ఇంటిని కూడా అమ్మాడు. ఈ విషయాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఢిల్లీలోని జీసస్ అండ్ మేరీ కాలేజీలో చదువుకునే రోజుల్లో పోటీ పడేందుకు గుర్రం లేకపోవడంతో రెండు సంవత్సరాలు పోటీకి దూరంగా ఉంది దివ్యాకృతి. ఆసియా క్రీడల్లో పాల్గొనాలనే కూతురు లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని జర్మనీలో గుర్రాన్ని కొన్నాడు. గుర్రం కొనడం నుంచి స్పాన్సరర్‌ల చుట్టూ కాళ్లరిగేలా తిరగడం వరకు విక్రమ్ రాథోడ్ పడని కష్టం లేదు. ఏమైతేనేం, ఆయన శ్రమ ఫలించింది. కుమార్తె బంగారు కల నెరవేరింది.

కళ్లు మూసుకొని... కళ్లు చెదిరే విజయం



ఎన్నో అద్భుత విజయాలు సాధించిన విజేతల అద్భుత విజయాలను డాక్యుమెంటరీలలో చూసిన తరువాత తాను కూడా ఏదైనా సాధించాలనుకుంది మలేసియాకు చెందిన పది సంవత్సరాల పునీత మలర్ రాజశేఖర్. ఈ చిన్నారికి చెస్ అంటే ఇష్టం. తాజాగా... కళ్లకు గంతలు కట్టుకొని కేవలం 45.72 సెకన్లలో చెస్‌బోర్డ్‌పై అత్యంత వేగంగా 32 పావులను సెట్ చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. తండ్రి సహకారంతో నాలుగు నెలల పాటు కష్టపడి ఈ అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది.



ఏనుగమ్మ ఏనుగు... ఏడికీ పోనియ్యదు ఏనుగు

ఒక ఏనుగుకు, దాని సంరక్షకుడు (కేర్‌టేకర్)కి మధ్య ఉండే అందమైన అనుబంధానికి అద్దం పట్టే వీడియో వైరల్ అయింది. ఏనుగు సంరక్షకుడు ఏదో పనుండి పక్క ఊరు వెళ్లడానికి స్కూటీపై కూర్చోవడానికి రెడీ అవుతుంటే 'నువ్వు ఎల్లడానికి ఈల్లేదంతే' అన్నట్లుగా అడ్డుకుంది ఏనుగు. తొండంతో చుట్టేసింది. 'నన్నొదలవే బాబూ... ఇట్ల బోయి అట్లొస్తా' అని కేర్‌టేకరుడు లబోదిబో అంటున్నా ఏనుగు మారం చేయడం మాత్రం ఆపలేదు. అతడు స్కూటీ ఎక్కాడో లేదో తెలియదు గానీ రైల్వే అధికారి అనంత్ రూపన్‌గూడి ట్విటర్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో నవ్వుల పువ్వుల పూయిస్తోంది. 'అనుబంధాలు మనుషులకు మాత్రమే పరిమితమైనవి కావు' అని మరోసారి గుర్తు చేసే వీడియో' అంటూ నెటిజనులు స్పందించారు.

సినిమా


● విష్ణు, మోహన్‌లాల్

కన్నప్పలో మోహన్‌లాల్

మంచు విష్ణు టైటిల్ రోల్ చేస్తూ, నిర్మిస్తున్న మైథలాజికల్ ఫిల్మ్ 'కన్నప్ప'. 'మహాభారత్' సిరీస్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ ఈ సినిమాకు దర్శకుడు. ఈ చిత్రంలోని ఓ కీలక పాత్రలో ప్రభాస్ నటించనున్న విషయం తెలిసిందే. మరో కీలక పాత్రలో మోహన్‌లాల్ నటించనున్నట్లు శనివారం యూనిట్ ప్రకటించింది. పరుచూరి గోపాలకృష్ణ, విజయేంద్ర ప్రసాద్, తోటపల్లి సాయినాథ్, తోట ప్రసాద్, నాగేశ్వర రెడ్డి, ఈశ్వర్ రెడ్డి ఈ సినిమాకు అద్భుతమైన స్క్రిప్ట్‌ను అందించారని విష్ణు ఇటీవల పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ న్యూజిల్యాండ్‌లో జరుగుతోంది.

ఈ ఏడాది నా జీవితం పరిపూర్ణమైంది

- రచయిత చంద్రబోస్

''ఈ వేదికపై (శిల్ప కళా వేదిక) జరిగిన వందల ఆడియో ఫంక్షన్లకు వచ్చాను. నా పాటలు కూడా ఆవిష్కరించబడ్డాయి. కానీ ఆ ఫంక్షన్స్‌లో హీరోలను చూసేందుకు ప్రేక్షకులు వచ్చేవారు. కానీ ఈ రోజు ఇక్కడ పాట హీరో.. సంగీతం హీరో.. సాహిత్యం హీరో. 'తాజ్‌మహల్' సినిమాతో నన్ను రామానాయుడుగారు పరిచయం చేశారు. 1995లో మొదలైన నా ప్రయాణం 2023 వరకూ.. 28 సంవత్సరాలు.. 860కి పైగా సినిమాలు.. 3600లకు పైగా పాటలు రాశాను. ఈ ఏడాది నాకు, నా జీవితానికి, నా సాహిత్యానికి పరిపూర్ణతను తీసుకొచ్చింది. ఈ ఏడాది నాపై పురస్కారాల వర్షం కురిసింది. ఫిబ్రవరిలో గోల్డెన్‌గ్లోబ్ అవార్డు, హాలీవుడ్ క్రిటిక్స్ చాయిస్, క్రిటిక్స్ అవార్డు, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆస్కార్, బాంబే హంగామా అవార్డు, ఉత్తమ జాతీయ గీతరచయిత అవార్డు.. ఇలా వరుసగా ఒకే సంవత్సరం నన్ను ఆరు పురస్కారాలు వరించాయి. మన తెలుగుకు వెయ్యేళ్ల సాహిత్య చరిత్ర ఉంది. రెండువేల సంవత్సరాల భాషా చరిత్ర ఉంది. నా మిత్రుడు ఒకరు 'సంకల్పం' అనే పుస్తకం తెలుగులో రాసి, ఈ పుస్తకం కోసం వారం రోజులు సెలవు పెట్టి అమెరికా నుంచి వచ్చారు. ఆ తర్వాత అమెరికా వెళ్లినప్పుడు ఆయన సహోద్యోగి ఎందుకు సెలవు పెట్టారని అడగ్గా... తెలుగు భాష పుస్తకం కోసం అని చెప్పగా.. ఆవిడ తెలుగు అంటే.. ఆ నాటు నాటు లాంగ్వేజ్ అన్నారట. ప్రపంచంలో తెలుగు అనేది ఒకటి ఉందని చాలామందికి తెలియదు. కానీ మొట్టమొదటిసారి 'నాటు పాట'తో ఇది నాటు భాష అని తెలిసింది. ఈ పాట సృష్టికర్తల్లో నేను ఒకడిని. నా జన్మ చరితార్థమైంది. ఈ కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించిన నిహారిక, ప్రదీప్, సరస్వతిలకు, వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు'' అని అన్నారు. ఈ ఏడాది ఆస్కార్, జాతీయ అవార్డులతో పాటు మరెన్నో అవార్డులను సొంతం చేసుకున్న రచయిత చంద్రబోస్‌ని సత్కరించడానికి 'తెలుగు జాతీయ చంద్రబోస్' పేరిట శనివారం హైదరాబాద్‌లో నటుడు ప్రదీప్ ఓ వేడుక నిర్వహించారు. ఈ వేదికపై చంద్రబోస్‌ని, ఆయన సతీమణి, నృత్యదర్శకురాలు, దర్శకురాలు సుచిత్రా చంద్రబోస్‌ని సత్కరించారు. ఈ సందర్భంగా రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ– ''ఆస్కార్, జాతీయ అవార్డు అందుకున్న చంద్రబోస్‌గారికి మా కవి కులం తరపున అభినందనలు. బోస్‌గారి ప్రయాణం, ప్రస్థానం ఆదర్శవంతంగా ఉంటాయి. ఈ గొప్పదనం, ఆదర్శం ఒక్కరోజులో రాదు. తొలి రోజు నుంచే కష్టపడుతూ ఉండాలి. ఓ రచయితకు జరిగిన ఈ సన్మానాన్ని అక్షరానికి జరిగిన సన్మానంలా భావిస్తున్నాను'' అన్నారు. ఈ వేడుకలో పలువురు కళాకారులను సన్మానించారు. మురళీమోహన్, ముప్పలనేని శివ, ఎంఎం శ్రీలేఖ, చంద్రబోస్ సోదరుడు రాజేందర్‌తో పాటు పలువురు సినీ, టీవీ నటీనటులు పాల్గొన్నారు.


● సుచిత్ర, చంద్రబోస్, రామజోగయ్య శాస్త్రి, ప్రదీప్

థియేటర్లో చూడాల్సిన సినిమా


- యశ్వంత్



నవీన్ చంద్ర, స్వాతీ రెడ్డి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. శ్రీకాంత్ నాగోతి దర్శకత్వంలో యశ్వంత్ ములుకుట్ల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ– ''మంత్ ఆఫ్ మధు' సినిమా లైఫ్ డ్రామా. ప్రతి ఒక్కరి జీవితంలో హనీమూన్ పీరియడ్ అంటూ ఉంటుంది. ఈ సమయం వారి జీవితాల్లో బ్యూటిఫుల్‌గా ఉంటుంది. అయితే జీవితం ఎప్పుడూ హ్యాపీగా ఉండదు. ఎత్తుపల్లాలు ఉంటాయి. ఈ వాస్తవాన్ని చూపించాలని చేసినదే ఈ చిత్రం. రవికాంత్ పేరేపు స్క్రీన్‌ప్లే కీలకంగా ఉంటుంది. నవీన్, స్వాతి, శ్రేయా బాగా నటించారు. మా తొలి సినిమా 'భానుమతి రామకృష్ణ' ఓటీటీలో విడుదలైంది. రెండింతలు లాభాలు కూడా వచ్చాయి. 'మంత్ ఆఫ్ మధు' నిర్మాతగా నా రెండో సినిమా. ఇది థియేటర్స్‌లో చూడాల్సిన సినిమా. మా సినిమా రోజునే ఐదారు సినిమాలు రిలీజవుతున్నాయి. అయితే మా జానర్ డిఫరెంట్'' అన్నారు.

వైరల్ విశాలాక్షి కొత్తగా అనిపించింది

- ఈషా రెబ్బా



సుధీర్‌బాబు త్రిపాత్రాభినయం చేసిన చిత్రం 'మామా మశ్చీంద్ర'. హర్షవర్ధన్ నటించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మృణాళినీ రవి, ఈషా రెబ్బా హీరోయిన్లు. సోనాలీ నారంగ్, సృష్టి సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈషా రెబ్బా మాట్లాడుతూ– ''సుధీర్ బాబుగారు చేసిన మూడు పాత్రల్లో దుర్గ పాత్రకు జోడీగా వైరల్ విశాలాక్షి పాత్ర చేశాను. ఏదో ఒకటి చేసి వైరల్ కావాలనుకునే మనస్తత్వం విశాలాక్షిది. ఈ పాత్ర నాకు కొత్తగా అనిపించింది. ఈ సినిమా కథను హర్షవర్ధన్ గారు చెప్పినప్పుడు కన్ఫ్యూజ్ అయ్యాను. కానీ సెట్స్‌లో క్లారిటీ వచ్చింది. ప్రస్తుతం తమిళంలో విక్రమ్ ప్రభుతో ఓ సినిమా కమిట్ అయ్యాను. అలాగే నాకు మంచి గుర్తింపు తెచ్చిన 'దయ' వెబ్ సిరీస్ రెండో భాగం 'దయ 2' వచ్చే సంవత్సరం ఆరంభమవుతుంది'' అన్నారు.

హెల్త్



ఆంధ్రప్రదేశ్‌కు పొరుగునే ఉన్న ఒడిశాలో కొంతకాలంగా 'స్క్రబ్ టైఫస్' బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ స్వైరవిహారం చేస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి అక్కడ కనిపిస్తున్న ఈ కేసులు గత రెండు మూడు వారాలుగా ఒక్కసారిగా పెరిగాయి. ఇటీవల ఒక్క సుందర్‌ఘర్ జిల్లాలోనే దాదాపుగా 200కు పైగా కేసులు రావడంతో పాటు, కొన్ని మరణాలు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాలూ అప్రమత్తం కావాల్సిన అవసరమున్న ఈ తరుణంలో స్క్రబ్ టైఫస్ ఇన్ఫెక్షన్‌పై అవగాహన కోసం ఈ కథనం.

పొరుగునే స్క్రబ్ టైఫస్ ఇన్ఫెక్షన్! మన దగ్గరా అప్రమత్తత అవసరం!!

'స్క్రబ్ టైఫస్' బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌ను 'బుష్ టైఫస్' అని కూడా అంటారు. ఈ ఇన్ఫెక్షన్ కలిగించే బ్యాక్టీరియమ్ పేరు 'ఓరియెంటియా సుసుగాముషి'. ఇది చిమ్మటలా కనిపించే చిగ్గర్ అనే ఒక రకం కీటకం ద్వారా ఒకరినుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఈ కీటకం కుట్టినప్పుడు చర్మం ఎర్రబారడం, దురదరావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి కుట్టడం వల్ల 'ఓరియెంటియా సుసుగాముషి' అనే బ్యాక్టీరియమ్ దేహంలోకి ప్రవేశించడంతో ఈ స్క్రబ్ టైఫస్ ఇన్ఫెక్షన్ వస్తుంది.

ఒకసారి చిగ్గర్ కుట్టాక... బ్యాక్టీరియమ్ బాధితుల రక్తంలోకి చేరితే... దాదాపు పది రోజుల తర్వాత లక్షణాలు కనిపించడం మొదలవుతుంది. చాలావరకు లక్షణాలు నిరపాయకరంగా ఉండవచ్చు. కానీ మొదటివారంలో దీన్ని గుర్తించకపోవడం లేదా సరైన చికిత్స ఇవ్వకపోవడం జరిగితే రెండోవారం నుంచి కొన్ని దుష్ప్రభావాలు వస్తాయి. ఊపిరితిత్తులు, కిడ్నీ, గుండె, కొన్ని సందర్భాల్లో మెదడు కూడా ప్రభావితమై మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌కు దారితీయవచ్చు.

స్క్రబ్ టైఫస్ లక్షణాలు

- వణుకుతో కూడిన చలిజ్వరం
- తలనొప్పి
- ఒళ్లునొప్పులు, కండరాల నొప్పులు
- చిగ్గర్ కీటకం కుట్టిన చోట చర్మంపై గాయం మానుబట్టినప్పుడు కనిపించే నల్లటి మచ్చ కనిపిస్తుంది. దీన్ని 'ఎషర్' అని కూడా అంటారు.
- లింఫ్‌నోడ్స్‌లో వాపు
- చర్మంపై ర్యాష్.

నిర్ధారణ


ఈ వ్యాధి నిర్ధారణకు చాలా పరీక్షలే అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు వెయిల్ ఫెలిక్స్ పరీక్ష, ఇన్‌డైరెక్ట్ ఇమ్యూనోఫ్లోరోసెంట్ యాంటీబాడీ (ఐఎఫ్‌ఏ) పరీక్ష, ఇన్‌డైరెక్ట్ ఇమ్యూనో పెరాక్సైడేజ్ (ఐపీపీ) పరీక్ష, ఎలీజా, ఇమ్యూనో క్రొమాటోగ్రాఫిక్ టెస్ట్ (ఐసీటీ), పీసీఆర్ పరీక్షల ద్వారా దీన్ని నివారణ చేయవచ్చు. అయితే చాలా రకాల బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లలో కూడా దాదాపుగా ఇవే లక్షణాలు కనిపిస్తాయి. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌లో తగిన మోతాదులో యాంటీబయాటిక్ చికిత్స చేసి, బాధితుల పరిస్థితిని నార్మల్ చేయవచ్చు. అందుకే అన్నన్ని ఖరీదైన పరీక్షలకు బదులు కాస్తంత అనుభవజ్ఞులైన డాక్టర్లు కొన్ని లక్షణాల ఆధారంగా బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌ను గుర్తిస్తారు. ఉదాహరణకు మలేరియాలో ప్రోటోజోవన్ పారసైట్ రకాన్ని బట్టి కొన్ని రోజుల వ్యవధిలో జ్వరం మాటిమాటికీ వస్తుంటుంది. అదే వైరల్ జ్వరాలు చాలా తీవ్రంగా, ఎక్కువ ఉష్ణోగ్రతతో వస్తుంటాయి. ఈ లక్షణాలను బట్టి ఆయా జ్వరాలను గుర్తుబట్టి చికిత్స అందిస్తారు. దీనికి జ్వరం వచ్చిన తొలిదశలోనే సింపుల్‌గా ఇచ్చే యాంటీబయాటిక్స్‌తో చికిత్స అందిస్తే చాలు. ఒకవేళ చికిత్స అందించకపోతే కొన్నిసార్లు ఇది లంగ్స్, గుండె, నాడీ వ్యవస్థ, జీర్ణవ్యవస్థతో పాటు కిడ్నీలపై దుష్ప్రభావం చూపే అవకాశం ఉంది.

నివారణ

దీనికి టీకా ఏదీ అందుబాటులో లేదు. చిగ్గర్ కీటకాల కాటుకు గురికాకుండా జాగ్రత్త తీసుకోవడం మంచిది. ఇవి పొలాల్లో, మట్టిలో నివసిస్తూ, అక్కడే గుడ్లు పెడతాయి. కాబట్టి చేలూ, పొలాల్లో నడిచే సమయాల్లో చెప్పులు వాడటం వంటి జాగ్రత్తలతో దీన్ని చాలావరకు నివారించవచ్చు. ఫుల్ స్లీవ్ దుస్తులు, కాళ్లు పూర్తిగా కప్పేలాంటి దుస్తులు ధరించడం మేలు. ట్రెకింగ్ వంటి సాహసక్రీడల్లో పాల్గొనేవారు చిగ్గర్స్ ఉండే ప్రాంతాల్లోనే నడిచే అవకాశాలు ఎక్కువ. అందుకే... ట్రెక్కింగ్ చేసేవారు ఇప్పుడీ వ్యాధి విస్తరిస్తున్న ప్రాంతాలకు కొన్నాళ్లు ట్రెక్కింగ్‌కు వెళ్లకపోవడమే మంచిది.

చికిత్స

కొన్ని అరుదైన సందర్భాల్లో (అంటే కాంప్లికేషన్ వచ్చిన కేసుల్లో) మినహా... టెట్రాసైక్లిన్ వంటి యాంటీబయాటిక్ మందులతోనే ఇది అదుపులోకి వస్తుంది. కీమో ప్రొఫిలాక్టిక్ ట్రీట్‌మెంట్ తీసుకుంటే... అది కొంతవరకు దీని నివారణకు ఉపయోగపడే అవకాశం ఉంది. ఇప్పుడు మన రాష్ట్రాల నుంచి ఒడిశా వెళ్లాల్సినవారు ప్రస్తుత పరిస్థితుల్లో ఈ కీమో ప్రొఫిలాక్టిక్ తీసుకోవడం కొంత మేలు చేస్తుందని చెప్పవచ్చు.


డా॥ శివరాజు
సీనియర్ ఫిజీషియన్

పొట్టలో గ్యాస్!



గ్యాస్ కడుపులోకి చేరాక పొట్టఉబ్బరంగా అనిపించడం... కొన్నిసార్లు అది ఛాతీలోనొప్పి కలిగించడం, ఒక్కోసారి గుండెపోటుగా పొరబడటం... ఇలాంటి ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తుంది.

ఈ సమస్యకు తేలికపాటి పరిష్కారాలివి...

- ఆహారాన్ని మెల్లమెల్లగా తినాలి. తినే సమయంలో గాలి మింగకుండా ఉండటం కోసం పెదవులు మూసి ఆహారాన్ని నమలాలి. తక్కువ తక్కువ మోతాదుల్లో ఎక్కువ సార్లు తినడం మంచిది.
- కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారాలు, బాగా వేయించిన పదార్థాలకూ దూరంగా ఉండాలి.
- పొగ, మద్యం అలవాట్లను మానేయాలి.
- రోజూ కనీసం రెండు లీటర్ల కంటే ఎక్కువగా మంచినీళ్లు తాగాలి.
- గ్యాస్ ఎక్కువగా ఉండే కూల్‌డ్రింక్స్, సోడాలు, కార్బొనేటెడ్ డ్రింక్స్ వంటి బీవరేజెస్‌కు దూరంగా ఉండాలి.
- గ్యాస్‌ను పెంచే వెజిటబుల్స్‌నూ, సిట్రస్ జాతికి చెందిన పండ్లను పరిమితంగా తీసుకోవాలి.
- పాలు, పాల ఉత్పాదనలతో కడుపు ఉబ్బరమై, పొట్టలో గ్యాస్ పెరిగితే ల్యాక్టోజ్ రహిత పాలు, పాల ఉత్పాదనలను తీసుకోవడం.
- బరువు పెరగకుండా చూసుకోవాలి. చురుగ్గా ఉంటూ, రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.



'బీడుబడిన తెలంగాణ భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 191

SUNDAY Special | ఆదివారం 1-10-2023


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్‌కు మరో 5 పతకాలు

చైనాలోని హాంగ్జౌలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత్ ఖాతాలో మరో 5 పతకాలు చేరాయి. స్క్వాష్ టీమ్ ఈవెంట్, టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణాలు లభించగా... షూటింగ్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో ఒక రజతం దక్కింది. అథ్లెటిక్స్‌లో ఒక రజతం, ఒక కాంస్యం అందాయి. ఓవరాల్‌గా 10 స్వర్ణాలు, 14 రజతాలు, 14 కాంస్యాలతో (మొత్తం 38 పతకాలు) భారత్ ప్రస్తుతం నాలుగో స్థానంలో కొనసాగుతోంది.

10లో



ఆన్‌లైన్ గేమింగ్‌పై 28% జీఎస్టీ

ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు బెట్టింగ్‌ల పూర్తి విలువపై 28 శాతం జీఎస్టీని ఆదివారం (అక్టోబర్ 1) నుంచి వసూలు చేయనున్నాయి.

- వివరాలు 6లో



భారత హైకమిషనర్ అడ్డగింత

స్కాట్‌లాండ్‌లోని గ్లాస్గోలో గురుద్వారాలోకి వెళ్లకుండా భారత హైకమిషనర్ విక్రమ్ దొరై స్వామిని ఖలిస్తానీ అతివాదులు అడ్డుకున్నారు.

- వివరాలు 6లో



బీసీననే నాపై ద్వేషం

బీసీలన్నా, ఎస్సీ, ఎస్టీలన్నా కాంగ్రెస్ పార్టీకి ఎనలేని ద్వేషమని, అందుకే వాళ్లు తనను నోటికొచ్చినట్టు తిడుతుంటారని మోదీ అన్నారు.

- వివరాలు 6లో



ఓ వైపు గాంధీ, మరోవైపు గాడ్సే..

5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే లోక్‌సభ ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య జరిగే యుద్ధంగా రాహుల్‌గాంధీ అభివర్ణించారు.

- వివరాలు 6లో

పాతికతో సర్దుకోండి

బీసీ నేతలకు కాంగ్రెస్ కేటాయిస్తామన్న అసెంబ్లీ సీట్లలో కోత!

ఒక్కో లోక్‌సభ స్థానం పరిధిలో 2 చొప్పున 34 సీట్లు ఇస్తామని తొలుత హామీ

ఇప్పుడు సర్వే నివేదికల మేరకు 25 సీట్ల వరకే ఇస్తామనే ప్రతిపాదనలు



- ఢిల్లీకి వచ్చి తమను కలసిన బీసీ నేతలకు స్పష్టం చేసిన హైకమాండ్ పెద్దలు
- బీఆర్‌ఎస్ కంటే ఎక్కువ సీట్లే ఇస్తున్నామంటూ బుజ్జగింపులు..
- తగ్గే సీట్లకు సరిపడా ఎమ్మెల్సీ, రాజ్యసభ స్థానాలు అదనంగా ఇస్తామనే హామీ
- టికెట్ల కేటాయింపు సమయంలోనే అధికారికంగా ప్రకటిస్తామని భరోసా
- అధికారంలోకి రావాలంటే సర్దుకుపోవాలంటూ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బలహీన వర్గాల నేతలకు టికెట్ల కేటాయింపు విషయంలో కాంగ్రెస్ పార్టీ గళం మారుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈసారి ఎన్నికల్లో కచ్చితంగా 34 అసెంబ్లీ స్థానాలను బీసీలకు ఇస్తామని ఆ పార్టీ పెద్దలు చెప్పినా ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. గెలుపు అవకాశాలు ఉన్నాయని సర్వేల్లో తేలిన వారికి మాత్రమే టికెట్లు ఇవ్వగలమని.. మిగతా వారికి ఇవ్వలేమని హైకమాండ్ స్పష్టం చేసిందని అంటున్నాయి. రెండు రోజులుగా ఢిల్లీలో మకాం వేసిన బీసీ నేతలు అధిష్టానం పెద్దలను కలిసినప్పుడు ఈ సంకేతాలు ఇచ్చిందని పేర్కొంటున్నాయి. ఈ సారికి 25 అసెంబ్లీ స్థానాలతో సర్దుకోవాలని.. అధికారంలోకి వచ్చాక బీసీ నేతలకు ఎమ్మెల్సీ, రాజ్యసభ స్థానాల్లో ప్రాధాన్యత ఇస్తామని, ఈ విషయాన్ని ఎన్నికలకు ముందే అధికారికంగా ప్రకటిస్తామని పెద్దలు

మిగతా 2వ పేజీలో ▶

ప్రతి లోక్‌సభ సీటు పరిధిలో రెండు సాధ్యం కాదంటూ..!

రాష్ట్రంలోని ప్రతి లోక్‌సభ స్థానం పరిధిలో రెండు చొప్పున మొత్తం 34 అసెంబ్లీ టికెట్లను బీసీలకు ఇస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి గతంలో మాటిచ్చారు. కానీ తాజా పరిణామాలతో ఈ హామీ అమలు సాధ్యమవడం లేదనే చర్చ పార్టీలో జరుగుతోంది. పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు నేతృత్వంలో నిర్వహించిన సర్వేల్లో బీసీ సీనియర్ నేతలకు కూడా సానుకూలత రాలేదని.. ఈ క్రమంలో కచ్చితంగా గెలుపు వరకు రాగల బీసీ అభ్యర్థులకే టికెట్లు ఇస్తామని అధిష్టానం పేర్కొన్నట్టు తెలిసింది. బీసీ నేతలు ఢిల్లీలో పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసినప్పుడు ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారని సమాచారం. పార్టీ అధికారంలోకి రావాలంటే సర్దుకుపోవాల్సి ఉంటుందని కూడా ఆయన స్పష్టం చేసినట్టు తెలిసింది. బీఆర్‌ఎస్ 22 చోట్ల బీసీలకు అవకాశం ఇచ్చిందని.. ఆ పార్టీ కంటే ఒకట్రెండు స్థానాలు ఎక్కువే ఇస్తామని, ఇదే విషయాన్ని బీసీ వర్గాలకు వెల్లడించాలని ఆయన పేర్కొన్నట్టు సమాచారం. సర్వేల ప్రాతిపదికన ఇది తప్పడం లేదని, సర్వేల విషయంలో ఏమైనా భిన్నాభిప్రాయాలుంటే తనకు తెలపాలని బీసీ నేతలకు కేసీ వేణుగోపాల్ సూచించినట్టు తెలిసింది.

అదో కప్పల తక్కెడ

కాంగ్రెస్‌లో ఒకరి మాట మరొకరు వినరు

వాళ్లను నమ్మితే కుక్కతోక పట్టి గోదావరి ఈదినట్లే..: పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్



ఖమ్మంలో స్పోర్ట్స్ పార్క్‌ను ప్రారంభించిన అనంతరం ఫుట్‌బాల్ ఆడుతున్న కేటీఆర్

- రేవంత్ రూ. 50 కోట్లతో పీసీసీ చీఫ్ పదవి తెచ్చుకున్నాడని కోమటిరెడ్డే అన్నారు
- మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే..
- సత్తుపల్లి నియోజకవర్గం అంతా దళితబంధు అమలు చేస్తాం
- ఎన్టీఆర్ పేరులో పవర్ ఉంది..
- ఖమ్మం పర్యటనలో మంత్రి వ్యాఖ్యలు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ''కాంగ్రెస్ పార్టీ వారంటీ ఎప్పుడో అయిపోయింది. ఆ పార్టీ నాయకుల మాటలకే గ్యారంటీ లేదు. ఇక ప్రజలకు ఏం గ్యారంటీ ఇస్తారు? కాంగ్రెస్ పార్టీ కప్పల తక్కెడ. ఒకరు పైకి ఎక్కుతుంటే నలుగురు కిందకు లాగుతారు. ఒకరి మాట ఒకరు వినరు. 150 ఏళ్ల ముసలినక్క కాంగ్రెస్‌ను నమ్మితే కుక్కతోక పట్టుకుని గోదారి ఈదినట్టే..'' అని ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. శనివారం ఆయన ఖమ్మం జిల్లా ఖమ్మం, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల్లో రూ.1,797.52 కోట్ల పథకాలు, ప్రాజెక్టులకు

మిగతా 12వ పేజీలో ▶

నారా లోకేశ్‌కు సీఐడీ నోటీసులు

ఇన్నర్ రింగ్‌రోడ్ అలైన్‌మెంట్ స్కామ్‌లో 41ఏ కింద నోటీసులు అందజేసిన అధికారులు

ఈ కేసులో ఏ14గా లోకేశ్

- ఢిల్లీలో ఎంపీ గల్లా జయదేవ్ ఇంట్లో అందజేసిన అధికారులు..
- 4వ తేదీన తాడేపల్లి కార్యాలయంలో హాజరు కావాలి
- హెరిటేజ్ ఫుడ్స్ బ్యాంకు ఖాతా, భూలావాదేవీల బోర్డు మినిట్స్ తేవాలి.. విచారణకు సహకరించాలి.. నిబంధనలు పాటించకుంటే అరెస్టు తప్పదు
- నోటీసుల్లో పేర్కొన్న దర్యాప్తు అధికారులు
- సీఐడీ పెట్టినవి దొంగ కేసులన్న లోకేశ్
- సీఐడీ వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగమని ఆరోపణ

3లో



ఢిల్లీలో సీఐడీ అధికారులు ఇచ్చిన నోటీసును చూస్తున్న టీడీపీ నేత నారా లోకేశ్

బీఆర్‌ఎస్‌ది అసమర్థ పాలన

తెలంగాణ ప్రజలంతా విసిగిపోయి ఉన్నారు: మోదీ

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండూ వంశపారంపర్య పార్టీలేనని ఫైర్
- వాటికి ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యం లేదని మండిపాటు..
- నేడు పాలమూరులో ప్రధాని పర్యటన
- భారీగా అభివృద్ధి కార్యక్రమాలు.. ఆ వెంటనే రాజకీయసభతో ద్విముఖ వ్యూహం.. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులు, చేసిన సాయాన్ని ప్రస్తావించనున్న మోదీ
- ఇదే సమయంలో బీఆర్‌ఎస్ సర్కారు వైఫల్యాలను ఎండగట్టే చాన్స్
- ఈ సభతో ఎన్నికల శంఖారావాన్ని పూరించినట్టే అంటున్న బీజేపీ వర్గాలు



సాక్షి, హైదరాబాద్/ సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీఆర్‌ఎస్ అసమర్థ పాలనతో ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌పైనా అంతే అవిశ్వాసంతో ఉన్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండూ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యం లేని వంశపారంపర్య పార్టీలేనని మండిపడ్డారు. ఈ మేరకు శనివారం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్ (ట్విట్టర్)'లో ట్వీట్ చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో తెలంగాణ బీజేపీ నేతృత్వంలో జరిగే బహిరంగ సభలో తాను ప్రసంగించనున్నట్టు మోదీ తెలిపారు. అక్కడ రూ.13,500 కోట్లకుపైగా విలువైన రహదారులు, కనెక్టివిటీ, ఎనర్జీ, రైల్వే, ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించి, శంకుస్థాపన చేసేందుకు ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులతో తెలంగాణ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ప్రధాని మోదీ ఆదివారం మహబూబ్‌నగర్

మిగతా 12వ పేజీలో ▶

నన్నెవరూ ఆపలేరు



నాపై రాళ్లు రువ్వితే వాటితోనే కోట కట్టుకుంటా

పిన్నులతో గుచ్చితే ఆ రక్తంతోనే జీవిత చరిత్ర రాసుకుంటా

- గవర్నర్‌గా వచ్చినప్పుడు రాష్ట్రంలో మహిళా మంత్రుల్లేరు
- 'మహిళా బిల్లు' కృతజ్ఞత కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై

2లో

కాంగ్రెస్ వాళ్లది ఉత్త విద్యుత్

కరెంటు గురించి మాట్లాడే అర్హత ఆ పార్టీ నాయకులకు లేదు

కేసీఆర్‌కు దైవ బలం ఉంది కాబట్టే కరువు లేదు

- బాబు, కిరణ్ హయాంలో కరువే కరువు
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్

2లో



అనాథ శిశువు శ్రీజతో హరీశ్‌రావు

మోగని మోత

టీడీపీ చప్పుడు కార్యక్రమానికి ప్రజల్లో మద్దతు కరువు

- అక్కడక్కడా పార్టీ నేతలు, కార్యకర్తల హడావుడితోనే సరి.. కొన్నిచోట్ల రోడ్లపై హారన్లతో ప్రజలకు అసౌకర్యం
- చంద్రబాబు అవినీతిని సమర్థిస్తుండటంపై సామాన్య ప్రజల అసహనం



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రిమాండు ఖైదీగా రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబుకి మద్దతుగా తెలుగుదేశం పార్టీ చేపట్టిన మోత మోగించే కార్యక్రమాన్ని ప్రజలు పట్టించుకోలేదు. శనివారం రాత్రి 7 నుంచి 7.05 గంటల వరకు ప్రజలంతా ఇళ్ల నుంచి బయటకు వచ్చి గంటలు, పళ్లాలు మోగించి మద్దతు తెలపాలని టీడీపీ పిలుపునిచ్చింది. దీనిని సామాన్య ప్రజలెవరూ పట్టించుకోలేదు. పైగా, చంద్రబాబు అవినీతిని సమర్థిస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. అక్కడక్కడా టీడీపీ నేతలు, కార్యకర్తలు కొంత హడావుడి చేశారు. కొందరు పార్టీ నేతలు అత్యుత్సాహంతో రోడ్లపై వాహనాల హారన్లు మోగించడంతో సాధారణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పార్టీ నేతల డప్పు కార్యక్రమాన్ని చూసి ప్రజలు విస్తుపోయారు. రాజమండ్రిలో నారా బ్రాహ్మణి, హైదరాబాద్‌లో భువనేశ్వరి, ఢిల్లీలో లోకేశ్ పెద్ద డప్పులను వాయించి సోషల్ మీడియాలో పెట్టారు. అవినీతి కేసులో చంద్రబాబు అరెస్టయితే దానికి సమాధానం చెప్పకుండా రకరకాలుగా దాన్ని సమర్థించుకోవడమేమిటని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

బాబు అరెస్టును పట్టించుకోని ప్రజలు

చంద్రబాబు అరెస్టుపై మొదటి నుంచీ ప్రజల్లో స్పందన కనిపించడంలేదు. మొదట్లో ఆయన

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

కేసీఆర్ సర్కార్‌కు కౌంట్‌డౌన్ మొదలు



'కేసీఆర్ సర్కార్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది.. ప్రగతిభవన్‌లో కేసీఆర్ ఉండేది 90 రోజులే.. ఆ తర్వాత శాశ్వతంగా ఫాంహౌస్‌లోనే ఆయన ఉండబోతున్నారు' అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్ హఠావో.. తెలంగాణ బచావో... ఇది తెలంగాణ ప్రజల నినాదం' అన్నారు.

- వివరాలు 2లో

వందేభారత్ వర్సెస్ గరుడ ప్లస్!



ఇటీవలే ప్రారంభమైన కాచిగూడ–బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఆదరణ లభించడం.. ప్రతి ట్రిప్పులో దాదాపు 500 మంది ప్రయాణికులు ఈ రైల్లో ప్రయాణిస్తుండటంతో ఇది హైదరాబాద్–బెంగళూరు మధ్య పగటిపూట తిరిగే ఆర్టీసీ గరుడ బస్సులపై కొంత ప్రభావం చూపుతోంది.

- వివరాలు 14లో

మర్రిగూడ తహసీల్దార్ ఇంట్లో రూ. 2 కోట్ల నగదు



ఆదాయానికి మించిన అక్రమ ఆస్తులు కలిగి ఉన్నారనే సమాచారంతో ఏసీబీ అధికారులు నల్లగొండ జిల్లా మర్రిగూడ తహసీల్దార్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి ఇంటిపై దాడి చేశారు. ఒక ఇనుప పెట్టెలో రెండు కోట్ల ఏడు లక్షల నగదు, కిలో బంగారు నగలు, డాక్యుమెంట్లు దొరికాయి.

- వివరాలు 3లో

డ్రైనేజీలో పడి.. కొట్టుకుపోయి మహిళా పోలీస్ మృతి

కేటీఆర్ పర్యటన బందోబస్తుకు భద్రాద్రికి వచ్చి మృత్యువాత



3లో

ఇదండీ సంగతి



పర్వాలేదు.. ఇప్పుడు హ్యాపీగా దాచుకోండి డబ్బు!!

క్లుప్తంగా...

అధికారంలోకి ఎవరొచ్చినా మేం చెప్పినట్లు వినాల్సిందే

అక్బరుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఏ పార్టీ అధికాంలోకి వచ్చినా తాము చెప్పినట్లు వినాల్సిందేనని ఎంఐఎం పార్టీ శాసన సభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాతబస్తీ బండ్లగూడలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఏ పార్టీ బలంగా ఉన్నా అధికారంలో కూర్చోబెట్టేది తామేనని అన్నారు. చంద్రబాబు నుంచి కేసీఆర్ వరకు అందరి సీఎంలతోనూ పనులు చేయించామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అనేక పార్టీలు ఉన్నా ముస్లింల అభివృద్ధికి పాటుపడిన పార్టీ బీఆర్ఎస్ అని కొనియాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా లేదని, అందుకే ఇతర పార్టీల లీడర్లను తెచ్చి నింపుకుంటోందని అన్నారు. రేవంత్‌రెడ్డి పార్టీలు మారి వచ్చి టీపీసీసీ చీఫ్ అయ్యారని ఎద్దేవా చేశారు. మొదట ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా పని చేసిన రేవంత్ ఆ తర్వాత తెలుగుదేశం, ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు.

సంజయ్ అంటే ఎంఐఎం, బీఆర్ఎస్‌లకు భయం

ఎమ్మెల్యే రాజాసింగ్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ నివాసంపై ఎంఐఎం కార్యకర్తల దాడిని గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ ఖండించారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని సంజయ్ ప్రకటించడంతో ఎంఐఎం, బీఆర్ఎస్ నేతలకు భయం పట్టుకుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఐఎం నేతలు, కార్యకర్తలకు అన్నివిధాలుగా సహాయం చేస్తామని చెప్పిన బీసీ మంత్రి గంగుల కమలాకర్ ఈ విధంగా సహాయపడుతున్నారా? అని ప్రశ్నించారు. 'సంజయ్ దేనికీ భయపడరు, గుర్తుంచుకోండి. మీరు ఒక్క రాయి వేస్తే, మీపై 100 రాళ్లు పడతాయి, ఎవరు అడ్డుపడినా, ఎన్ని దాడులు చేసినా సంజయ్ తప్పకుండా పోటీ చేస్తారు, గెలుస్తారు' అని పేర్కొన్నారు.


6న లండన్‌లో సదస్సుకు ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: 'రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం' అనే అంశంపై ఈ నెల 6న లండన్‌లోని 'సెంట్రల్ హాల్ వెస్ట్ మినిస్టర్' జరిగే సదస్సులో కీలకోపన్యాసం చేయాల్సిందిగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఆహ్వానం అందింది. పబ్లిక్ పాలసీ రంగంలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ 'బ్రిడ్జ్ ఇండియా' కవితను ఈ సమావేశానికి ఆహ్వానించింది. పార్లమెంటు ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడాన్ని స్వాగతిస్తూ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు కవితకు పంపిన ఆహ్వాన పత్రంలో 'బ్రిడ్జ్ ఇండియా' పేర్కొంది. రాజకీయాల్లో, ప్రజాస్వామ్య ప్రక్రియలో మహిళల భాగస్వామ్యం పెరగడానికి కవిత విశేషంగా కృషి చేశారని ఆ సంస్థ ప్రశంసించింది. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం అనేక ఆందోళన కార్యక్రమాలను చేపట్టారని, వివిధ రాజకీయ పార్టీల మద్దతును కూడగట్టడంలో కీలకపాత్ర పోషించారని వివరించింది.

బీజేపీకి రాజీనామా

ఇండిపెండెంట్‌గా బరిలోకి..: మాజీ ఎమ్మెల్యే సోమారపు ప్రకటన



గోదావరిఖని: భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేస్తున్నానని పెద్దపల్లి జిల్లా రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ ప్రకటించారు. గోదావరిఖని శివాజీనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటానని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి పని చేసేలా ఉన్నాయని వ్యాఖ్యానించారు. గతంలో తాను చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రామగుండంలో వ్యవస్థ గాడి తప్పిందని విమర్శించారు. సమావేశంలో మాజీ మేయర్ జాలి రాజమణి తదితరులు పాల్గొన్నారు.

జనగామలో కొందరు కుట్రలు చేస్తున్నారు

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



జనగామ: జనగామ బీఆర్ఎస్‌లో రాజకీయ కుట్రలకు తెరలేపారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గ ముఖ్యులు, కార్యకర్తలతో సమావేశంలో ఆయన మాట్లాడారు. జనగామ బీఆర్ఎస్‌లో కొందరు వర్గాలను ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేలను కాదని మంత్రులే కాదు.. మరెవరూ కార్యక్రమాలు చేయవద్దని స్వయంగా కేసీఆర్ చెప్పాక కూడా ఈ కుతంత్రాలు ఏమిటని ప్రశ్నించారు. గతంలో నిడిగొండ సమావేశం వద్దని కేటీఆర్ ఆదేశించినా, కొందరు అక్కడే సమావేశం కావడం అధిష్టానాన్ని ధిక్కరించడమే అవుతుందని అన్నారు.

నన్నెవరూ ఆపలేరు

ప్రొటోకాల్ ఇవ్వకున్నా ధైర్యంగా పనిచేసుకెళ్తే ఎవరూ ఏమీ చేయలేరు

- నాపై రాళ్లు రువ్వితే వాటితోనే కోట కట్టుకుంటా
- పిన్నులతో గుచ్చితే ఆ రక్తంతోనే జీవిత చరిత్ర రాసుకుంటా.. విమర్శలు పట్టించుకోను
- గవర్నర్‌గా వచ్చినప్పుడు రాష్ట్రంలో మహిళా మంత్రుల్లేరు
- 'మహిళా బిల్లు' కృతజ్ఞత కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



శనివారం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై

సాక్షి, హైదరాబాద్: 'గవర్నర్‌గా రాష్ట్రానికి వచ్చినప్పుడు రాష్ట్రంలో మహిళా మంత్రులెవరూ లేరు. కానీ ఉదయం గవర్నర్‌గా ప్రమాణస్వీకారం చేసి సాయంత్రం ఇద్దరు మహిళా మంత్రులతో ప్రమాణం చేయించడం సంతోషకరంగా భావించా' అని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పరోక్షంగా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. రాజకీయాల్లో మహిళలకు 33 శాతం కోటా కోసం మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రం తెచ్చినందుకు కృతజ్ఞతగా శనివారం రాజ్‌భవన్‌లో వివిధ రంగాల మహిళా ప్రముఖులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

వెన్ను చూపితే ఇంకా వేగం పెంచుతా...

'ఏదైనా అడ్డంకులొస్తే భావోద్వేగానికి గురై పని చేయడం మానేసే అలవాటును మహిళలు వీడాలని గవర్నర్ తమిళిసై సూచించారు. గౌరవం లభించినా, లభించకపోయినా ధైర్యంగా ముందుకు వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర ప్రభుత్వంతో తన ప్రొటోకాల్ వివాదాన్ని మళ్లీ ప్రస్తావించారు. 'ప్రొటోకాల్ ఇచ్చినా, ఇవ్వకపోయినా ధైర్యంగా పని చేసుకుంటే ఎవరూ ఏమీ చేయలేరు. మీరొచ్చి నాకు పుష్పాన్ని ఇస్తే స్వీకరిస్తా. వెన్ను చూపిస్తే మాత్రం ఇంకా వేగంతో ముందుకుపోతా. దారిలో ముళ్లుంటే తీసి పడేసి ముందుకు సాగుతా. నాపై రాళ్లు రువ్వితే వాటితోనే కోటను నిర్మించుకుంటా. నన్ను పిన్నులతో గుచ్చినా వచ్చే ఆ రక్తంతోనే నా జీవిత చరిత్ర రాసుకుంటా. నన్ను ఎవరూ ఆపలేరు. నియంత్రించలేరు. విమర్శలు, అవమానాలను పట్టించుకోను. ఇదే నా సందేశం' అని గవర్నర్ తమిళిసై అన్నారు.

బీజేపీలో నాడే 33% మహిళా కోటా..

బీజేపీలో మహిళా కోటాను అమలు చేయడంతో చాలా మంది ప్రతిభావంతులైన మహిళలు ఆ పార్టీలో చేరారని గవర్నర్ తమిళిసై అన్నారు. తాను గతంలో బీజేపీలో పనిచేసిన విషయం అందరికీ తెలుసని, ఈ విషయాన్ని దాచుకోనని చెప్పారు. ఇప్పుడు పరిపాలనపరమైన పదవికి మారానని గుర్తుచేశారు. నాటి బీజేపీ అధ్యక్షులు రాజ్‌నాథ్ సింగ్ పార్టీ పదవుల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని నిర్ణయించి పార్టీ శాసనాన్ని ఆ మేరకు సవరించారని తెలిపారు. దీంతో చాలా మంది మహిళలు బీజేపీలో చేరారన్నారు. మహిళా రిజర్వేషన్లతో ఇకపై మహిళలూ రాజకీయాల్లో వచ్చేందుకు ఉత్సాహం లభిస్తుందన్నారు. ఈస్ట్రోజన్ (మహిళల హార్మోన్లు) చాలా శక్తివంతమైనదని, మహిళలు గొప్ప పాలనాదక్షులు అని తెలిపారు. రిజర్వేషన్లు 33 శాతమే కావచ్చని, 50% అవకాశాల కోసం కష్టపడాలని సూచించారు.

రిజర్వేషన్లు బినామీలు, భార్యల కోసం కాదు

ప్రధాని మోదీ బలమైన నాయకత్వంతోనే మహిళా రిజర్వేషన్లు సాధ్యమయ్యాయని, ఇవి సమాజానికి ఉపయోగపడాలని గవర్నర్ తమిళిసై ఆకాంక్షించారు. బినామీలు, కుమార్తెలు, భార్యలు, తల్లులను రాజకీయాల్లోకి తీసుకురావడం కోసం రిజర్వేషన్లను వాడకూడదని కోరారు. తాను రాజకీయ నేత కుమార్తె అయినప్పటికీ ఎన్నడూ ఆ కార్డును వాడుకోలేదన్నారు. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి ఎదిగి పైకి వచ్చినట్లు చెప్పారు. మహిళల చేతిలోకి పాలన వస్తే పేదరికం, అనారోగ్యం కనుమరుగు అవుతాయన్నారు. మహిళా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మహిళా బిల్లుకు ఆమోదం తెలపడం గొప్ప విషయమన్నారు. రాజకీయాల్లో మహిళలు పురుషుల కంటే 10–20 రేట్లు ఎక్కువగా పనిచేస్తేనే పదవుల కోసం కేవలం పేర్లను పరిశీలిస్తారని, ఇస్తారో లేదో గ్యారెంటీ లేదని గవర్నర్ తమిళిసై ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు 50 రేట్లు అధికంగా పనిచేయాల్సి ఉంటుందనేది తన అభిప్రాయమన్నారు.

పాతికతో సర్దుకోండి

▶ మొదటి పేజీ తరువాయి

చెప్తున్నారనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

ఇతర పదవులు ఇస్తామంటూ...

ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌తోపాటు తెలంగాణలోని సామాజిక ముఖచిత్రం నేపథ్యంలో ఈసారి తమకు 40 అసెంబ్లీ స్థానాల్లో పోటీకి అవకాశం కల్పించాలని కాంగ్రెస్ బీసీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు 50 మందికిపైగా నేతల పేర్లతో అధిష్టానానికి జాబితా అందజేశారు. కనీసం పీసీసీ చీఫ్ చెప్పినట్లు, రాజకీయ వ్యవహారాల కమిటీలో తీసుకున్న నిర్ణయం మేరకు 34 అసెంబ్లీ స్థానాలైనా ఇవ్వాలని వారు కోరుతున్నారు. కానీ 25కి మించి ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో రాష్ట్ర కాంగ్రెస్ నేతలు మల్లగుల్లాలు పడుతున్నట్టు సమాచారం. రేవంత్ మాట ప్రకారం 34 సీట్లు ఇచ్చే పరిస్థితి లేకుంటే.. ఎన్ని తక్కువ ఇస్తే అన్ని నామినేటెడ్ పదవులు (ఎమ్మెల్సీ) ఇస్తామని, తెలంగాణలో అధికారంలోకి వచ్చాక 9 ఎమ్మెల్సీ స్థానాలను బీసీలకు కేటాయిస్తామని టికెట్ల కేటాయింపు సమయంలోనే పార్టీ పక్షాన అధికారికంగా ప్రకటిస్తారనే చర్చ జరుగుతోంది. దీంతోపాటు బీఆర్ఎస్ నుంచి నలుగురు బీసీలు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో.. కాంగ్రెస్ పార్టీ కూడా నలుగురు బీసీ నేతలకు రాజ్యసభ అవకాశం కల్పిస్తుందన్న హామీపై చర్చ జరుగుతోంది.

నేను పార్టీ మారడం లేదు

ఎంపీ సోయం బాపూరావు స్పష్టీకరణ



కైలాస్‌నగర్: పార్టీ మారుతున్నట్లు కొద్దిరోజులుగా తనపై జరుగుతున్న ప్రచారం పూర్తి అవాస్తవమని, తాను ఏ పార్టీలోకీ వెళ్లడం లేదని ఎంపీ సోయం బాపూరావు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, పార్టీ మార్పుపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వేలైన్ ఏర్పాటు ప్రజల చిరకాల కోరిక అని, దాన్ని నెరవేర్చే ఉద్దేశంతో రెండు నెలలుగా ఢిల్లీలోనే ఉండాల్సి వచ్చిందన్నారు. ఈ రైల్వే లైన్‌కు సంబంధించి ఫైనల్ లోకేషన్ సర్వే వరకు తెచ్చానని, వచ్చే బడ్జెట్‌లో దానికి కేంద్రం నిధులు కేటాయించే అవకాశముందని తెలిపారు. స్థానికంగా పార్టీకి సమయం ఇవ్వకపోవడంతో తాను కాంగ్రెస్‌లోకి వెళుతున్నట్లుగా ప్రచారం జరిగిందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ బలపడుతుండటాన్ని తట్టుకోలేక బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు తనపై దుష్ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. తాను బీజేపీలోనే కొనసాగుతానని బాపూరావు స్పష్టం చేశారు.

బీసీలకు సీట్లపై ఆందోళన వద్దు

టికెట్ల కేటాయింపు అంశం మా దృష్టిలో ఉంది: ఖర్గే



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ నేతలకు సీట్ల కేటాయింపు విషయంలో ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. తెలంగాణలో బీసీలకు కనీసం 34 సీట్లు కేటాయించాలన్న డిమాండ్‌తో గత రెండు రోజులుగా ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలను కలుస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ బీసీ నేతలు పలువురు శనివారం సాయంత్రం ఖర్గేతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై ఖర్గే ఆరా తీశారు. బీసీ నేతలు చేస్తున్న కనీసం 34 స్థానాల డిమాండ్‌పై మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ నేతృత్వంలోని బృందంతో చర్చించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, కత్తి వెంకటస్వామి సహా పలువురు తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతలతో కలసి మధుయాష్కీ గౌడ్ మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో సామాజిక సమతౌల్యం పాటించడంతో పాటు బీసీలకు సీట్ల కేటాయింపుపై ఖర్గేతో చర్చించామని... తెలంగాణ అంటే తనకు ప్రత్యేక శ్రద్ధ అని ఖర్గే అన్నారని మధుయాష్కీ చెప్పారు. సర్వేలు సహా ఇతర అన్ని విషయాలు తమ దృష్టిలో ఉన్నాయని తెలిపారన్నారు. ఈ విషయంలో పాత, కొత్త నేతలెవరూ ఆందోళన చెందొద్దని ఖర్గే హామీ ఇచ్చారని.. ఈ అంశంపై ఖర్గేతో చేపట్టిన చర్చలతో అధిష్టానంపై తమకు పూర్తి విశ్వాసం ఏర్పడిందని తెలిపారు. సీట్ల కేటాయింపు విషయంలో తెలంగాణలో అన్ని వర్గాలకు సమతుల్యం పాటించేలా అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో అన్ని వర్గాలు కలసి కట్టుగా కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని ఖర్గే సూచించారని మధుయాష్కీ తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న పూర్తి రాజకీయ పరిణామాలపై ఖర్గేకు పూర్తి అవగాహన ఉందని... రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. తెలంగాణలో బీసీలకు ఎలాంటి అన్యాయం జరగదని మధుయాష్కీ భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటా

నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటానని బీఆర్ఎస్ నేత, ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు నీలం మధు ముదిరాజ్ ప్రకటించారు. బడుగు, బలహీనవర్గాల సమస్యల పరిష్కారమే మేనిఫెస్టోగా ముందుకు వెళ్తానని చెప్పారు. శనివారం ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో ఇక్కడ నిర్వహించిన మహాపాదయాత్రకు భారీగా జనం తరలివచ్చారు. పటాన్‌చెరు పట్టణంలోని మైత్రీ గ్రౌండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేశారు. అంబేడ్కర్ చౌక్ నుంచి బీరంగూడ మల్లికార్జున స్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అక్కడ ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో బీసీ బిడ్డగా గొంతెత్తుతానని చెప్పారు.

కేసీఆర్ సర్కార్‌కు కౌంట్‌డౌన్ మొదలు

- ప్రగతి భవన్‌లో కేసీఆర్ ఉండేది ఇక 90 రోజులే
- ఆ తర్వాత శాశ్వతంగా ఫాంహౌస్‌లోనే కేసీఆర్
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు
- బీజేపీలో చేరిన మాజీ మంత్రులు సి. కృష్ణయాదవ్, జె.చిత్తరంజన్ దాస్



ఈటల, కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన మాజీ మంత్రులు కృష్ణయాదవ్, చిత్తరంజన్‌దాస్

సాక్షి, హైదరాబాద్: 'కేసీఆర్ సర్కార్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది.. ప్రగతి భవన్‌లో కేసీఆర్ ఉండేది కేవలం 90 రోజులే.. ఆ తర్వాత శాశ్వతంగా ఫాంహౌస్‌లోనే ఆయన ఉండబోతున్నారు' అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'ప్రగతి భవన్.. కేసీఆర్ కుటుంబ భవన్ తప్ప తెలంగాణ ప్రజలది కాదు. కేసీఆర్ కుటుంబం రూ. వేల కోట్ల దోపిడీ చేసింది. అందుకే అడుగడుగునా బీఆర్ఎస్‌ను ప్రజలు నిలదీస్తున్నారు. కేసీఆర్ హఠావో.. తెలంగాణ బచావో... ఇది తెలంగాణ ప్రజల నినాదం' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధాని మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు రాష్ట్రానికి వస్తుంటే వాటిలో పాల్గొనే తీరికలేని, కుట్రలు చేసే సీఎం తెలంగాణకు అవసరమా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు పన్నినా.. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. శనివారం పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, పార్టీ నేత టి. ఆచారిల సమక్షంలో మాజీ మంత్రులు సి. కృష్ణయాదవ్, జె.చిత్తరంజన్‌దాస్, సిర్పూర్ జెడ్పీటీసీ రేఖా సత్యనారాయణ, మరో నేత బండల రామచంద్రారెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి కిషన్‌రెడ్డి, ఈటల, అరుణ కాషాయ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అనేక సర్వేల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఓటమి ఖాయమని తెలియడంతో కేసీఆర్ బీజేపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాదు

కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే బీఆర్ఎస్‌కు ఓటేసినట్టేనని కిషన్‌రెడ్డి ఆరోపించారు. గెలిచే పరిస్థితి లేదు కాబట్టే ఇష్టమొచ్చిన హామీలను కాంగ్రెస్ ఇస్తోందని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీలు కాదు... 60 గ్యారెంటీలు ఇచ్చినా కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి రాదన్నారు.

పార్టీ గెలుపునకు కృషి: కృష్ణయాదవ్, చిత్తరంజన్‌దాస్

'రాష్ట్రంలో కుటుంబ పాలనను అంతం చేయాల్సిన అవసరం ఉంది. కిషన్‌రెడ్డి నాయకత్వంలో సైనికుడిలా పనిచేస్తా. పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తా' అని మాజీ మంత్రి కృష్ణయాదవ్ చెప్పారు. మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపులో నా పాత్ర కూడా ఉంటుందని అనుకుంటున్నా' అని పేర్కొన్నారు.

తిరుగులేని శక్తిగా బీజేపీ ఎదగనుంది: ఈటల

'బీఆర్ఎస్‌కు బీజేపీని ప్రత్యామ్నాయంగా ప్రజలు భావిస్తున్నారని ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది బీజేపీలోకి వస్తున్నారని... రాబోయే కాలంలో తెలంగాణ గడ్డపై తిరుగులేని శక్తిగా బీజేపీ ఎదగబోతోందని చెప్పారు. డీకే అరుణ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలన్నారు.

కాంగ్రెసోళ్లది ఉత్త కరెంటు

- ఉచిత విద్యుత్ గురించి మాట్లాడే అర్హత వారికి లేదు
- కేసీఆర్‌కు దైవ బలం ఉంది కాబట్టే కరువు లేదు
- బాబు, కిరణ్ హయాంలో కరువే, కరువు: మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట జోన్: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కరెంట్ గురించి అడిగే నైతిక హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్ రావు తేల్చిచెప్పారు. కాంగ్రెస్ పాలనలో ఉచిత కరెంట్‌ను ఉత్త కరెంట్‌గా మార్చిన కాంగ్రెసోళ్లు ఇప్పుడు సిగ్గు లేకుండా కరెంట్ గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. శనివారం సిద్దిపేట జిల్లా నర్మెటలో రూ.300 కోట్లతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. జిల్లా కేంద్రంలో సఖి, భరోసా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ 'సీఎం కేసీఆర్ సంకల్పానికి దైవబలం ఉంది.. ఆయన పనిమంతుడే కాదు దేవున్ని బాగా కొలుస్తారు, నమ్ముతారు. అందుకే తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రంలో కరువే లేదు' అని వ్యాఖ్యానించారు. అదే చంద్రబాబు, కిరణ్ కుమార్‌రెడ్డి హయాంలో కరువుతో రాష్ట్ర ప్రజలు అల్లాడిపోయారని గుర్తుచేశారు. చాలా రాష్ట్రాల్లో కరువు వచ్చినా తెలంగాణలో కాళేశ్వరం వల్ల ఆ ఛాయలు లేవన్నారు. ఒక్కప్పుడు ఐటీ అని కలవరించిన చంద్రబాబు ఇప్పుడు తెలంగాణ భూముల విలువ గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. కాగా, ఈ వయసులో ఆయనను అరెస్టు చేయడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో డీజీపీ అంజన్‌కుమార్, అదనపు డీజీ (ఉమెన్ సేఫ్టీ) షికాగోయల్, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్, ఉద్యానవన శాఖ కమిషనర్ హన్మంత రావు, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, కలెక్టర్ పాటిల్ పాల్గొన్నారు.

శతమానం భవతి.. శ్రీజ

సిద్దిపేటలో రూ 30 లక్షలతో ఏర్పాటు చేసిన శిశుగృహ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఆ సమయంలో అక్కడి సిబ్బంది చేతిలో ఓ మూడు నెలల పసికందు చిరునవ్వులు చిందించడంతో ఆయన అబ్బురపడ్డారు. వెంటనే పసికందును ఎత్తుకొని సిబ్బంది ద్వారా వివరాలు సేకరించారు. మూడు నెలల క్రితం పసికందును విక్రయించే క్రమంలో అడ్డుకొని సంరక్షణ బాధ్యతలు స్వీకరించినట్టు వారు మంత్రి దృష్టికి తెచ్చారు. కాగా ఇప్పటివరకు పేరులేకుండా ఉన్న ఆ పసికందుకు శ్రీజ అని నామకరణం చేశారు. నిండు నూరేళ్ల శ్రీజ ముఖంలో చిరునవ్వులు వెల్లివిరియాలని దీవించారు.

తెలంగాణను నాశనం చేయడమే వారి పని

- బీఆర్ఎస్, ఎంఐఎం కలసి కుట్ర చేస్తున్నాయి: బండి సంజయ్
- ఎంఐఎం కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో బీఆర్ఎస్, ఎంఐఎం కలసి విధ్వంసం సృష్టించేందుకు కుట్ర చేస్తున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. ''ఎంఐఎం కార్యకర్తలు నా ఇల్లు, ఆఫీస్‌పైకి ర్యాలీగా వెళ్లి దాడికి యత్నిస్తే పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదు. ఆత్మరక్షణ కోసం యత్నించిన బీజేపీ కార్యకర్తలపై ఉల్టా కేసులు పెట్టడం ద్వారా సమాజానికి ఏ సంకేతాలు పంపుతున్నారు? మా సహనాన్ని చేతగానితనంగా భావిస్తే.. ఖబడ్దార్..'' అని హెచ్చరించారు. శనివారం ఢిల్లీలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. కొందరు పోలీసులు ప్రమోషన్లు, పోస్టింగుల కోసం బీఆర్ఎస్ చెప్పుచేతల్లో పనిచేస్తున్నారని.. బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసి కేసులు పెడుతున్నారని ఆరోపించారు. అదే బీఆర్ఎస్, ఎంఐఎం నేతలు, కార్యకర్తలు కుట్రలు చేస్తున్నా పట్టించుకోవట్లేదని పేర్కొన్నారు. ఎంఐఎం అడ్డా అని చెప్పుకుంటున్న పాతబస్తీకి వెళ్లి కాషాయ జెండా ఎగరేసిన చరిత్ర తమదని.. ఒక పార్టీకి, వర్గానికి కొమ్ము కాస్తే దీటుగా ఎదుర్కొనే సత్తా బీజేపీకి ఉందనే సంగతిని పోలీసులు, బీఆర్ఎస్ నేతలు గుర్తుంచుకోవాలని సంజయ్ వ్యాఖ్యానించారు. ముస్లిం మేధావులు కూడా ఎంఐఎం ఆగడాలను చీదరించుకుంటున్నారని విమర్శించారు. ఎంఐఎం, బీఆర్ఎస్ అరాచకాలను, ఆగడాలను ఆపేదాకా బీజేపీ పోరాడుతుందన్నారు. బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

అన్ని లెక్కలూ తేలుస్తాం..

మంత్రి కేటీఆర్ ట్వీట్‌కు రేవంత్ రీట్వీట్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఎన్ని ప్రభుత్వ భూములను అమ్ముకున్నారో, ఎన్ని ఎకరాలను రియల్ ఎస్టేట్ మాఫియాకు కట్టబెట్టారో, ఎంత మంది బినామీ బిల్డర్లతో మాఫియా సామ్రాజ్యాన్ని నడిపిస్తున్నారో, ఎన్ని లక్షల చదరపు అడుగుల స్థలాలు మాఫియా కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయో.. అన్నీ లెక్కలతో సహా తేలుస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం బెంగళూరుకు చెందిన బిల్డర్లపై చదరపు గజానికి రూ.50 చొప్పున పొలిటికల్ ఎలక్షన్ ట్యాక్స్ విధిస్తోందని, ఆ డబ్బులన్నింటినీ తెలంగాణకు తరలించాలని చూస్తోందని మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్‌కు రేవంత్ ఈ విధంగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను చూసి తండ్రికి చలిజ్వరం పట్టుకుంటే, కొడుకు పూర్తిగా మతి తప్పి మాట్లాడుతున్నారని, నిండా అవినీతిలో మునిగి నిద్రలో కూడా కమీషన్ల గురించి కలవరించే బీఆర్ఎస్ నేతలు, కాంగ్రెస్ గురించి మాట్లాడతారా అని రేవంత్ రీట్వీట్ చేశారు. పక్క రాష్ట్రం గురించిన మాటలను పక్కనపెడితే తెలంగాణలోని కల్వకుంట్ల 'స్కామిలీ' గురించి చెప్పాలని, దళితబంధులో 30 శాతం కమీషన్ల గురించి, లిక్కర్‌స్కామ్‌లో కవిత వెనుకేసిందని దేశమంతా చెప్పుకుంటున్న రూ.300 కోట్ల ఆరోపణల గురించి, భూములు, లిక్కర్ అమ్మితే తప్ప తెలంగాణలో పాలన నడవడం లేదని కాగ్ కడిగేసిన విషయాల గురించి చెప్పాలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ను అడ్డుకోవడం కేటీఆర్ వల్ల కాదని ఆ ట్వీట్‌లో రేవంత్ స్పష్టం చేశారు.

సునీతారెడ్డికే టికెట్.. గెలిపించుకుని రండి

- నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కేటీఆర్, హరీశ్
- మీకు సముచిత స్థానం దక్కుతుందని భరోసా
- పార్టీ శ్రేణులు ఆందోళన చెందకుండా నచ్చజెప్పాలని సూచన



నర్సాపూర్: నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డికి ప్రగతి భవన్ నుంచి శనివారం రాత్రి పిలుపు వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో భేటీ అయ్యారు. నర్సాపూర్ టికెట్‌పై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా నర్సాపూర్ టికెట్ తనకే ఇవ్వాలని మదన్‌రెడ్డి కోరగా.. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డికే ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ మొగ్గు చూపుతున్నారని చెప్పినట్లు తెలిసింది. పార్టీ నిర్ణయించే అభ్యర్థి విజయం కోసం కృషి చేయాలని మంత్రులు ఆయనకు స్పష్టం చేసినట్టు చెబుతున్నారు. మీరు కేసీఆర్ సమకాలికులని, సన్నిహితులని, మీకు సీఎం అన్యాయం చేయరని మదన్‌రెడ్డికి మంత్రులు నచ్చ చెప్పారని అంటున్నారు. పార్టీ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సునీతారెడ్డికి టికెట్ ఇవ్వనున్నారని, ఆమెను గెలిపించుకుని రావాల్సి ఉంటుందని సూచించారని తెలిసింది.

మీ స్థాయికి తగిన పదవి వస్తుంది

నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు ఆందోళన చెందకుండా, వారికి తప్పుడు సమాచారం వెళ్లకుండా మీరు స్పందించాలని చెప్పినట్టు తెలుస్తోంది. ఎన్నికల అనంతరం పార్టీ అధిష్టానం మీకు తగిన ప్రాధాన్యత ఇస్తుందని, మీ స్థాయికి తగిన పదవి ఇచ్చి పార్టీ గౌరవిస్తుందని హామీనిచ్చినట్టు సమాచారం. ఇదిలాఉండగా రేపో మాపో ఒకే వేదికపై ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతారెడ్డిను కూర్చోబెట్టి చర్చలు జరిపి నర్సాపూర్ పార్టీ టికెట్‌ను అధికారికంగా బీఆర్ఎస్ ప్రకటించే అవకాశం ఉంది.

రేషన్ డీలర్ల కమీషన్ రెండింతలు పెంపు

- టన్నుకు రూ.700 నుంచి రూ.1,400కు పెంచుతూ ఉత్తర్వులు
- జీవోను జేఏసీ ప్రతినిధులకు అందజేసిన మంత్రి గంగుల



సాక్షి, హైదరాబాద్: గతంలో ఇచ్చిన హామీ మేరకు రేషన్ డీలర్ల కమీషన్‌ను ప్రభుత్వం రెండింతలు చేసింది. టన్ను బియ్యంపై రూ. 700గా ఉన్న కమీషన్‌ను రూ. 1,400 రూపాయలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ హైదరాబాద్‌లోని తన నివాసంలో రేషన్ డీలర్ల జేఏసీ ప్రతినిధులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రతిని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పెంపు తక్షణమే అమల్లోకి రానున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ఉత్తర్వుల ద్వారా ఏటా డీలర్ల కమిషన్ రూ. 303 కోట్లకు చేరనుందని, అందులో రూ. 245 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా భరిస్తుందని వెల్లడించారు. కరోనా వంటి సంక్షోభ సమయంలో రేషన్ డీలర్లు అందించిన సేవలకు గౌరవంగా సీఎం డీలర్ల కమీషన్‌ను రెండింతలు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ కేంద్రం అందించే కమీషన్‌కన్నా అదనంగా రూ.950 ఒక్కో టన్నుకు అందిస్తున్నారని తెలిపారు. అలాగే కేంద్రం జాతీయ ఆహార భద్రతా కార్డులు ఇవ్వని దాదాపు 90 లక్షల మంది పేదలకు రాష్ట్ర ప్రభుత్వమే రాష్ట్ర ఆహార భద్రత కింద పూర్తి రేషన్‌ను అదనంగా అందజేస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసే 5కిలోల బియ్యానికి అదనంగా మరో కిలోని చేర్చి ఎన్ఎఫ్ఎస్‌సీ కార్డులకు కూడా ఒక్కొక్కరికి 6 కిలోల బియ్యాన్ని అందచేస్తోందని తెలిపారు. ఇందుకోసం ఏటా రూ. 3వేల కోట్లను పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేస్తోందన్నారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల ప్రతినిధులు మంత్రిని సన్మానించి తమ కృతజ్ఞతలు తెలియజేసారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బాబు మాజీ పీఎస్ 'పెండ్యాల' సస్పెన్షన్

- ప్రభుత్వానికి చెప్పకుండా అమెరికా పారిపోయిన శ్రీనివాసరావు
- ప్రస్తుతం ప్రణాళికా శాఖలో అసిస్టెంట్ సెక్రటరీగా శ్రీనివాస్



సాక్షి, అమరావతి: ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాజీ పీఎస్ పెండ్యాల శ్రీనివాసరావుపై సస్పెన్షన్ వేటుపడింది. ఈయన ప్రస్తుతం ప్రణాళికా శాఖలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. స్కిల్ కుంభకోణం కేసుతో పాటు ఐటీ నోటీసుల్లో పెండ్యాల శ్రీనివాసరావు పేరు ఉంది. విచారణ నిమిత్తం సీఐడీ గతంలో ఆయనకు నోటీసులు కూడా జారీచేసింది. అయితే, ఆయన ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండా అమెరికాకు పారిపోయారు. ప్రభుత్వం అనుమతిలేకుండా అమెరికాకు వెళ్లడం సర్వీసు రూల్స్‌ను అతిక్రమించడమేనని ఏపీ సర్కారు స్పష్టంచేసింది. మరోవైపు.. శ్రీనివాసరావు శుక్రవారంలోగా రాష్ట్రానికి తిరిగి రావాల్సిందిగా ప్రభుత్వం నోటీసు పంపింది. అయితే, ఆయన రాకపోవడంతో సర్వీసు నిబంధనల మేరకు ఆయనను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శ్రీనివాసరావుపై సస్పెన్షన్ తదుపరి ఉత్తర్వులు జారీచేసే వరకు కొనసాగుతుందని ప్రభుత్వం అందులో స్పష్టం చేసింది. ఈ కాలంలో రాష్ట్ర హెడ్ క్వార్టర్స్‌ను విడిచి వెళ్లరాదని పేర్కొంది. సస్పెన్షన్ సమయంలో శ్రీనివాసరావుకు నిబంధనల మేరకు అలవెన్స్‌ను చెల్లించనున్నట్లు అందులో పేర్కొంది. ఈ మేరకు ఏపీ సీఎస్ డా. కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

పెండ్యాల పారిపోయింది ఇలా..

- అమెరికాలో తన తోడల్లుడి గృహప్రవేశంతో పాటు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉండటంతో సెలవు కోరుతూ ఆగస్టు 23న ఆయన ప్రభుత్వానికి లేఖ రాశారు.
- స్కిల్ కుంభకోణంలో విచారించడానికి సీఐడీ ఆయనకు నోటీసులిచ్చినట్లు సెప్టెంబర్ 5, 6 తేదీల్లో వివిధ పత్రికల్లో వార్తలు వచ్చాయి.
- దీంతో అత్యవసర ఆరోగ్య పరీక్షల కోసం తక్షణం అమెరికా వెళ్లాలంటూ సెప్టెంబర్ 5న మరో లేఖ రాశారు. కానీ, ఈ లేఖతో ఆరోగ్యానికి సంబంధించి కానీ, డాక్టరు సిఫార్సు లేఖ కానీ జతచేయలేదు
- సెప్టెంబర్ 6న ప్రభుత్వ సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతి లేకుండానే అమెరికా వెళ్లిపోయారు.
- అనంతరం.. ఆరోగ్యం బాగోలేదు దానితో వెంటనే అమెరికా వెళ్లిపోయాను, లీవ్ ఇవ్వమని కోరుతూ సెప్టెంబర్ 7న లేఖ రాశారు. సాధారణంగా ఇటువంటి సెలవులకు కనీసం 10 రోజుల ముందుగా లేఖ రాయాల్సి ఉంటుంది.
- ఇక ఉద్దేశ్యపూర్వకంగానే ఆయన హఠాత్తుగా అమెరికా వెళ్లిపోయారని నిర్ధారించుకున్న తర్వాత సెప్టెంబర్ 13న సెలవును తిరస్కరించారు. ➡ తక్షణం విధుల్లో చేరాల్సిందిగా మెమో జారీచేయగా సెప్టెంబర్ 20న సెలవు కోరుతూ మరో లేఖ రాశారు.
- ఆ తర్వాత మరో మూడ్రోజుల అదనపు సమయం ఇచ్చినా విధుల్లో చేరకపోయేసరికి ప్రభుత్వం సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది.

అసైన్డ్ భూములు కొట్టేసేందుకు.. 'నల్ల'మార్గం

బంధువులు, సన్నిహితులు, ఉద్యోగుల పేరిట అమరావతిలో భూములు హస్తగతం చేసుకున్న నారా, నారాయణ

- నారాయణ సంస్థల నుంచి నిధుల రూటింగ్
- నల్లధనం కోసం ఎన్‌స్పైర కంపెనీ ఏర్పాటు
- ఎన్‌స్పైర నుంచి ఆర్కే హౌసింగ్‌కు నిధుల బదిలీ.. అక్కడి నుంచి బినామీలకు నగదు
- అసైన్డ్ రైతులను భయపెట్టి భూముల లూటీ
- తమ బినామీలకే భూసమీకరణ ప్యాకేజీ స్థలాలు దక్కేలా వ్యూహం
- అవినీతి నెట్‌వర్క్‌ను బట్టబయలు చేసిన సిట్ దర్యాప్తు
- పచ్చగద్దల జాబితాలో గంటా, ప్రత్తిపాటి, దేవినేని ఉమా, రావెల తదితరులు
- ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీవీ వియ్యంకుడు కూడా..



సాక్షి, అమరావతి: అమరావతిలో అసైన్డ్ భూముల కుంభకోణం కేసు తీగ లాగితే నారా, నారాయణ నల్లధనం నెట్‌వర్క్ బట్టబయలైంది. అమరావతిలోని బడుగు, బలహీనవర్గాల అసైన్డ్ రైతులను బెదిరించి వారి భూములు కొల్లగొట్టడం కోసం నల్లధనం తరలించేందుకు చంద్రబాబు ముఠా పన్నిన పన్నాగం బయటపడింది. బంధువులు, బినామీలు, సన్నిహితులు, తమ ఉద్యోగుల పేరిట అసైన్డ్ భూములు హస్తగతం చేసుకునేందుకు వెచ్చించిన నల్లధనం గుట్టు రట్టయింది. అమరావతిలో అసైన్డ్ భూముల కుంభకోణం కేసు దర్యాప్తు చేస్తున్న సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఆ నల్లధనం నెట్‌వర్క్‌ను ఛేదించింది. అసైన్డ్ భూముల జాబితాలోని కేటగిరీ 1 నుంచి 4 వరకు ఉన్న 617.65 ఎకరాలను కొట్టేసేందుకు ఏర్పాటు చేసుకున్న 'నల్ల'మార్గాన్ని ఆధారాలతోసహా బట్టబయలు చేసింది. బినామీల పేరిట అసైన్డ్ భూములు కొల్లగొట్టిన ముఠా జాబితా తవ్వేతుంటే.. చంద్రబాబు, లోకేశ్, నారాయణ, గంటా, ప్రత్తిపాటి, దేవినేని ఉమా ఇలా టీడీపీ పెద్దల పేర్లు బయటపడుతున్నాయి.

నల్లధనం కోసం కంపెనీ ఏర్పాటు

నారాయణ విద్యా సంస్థలకు మౌలిక వసతుల కల్పన, ఉద్యోగుల జీతాల చెల్లింపు కోసమని 'ఎన్‌స్పైర మేనేజ్‌మెంట్ సర్వీసెస్' అనే కంపెనీని ఏర్పాటు చేశారు. అసైన్డ్ భూములు కొల్లగొట్టడం కోసమే నారాయణ కుమార్తె సింధూర, అల్లుడు పునీత్ డైరెక్టర్లుగా ఎన్‌స్పైర కంపెనీని నెలకొల్పారు. నారాయణ విద్యా సంస్థలకు అన్ని రకాల చెల్లింపులు నిర్వహిస్తున్నందుకు ఎన్‌స్పైరకు 10 శాతం కమిషన్ చెల్లిస్తున్నట్లు రికార్డుల్లో చూపారు. ఇదే అవకాశంగా ఎన్‌స్పైరలోకి ఇతర సంస్థల నుంచి భారీగా నిధులు మళ్లించారు. ఎన్‌స్పైరలో ఇతర కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టినట్లు చూపడం గమనార్హం. ఒలంపస్ క్యాపిటల్ ఏసియా క్రెడిట్ అండ్ సీఎక్స్ పార్టనర్స్ మ్యాగజైన్ అనే కంపెనీ 2016లో ఏకంగా రూ. 400 కోట్లు పెట్టుబడి పెట్టినట్టు చూపించారు. ఇక 2018లో మోర్గాన్ స్టాన్లీ ప్రైవేట్ ఈక్విటీ ఏసియా, బన్యాన్ ట్రీ గ్రోత్ క్యాపిటల్ అనే సంస్థలు 75 మిలియన్ డాలర్లు (రూ. 613.27 కోట్లు) పెట్టుబడి పెట్టినట్టు రికార్డుల్లో చూపారు. దీంతో రెండు విడతల్లో ఎన్‌స్పైర కంపెనీలోకి రూ.1,013.27 కోట్లు వచ్చి చేరాయి. ఇలా భారీగా నల్లధనాన్ని ఎన్‌స్పైరలోకి మళ్లించినట్లు తెలుస్తోంది.

ఎన్‌స్పైర టు రామకృష్ణ హౌసింగ్

నారాయణ సమీప బంధువు కేవీపీ అంజనీ కుమార్ రంగంలోకి వచ్చారు. ఆయన మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను నల్లధనం తరలింపునకు మార్గంగా చేసుకున్నారు. అక్రమ నిధులను ఎన్‌స్పైర నుంచి రామకృష్ణ హౌసింగ్ కార్పొరేషన్ బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేశారు. అప్పటికే నారాయణ విద్యా సంస్థల సిబ్బంది, మరికొందరిని తమ బినామీలుగా ఎంపిక చేసుకున్నారు. రామకృష్ణ హౌసింగ్ బ్యాంకు ఖాతాల నుంచి ఆబినామీల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోకి నిధులను మళ్లించారు. వారు ఆ నగదు డ్రా చేసుకున్నారు. ప్రభుత్వం ఎలాంటి పరిహారం ఇవ్వకుండా అసైన్డ్ భూములను తీసుకుంటుందని బడుగు, బలహీనవర్గాల రైతులను అప్పటికే భయపెట్టారు. తద్వారా ఆ రైతుల అసైన్డ్ భూములను తమ బినామీలైన ఉద్యోగులు, ఇతరులకు అతి తక్కువకు విక్రయించేలా కథ నడిపించారు. నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూములు తమ బినామీల ద్వారా హస్తగతం చేసుకున్నారు. తర్వాత బినామీలే సీఆర్‌డీఏకు ఆ భూములను ఇచ్చినట్టు చూపించి వారికే భూసమీకరణ ప్యాకేజీ వచ్చేలా చేశారు. ఆవిధంగా 617.65 ఎకరాలకు గాను రూ. 3,737 కోట్ల విలువైన భూసమీకరణ ప్యాకేజీ స్థలాలను పొందారు.

జీపీఏ, సేల్‌డీడ్‌ల ద్వారా హస్తగతం

కేటగిరీ 1 నుంచి 4 వరకు 617.65 ఎకరాలకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో ఉన్న అసైన్డ్ రైతుల జాబితా, సీఆర్‌డీఏ రికార్డుల్లో ఉన్న రైతుల పేర్లను పరిశీలిస్తే అక్రమాల బాగోతం బయటపడుతోంది. ఈ జాబితాలో చంద్రబాబు, నారాయణ, గంటా శ్రీనివాసరావు, వారి సన్నిహితులు, బంధువులు, బినామీలే బయటపడుతున్నారు. అమరావతి పరిధిలోని అనంతవరం, కృష్ణాయపాలెం, కురగల్లు, లింగాయపాలెం, మందడం, నెక్కల్లు, నవులూరు, రాయపూడి, తుళ్లూరు, ఉద్దండరాయునిపాలెం, వెంకటపాలెం, బోరుపాలెం, నేలపాడు తదితర గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు చెందిన 617.65 ఎకరాల అసైన్డ్ భూములను జీపీఏ, సేల్ డీడ్లు ద్వారా హస్తగతం చేసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ అసైన్డ్ రైతుల నుంచి అసైన్డ్ భూములను బినామీల ద్వారా కొల్లగొట్టిన టీడీపీ పెద్దలు

- ➢ నారా చంద్రబాబునాయుడు (టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి)
- ➢ నారా లోకేశ్ (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- ➢ పొంగూరు నారాయణ (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- ➢ గంటా శ్రీనివాసరావు (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- ➢ దేవినేని ఉమామహేశ్వరరావు (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- ➢ ప్రత్తిపాటి పుల్లారావు (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- ➢ రావెల కిశోర్ బాబు (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- ➢ తెనాలి శ్రావణ్ కుమార్ (టీడీపీ మాజీ ఎమ్మెల్యే)
- ➢ గుమ్మడి సురేశ్ (టీడీపీ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు వియ్యంకుడు)
- ➢ మండల ఎస్.ఎస్.కోటేశ్వరరావు (రియల్టర్)
- ➢ మండల రాజేంద్ర (రియల్టర్)
- ➢ కేవీపీ అంజనీ కుమార్ (రియల్టర్)
- ➢ దేవినేని రమేశ్ (రియల్టర్)
- ➢ బొబ్బ హరిశ్చంద్ర ప్రసాద్ (రియల్టర్)
- ➢ హరేంద్రనాథ్ చౌదరి (రియల్టర్)
- ➢ పొట్లూరి సాయిబాబు (సిటీ కేబుల్)
- ➢ దోనేపూడి దుర్గా ప్రసాద్ (రియల్టర్)

రూ.16 కోట్లతో.. రూ. 816 కోట్లు కొట్టేసిన నారాయణ

అసైన్డ్ భూములు కొల్లగొట్టిన అవినీతి బాగోతం తెలుసుకోవాలంటే ఒక్క నారాయణ అక్రమాన్ని ప రిశీలిస్తే చాలు. నారాయణ బంధువులు, బినామీల పేరిట 148 ఎకరాలు ఉన్నట్టుగా సిట్ దర్యాప్తులో వెల్లడైంది. అందుకోసం నారాయణ రూ. 16.50 కోట్లను అక్రమంగా తరలించారు. అందుకు ప్రతిగా 148 ఎకరాలను పొందారు. ఆ 148 ఎకరాలకు సీఆర్‌డీఏ భూసమీకరణ కింద ఇచ్చింది రూ. 816 కోట్లు విలువైన స్థలాల ప్యాకేజీ. అంతేకాదు ఆ భూములకు పదేళ్లపాటు కౌలు మొత్తం కూడా పొందగలుగుతారు. బినామీ రైతులకు సీఆర్‌డీఏ ఇప్ప టికే చెల్లించిన కౌలు మొత్తం రూ. 50 లక్షలు మళ్లీ రామకృష్ణ హౌసింగ్ బ్యాంకు ఖాతాలో జమ చేశా రు. అక్కడ నుంచి ఆ మొత్తాన్ని మళ్లీ నారాయణ విద్యా సంస్థల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేయడం గమనార్హం. అంటే అసైన్డ్ భూములు దక్కించుకుంది నారాయణే అన్నది స్పష్టమైంది. అదే రీతిలో చంద్రబాబు, గంటా, ప్రత్తిపాటి, దేవినేని ఉమా, ఇతర టీడీపీ పెద్దలు, వారి బంధువులు బినామీల ద్వారా 617 ఎకరాల్లో ఎంత భారీ దోపిడీకి పాల్పడ్డారన్నది నారాయణ దోపిడీని చూస్తే స్పష్టమవుతోంది.

మర్రిగూడ తహసీల్దార్ ఇంట్లో రూ.2 కోట్ల నగదు

- కిలో బంగారు నగలు, విలువైన డాక్యుమెంట్లు కూడా...
- నాలుగున్నర కోట్లకుపైగా ఆస్తులు స్వాధీనం చేసుకున్న ఏసీబీ
- కార్యాలయంలోనూ భూముల రిజిస్ట్రేషన్ల రికార్డుల తనిఖీ


తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు చేస్తున్న ఏసీబీ (ఇన్‌సెట్‌లో) మహేందర్‌రెడ్డి

హస్తినాపురం/మర్రిగూడ: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ, ఆదాయానికి మించిన అక్రమ ఆస్తులు కలిగి ఉన్నారని అందిన సమాచారం మేరకు అవినీతి నిరోధక శాఖ అధికారులు నల్లగొండ జిల్లా మర్రిగూడ తహసీల్దార్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి ఇంటిపై దాడులు చేశారు. హస్తినాపురం షిరిడీ సాయినగర్ కాలనీలో ఉన్న ఆయన ఇంట్లో శనివారం ఉదయం 9 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఏసీబీ డీఎస్పీ మజీద్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. మహేందర్‌రెడ్డి ఇంటితోపాటు బంధువుల ఇళ్లు, మర్రిగూడ మండల రెవెన్యూ కార్యాలయంలో కూడా సోదాలు చేశారు. కార్యాలయంలో భూముల రిజిస్ట్రేషన్ల రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ ఇంట్లోని ఒక ఇనుప పెట్టెలో రెండు కోట్ల ఏడు లక్షల నగదు, కిలో బంగారు నగలు, విలువైన భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు పట్టుబడ్డాయి. మొత్తం వీటి విలువ రూ.నాలుగున్నర కోట్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు. మహేందర్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వెలిమినేడుకు చెందిన మంచిరెడ్డి అంజిరెడ్డి కుమారుడు. అంజిరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందడంతో కారుణ్య నియామకం కింద మహేందర్‌రెడ్డి మహేశ్వరం మండల రెవెన్యూ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాడు. అనంతరం కందుకూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డీటీవోగా పనిచేశాడు. తర్వాత ప్రమోషన్‌పై మహేశ్వరం తహసీల్దారుగా బదిలీపై వెళ్లారు. కందుకూరు తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న సమయంలో మహేందర్‌రెడ్డి ప్రభుత్వ, ప్రైవేటు భూముల వివాదాల్లో అక్రమంగా డబ్బులు సంపాదించాడనే ఆరోపణలు ఉన్నాయి. 45 రోజుల క్రితం మర్రిగూడ తహశీల్దారుగా బదిలీపై వెళ్లారు.

డోలీ కట్టి.. రోగిని తరలించి


వాగును దాటించి వైద్యం



కెరమెరి(ఆసిఫాబాద్): కుమురం భీం జిల్లాలో ఈ ఏడాది వర్షాలకు వాగులు పొంగిపొర్లుతుండడంతో వాగు అవతలి గ్రామాల ప్రజల కష్టాలు వర్ణనాతీతం. సాధారణ ప్రజలే కాకుండా రోగులూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులు, గర్భిణులను కొన్నిసార్లు చేతులపై, ఇంకొన్నిసార్లు మంచంపై వాగు దాటించిన సంఘటనలు తెలిసిందే. తాజాగా కెరమెరి మండలం బోరిలాల్‌గూడ గ్రామానికి చెందిన ఆడే నాందేవ్ శుక్రవారం రాత్రి అనారోగ్యానికి గురయ్యాడు. ఓ వైపు పొంగిపొర్లుతున్న అనార్‌పల్లి వాగు, మరోవైపు అనారోగ్యంతో బాధపడుతున్న రోగి.. ఈ పరిస్థితుల్లో అతన్ని శనివారం ఆరుగురు కుటుంబ సభ్యులు డోలీపై పడుకోబెట్టి వాగు దాటించారు. అనార్‌పల్లి నుంచి జీపుపై కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం చేయించారు. అనంతరం మళ్లీ వాగు దాటించి ఇంటికి చేర్చారు.

'పైగా' భూములపై.. అవి తప్పుడు తీర్పు నివేదికలే..

- పిటిషనర్ పేర్కొన్నట్లు 'పైగా' భూములపై 1998లో ఏ తీర్పు ఇవ్వలేదు
- హైకోర్టుకు నివేదిక అందజేసిన జుడీషియల్ రిజిస్ట్రార్
- తప్పుడు పత్రాలతో కోర్టును తప్పుదారి పట్టిస్తున్నారు: ఏజీ



సాక్షి, హైదరాబాద్: 'పైగా'భూములకు సంబంధించి 1998లో ఇచ్చిన తీర్పు కాపీని సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు రిజిస్ట్రార్ సమర్పించారు. సెప్టెంబర్ 15న విచారణ సందర్భంగా ఆదేశాలు జారీ చేయడంతో ఈ మేరకు నివేదిక అందజేశారు. పిటిషనర్ పేర్కొన్నట్లు 'పైగా'భూములపై 1998లో హైకోర్టు ఏ తీర్పునూ ఇవ్వలేదని, అసలు పిటిషనర్ పేర్కొన్న పిటిషన్‌లే నమోదు కాలేదని ఆ నివేదికలో పేర్కొన్నారు. దీంతో తాము తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని పిటిషనర్‌ను ఆదేశిస్తూ, స్టేటస్ కో ఉత్తర్వులు కొనసాగుతాయని హైకోర్టు స్పష్టం చేసింది. అక్టోబర్ 13కు విచారణను వాయిదా వేసింది.

50ఎకరాల భూములపై వివాదం

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ గ్రామంలోని దాదాపు 50 ఎకరాల భూమిని తన పూర్వీకులు పైగా(సైన్యం నిర్వహణకు పరిహారంగా నిజాం నవాబ్ మంజూరు చేసిన భూమి) యజమానుల నుంచి కొనుగోలు చేశారని, అన్ని డాక్యుమెంట్లు ఉన్నా హెచ్ఎండీఏ అధికారులు, పోలీసులు జోక్యం చేసుకుని ఇబ్బందులు కల్పిస్తున్నారని పేర్కొంటూ హైదరాబాద్ వట్టేపల్లికి చెందిన యహియా ఖురేషి హైకోర్టులో రెండు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేజీ రాఘువన్, ప్రభుత్వం తరఫున బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. బోగస్ డాక్యుమెంట్లు, రశీదులు సృష్టించి కోర్టును తప్పుదారి పట్టించి అత్యంత విలువైన ప్రాంతంలో దాదాపు 50 ఎకరాలకుపైగా భూమిని స్వాహా చేసేందుకు యత్నిస్తున్నారని ఏజీ గతంలో వాదనలు వినిపించారు. 2007, 2012లో జారీ చేసిన రసీదులు పూర్తిగా నకిలీవని.. తప్పుడు రసీదులను, కోర్టు తీర్పు ఉత్తర్వుల డాక్యుమెంట్లను ఆయన ఈ సందర్భంగా ధర్మాసనం ముందు ఉంచారు.

2007నాటికి తెలంగాణ రాష్ట్రం ఎక్కడుంది?

2007 నాటికి తెలంగాణ రాష్ట్రమే లేదని, రసీదుల్లో మాత్రం అలా పేర్కొన్నారని, అలాగే శంషాబాద్ గ్రామం రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉండగా, హైదరాబాద్ అని మరో రసీదులో ఉందన్నారు. దీనిపై పూర్తిగా విచారణ జరిపి సీల్డ్ కవర్‌లో నివేదిక అందజేయాలని జుడీషియల్ రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది. శుక్రవారం ఈ మేరకు నివేదిక అందజేసింది. అనంతరం ధర్మాసనం.. ఈ నివేదిక కాపీలను అక్టోబర్ 3లోగా పిటిషనర్‌కు, ప్రభుత్వానికి కూడా అందజేయాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

నారా లోకేశ్‌కు సీఐడీ నోటీసులు

ఏపీ ఇన్నర్ రింగ్‌రోడ్ అలైన్‌మెంట్ స్కామ్‌లో 41ఏ కింద నోటీసులు అందజేసిన అధికారులు

- ఈ కేసులో ఏ14గా లోకేశ్
- ఢిల్లీలో ఎంపీ జయదేవ్ ఇంట్లో అందజేసిన అధికారులు
- 4వ తేదీన తాడేపల్లి కార్యాలయంలో హాజరు కావాలి
- హెరిటేజ్ ఫుడ్స్ బ్యాంకు ఖాతా, భూలావాదేవీల బోర్డు మినిట్స్ తేవాలి... విచారణకు సహకరించాలి.. నిబంధనలు పాటించకుంటే అరెస్టు తప్పదు
- నోటీసుల్లో పేర్కొన్న దర్యాప్తు అధికారులు
- సీఐడీ పెట్టినవి దొంగ కేసులన్న లోకేశ్
- సీఐడీ వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగమని ఆరోపణ


ఢిల్లీలో సీఐడీ అధికారులు ఇచ్చిన నోటీసును చూస్తున్న టీడీపీ నేత నారా లోకేశ్

సాక్షి, న్యూఢిల్లీ: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్ అలైన్‌మెంట్ ముసుగులో జరిగిన భూదోపిడీ కుంభకోణంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు సీఐడీ అధికారులు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు అందజేశారు. శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఢిల్లీలో టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ ఇంట్లో ఉన్నలోకేశ్‌కు అధికారులు వీటిని అందజేశారు. అక్టోబరు 4న తాడేపల్లిలోని సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. నోటీసులు ఇవ్వడానికి ఢిల్లీ వచ్చిన అధికారులు శనివారం ఉదయం నుంచి లోకేశ్ ఎక్కడున్నారో తెలుసుకొనే ప్రయత్నం చేశారు. ఓ హోటల్‌లో ఉన్నారని, ఎంపీ ఇంట్లో ఉన్నారని ఇలా ఊహాగానాలు రావడంతో పూర్తి సమాచారం వచ్చే వరకూ వేచి చూశారు. మధ్యాహ్నం 3.15 గంటల సమయంలో లోకేశ్ ఎంపీ గల్లా జయదేవ్ అధికారిక నివాసానికి వచ్చారు. దీంతో అధికారులు ఎంపీ జయదేవ్‌తో మాట్లాడారు. అశోకారోడ్-50లోని తన నివాసంలో లోకేశ్ ఉన్నారని జయదేవ్ వారికి తెలిపారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో సీఐడీ అధికారులు ఎంపీ జయదేవ్ నివాసానికి చేరుకున్నారు. వారిని తొలుత లోపలికి రానీయకుండా గేటు వద్దే అడ్డుకొన్నారు. విధుల్లో ఉన్న అధికారులను అడ్డుకోవడం సమంజసం కాదని అధికారులు తెలిపారు. లోకేశ్ బయటకు వస్తే నోటీసులు అందజేసి వెళ్లిపోతామని చెప్పారు. కొద్దిసేపటికి లోకేశ్ బయటకు రారని గేటు వద్ద ఉన్న సిబ్బంది అధికారులకు తెలిపారు. అనంతరం టీడీపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శి నౌపడ సత్యనారాయణ బయటకు వచ్చి అధికారులతో మాట్లాడారు. వారిని లోపలికి తీసుకెళ్లారు. 20 నిమిషాల అనంతరం బయటకి వచ్చిన అధికారులు లోకేశ్‌కు నోటీసులు ఇచ్చినట్లుగా అధికారికంగా ప్రకటించారు. కోర్టు పరిధిలో ఉన్న కేసుపై తాము మాట్లాడబోమని మీడియాకు తెలిపారు.

ఎందుకొచ్చారు? నోటీసులెందుకు?

నోటీసులు ఇవ్వడానికి వచ్చిన అధికారులను ఎందుకొచ్చారని ప్రశ్నించినట్లు సమాచారం. నోటీసులు ఎందుకు? ఏ కేసులో నోటీసులు ఇస్తున్నారని అడిగినట్లు సమాచారం. ఇన్నర్‌రింగ్‌రోడ్ అలైన్‌మెంట్ కుంభకోణంలో విచారణ నిమిత్తం నోటీసులు ఇస్తున్నామని అధికారులు తెలిపారు. అనంతరం లోకేశ్‌కు నోటీసులు ఇచ్చారు. లిఖితపూర్వకంగా నోటీసులు అందుకున్నట్లు లోకేశ్ ధ్రువీకరించినట్లు తెలిసింది. అంతకు ముందు సీఐడీ అధికారులను ఎంపీ జయదేవ్ నివాసంలోకి రానివ్వకపోవడంతో వారు లోకేశ్‌కు వాట్సాప్‌లో నోటీసులు పంపినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని అధికారులతోనూ లోకేశ్ ప్రస్తావించినట్లు సమాచారం. నోటీసును చదువుకుంటానని, న్యాయవాది కనకమేడల రవీంద్రకుమార్ మాట్లాడతారని లోకేశ్ వారికి చెప్పినట్లు తెలిసింది. దీంతో అధికారులు ఆయా సెక్షన్లు గురించి లోకేశ్‌కు వివరించినట్లు సమాచారం.

నోటీసుల్లో ఉన్న వివరాలివీ..!

ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్ కుంభకోణంలో నారా లోకేశ్‌కు సీఐడీ అధికారులు ఇచ్చిన నోటీసుల్లో.. ' క్రైమ్ నం. 16/2022 ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న ఐపీసీ సెక్షన్లు 120 (బి), 409, 420, 34, 35, 36, 37, 166, 167, 217, మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 13(2) రెడ్‌విత్ 13(1) (సి) (డి)లో దర్యాప్తు మేరకు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ సబ్ సెక్షన్ (1) ప్రకారం నోటీసులు ఇస్తున్నాం. ప్రస్తుత విచారణకు సంబంధించి వాస్తవాలు తెలుసుకోవడానికి, ప్రశ్నించడానికి తగిన కారణాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్టోబరు 4న ఉదయం పది గంటలకు తాడేపల్లిలోని సీఐడీ కార్యాలయంలో హాజ రు కావాలి' అని నోటీసుల్లో పేర్కొంది. వీటలో 10 అంశాలను సీఐడీ స్పష్టంగా పేర్కొంది. ఆ అంశాలివీ..

1. భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు
2. ఇన్నర్ రింగ్ రోడ్ కేసుకు సంబంధించిన సాక్ష్యాలు తారుమారు చేయకూడదు
3. కేసుతో సంబంధం ఉన్న వ్యక్తులెవరినీ బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం చేయకూడదు
4. ఎప్పుడు పిలిచినా /ఆదేశించినా కోర్టుకు హాజరుకావాలి
5. విచారణకు ఎప్పుడు పిలిచినా వచ్చి అధికారులకు సహకరించాలి
6. కేసుకు సంబంధించి వాస్తవాలు వెల్లడించాలి
7. హెరిటేజ్ ఫుడ్స్ బ్యాంకు ఖాతా వివరాలు అధికారులకు అందజేయాలి
8. భూముల కొనుగోలుకు సంబంధించి హెరిటేజ్ బోర్డు డైరెక్టర్ల మీటింగ్ మినిట్స్ ఇవ్వాలి
9. అమరావతి భూ కొనుగోలు లావాదేవీలు విచారణకు హాజరయ్యే సమయంలో తీసుకురావాలి
10. నోటీసులు అందుకున్న తర్వాత విచారణకు రాకపోయినా, నిబంధనలు పాటించకపోయినా సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ (3), (4) ప్రకారం అరెస్టు తప్పదు.

లవ్ లెటర్ అందింది: లోకేశ్

సీఐడీ వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగమని ఆరోపణ

సీఐడీ అధికారులు ఇచ్చిన నోటీసును నారా లోకేశ్ లవ్ లెటర్‌గా అభివర్ణించారు. ఢిల్లీలో సీఐడీ అధికారులు వచ్చి వెళ్లిన రెండు గంటల తర్వాత ఆయన మీడియా ముందుకొచ్చారు. సీఐడీ అధికారులు వస్తున్న విషయం తెలుసుకొని జాతీయ, రాష్ట్ర మీడియా ప్రతినిధులు సాయంత్రం ఎంపీ జయదేవ్ నివాసం వద్దకు చేరుకున్నారు. అయితే, వారిని లోపలికి అనుమతించలేదు. సీఐడీ అధికారులు వెళ్లిపోయిన తర్వాత లోకేశ్ వెంటనే మీడియా ముందుకు రాలేదు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టీడీపీ ఇచ్చిన పిలుపుమేరకు రాత్రి 7 గంటలకు గంటలు మోగించారు. ఆ తర్వాత లోకేశ్ మీడియాతో మాట్లాడారు. తనపై మోపినవి దొంగ కేసులని, ఎలాంటి ఆధారాలు లేవని చెప్పారు. తాము ఎక్కడికీ పారిపోబోమన్నారు. సీఐడీ వాళ్లు వచ్చి లవ్ లెటర్ ఇచ్చారని తెలిపారు. సీఐడీని వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగమని ఆరోపించారు. టీడీపీ అధినేత చంద్రబాబుపై కక్ష సాధిస్తున్నారని, అందులో భాగంగానే జుడీషియల్ రిమాండుకు పంపారని అన్నారు. తప్పుడు కేసు పెట్టినందుకు దర్యాప్తు అధికారి, డీజీపీపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తానన్నారు. తాము ఏ తప్పూ చేయలేదని అన్నారు. 4న సీఐడీ ముందు హాజరవుతానని, వాయిదాలు అడిగే అలవాటు లేదని చెప్పారు.

డ్రైనేజీలో పడి మహిళా హెడ్‌కానిస్టేబుల్ మృతి

కేటీఆర్ పర్యటన బందోబస్తుకు కొత్తగూడెం నుంచి భద్రాద్రికి వచ్చి మృత్యువాత


శ్రీదేవి మృతదేహం వద్ద విలపిస్తున్న పోలీసులు

భద్రాచలం అర్బన్: భద్రాచలంలో ఓ మహిళా హెడ్ కానిస్టేబుల్ ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడి మృతి చెందారు. భద్రాచలంలో శనివారం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు మంత్రి కేటీఆర్ పర్యటన ఖరారైంది. మంత్రి బందోబస్తు విధుల నిమిత్తం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి హెడ్‌కానిస్టేబుల్ పల్లపు శ్రీదేవి భద్రాచలం వచ్చారు. అయితే కేటీఆర్ ఖమ్మం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరే సమయంలో భద్రాచలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో ఆయన పర్యటన అకస్మాత్తుగా రద్దయింది. దీంతో ఆమె శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని, అన్నదానసత్రంలో భోజనం చేశారు. వర్షం పడుతుండటంతో చాలాసేపు సత్రంలోనే ఉండిపోయారు. కాస్త తెరిపి ఇవ్వడంతో ఆమె ఫోన్ మాట్లాడుకుంటూ బయటకు నడుచుకుంటూ వెళుతూ డ్రెయినేజీలో పడిపోయారు. అక్కడే ఉన్న ఇద్దరు స్థానికులు ఆమె చేయి పట్టుకుని పైకి లాగేందుకు ప్రయత్నించినా నీటిఉధృతిలో కొట్టుకుపోయారు. దాదాపు గంటసేపు పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గాలించగా కరకట్ట వద్ద ఉన్న స్లూయిస్‌లో ఆమె మృతదేహం లభించింది. అనంతరం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేశారు. శ్రీదేవి మృతదేహానికి ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే పొదెం వీరయ్య నివాళులర్పించారు.

బోరున విలపించిన తోటి సిబ్బంది..

శ్రీదేవి మృతదేహాన్ని చూసి తోటి పోలీస్ సిబ్బంది బోరున విలపించారు.శ్రీదేవి మరణవార్త విని తట్టుకోలేకపోయిన కొత్తగూడెం వన్‌టౌన్ స్టేషన్ నుంచి పలువురు భద్రాచలం చేరుకుని గుండెలవిసేలా రోదించారు. శ్రీదేవి మృతదేహాన్ని కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు డీఎస్పీలు రెహమాన్, రమణమూర్తి, రాఘవేంద్రరావు సందర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు. కాగా, మృతురాలు శ్రీదేవి భర్త రామారావు కూడా కొత్తగూడెంలోని స్పెషల్ బ్రాంచ్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

మోగని మోత

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీ కేడర్ కూడా బయటకు రాలేదు. దీంతో అచ్చెన్నాయుడు ఆవేదన వ్యక్తం చేస్తూ నాయకులు బయటకు వచ్చి ఆందోళనలు చేయాలని పదేపదే వేడుకొన్నారు. ఆ ఆడియో క్లిప్‌ను అందరూ విన్నారు. ఆ తర్వాత టీడీపీ నిర్వహించిన రాష్ట్ర బంద్ సహా ఏ కార్యక్రమాన్నీ జనం పట్టించుకోలేదు. ఒకవైపు వరుస అవినీతి కేసులతో చంద్రబాబు విశ్వరూపం బయటపడుతుండటం, కోర్టుల్లో సైతం వారి వాదనలు వీగిపోతుండటంతో ప్రజలకు వాస్తవాలు తెలిసిపోతున్నాయి. దీంతో టీడీపీ చేస్తున్న ప్రయత్నాలతో ఆ పార్టీకి కనీస సానుభూతి కూడా రావడంలేదు. ఈ విషయాన్ని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. అయినా ఏదో ఒక కార్యక్రమం నిర్వహించి ప్రజలను ఏమార్చడానికి టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అందులో భాగంగా శనివారం మోత కార్యక్రమం పెట్టారు. అదీ విఫలమవడంతో వారిలో ఆందోళన పెరిగిపోయింది.



దుర్మార్గుడు నీతిమంతులకు హేయుడు.
యథార్థవర్తనుడు భక్తిహీనునికి హేయుడు.
– క్రైస్తవ ధర్మం

బ్రాండ్ బాబు బాగోతం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



ఔటర్ రింగ్ రోడ్డును, శంషాబాద్ ఎయిర్‌పోర్టును కూడా యెల్లో మీడియా బాబు ఖాతాలోనే వేస్తున్నది. బాబు సంగతి సరేసరి. 'సెల్‌ఫోన్ కనిపెట్టింది కూడా నేనే' అనే స్థాయికి చేరిన వైపరీత్యం ఆయన మనస్తత్వానిది. ఎయిర్‌పోర్టు పనులకు శంకుస్థాపన చేసిందీ, కొత్త ఎయిర్‌పోర్టును ప్రారంభించిందీ కూడా వైఎస్సార్ హయాంలోనే! ఔటర్ రింగ్‌రోడ్డు కోసం భూసేకరణ దగ్గర్నుంచీ రోడ్డు నిర్మాణం 90 శాతం పూర్తయింది కూడా వైఎస్సార్ హయాంలోనే! ఇక ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా ఎయిర్‌పోర్టు నుంచి నగరానికి వస్తున్నప్పుడు రజనీకాంత్‌కు కనిపించిన న్యూయార్క్ దృశ్యం ఈ అయిదేళ్లలో ఆవిష్కృతమైన పరిణామం.

పీవీ నరసింహారావుకు, వైఎస్సార్‌కు, కేసీఆర్‌కూ దక్కా ల్సిన ఘనతలను కూడా బరబరా లాక్కుని చంద్రబాబుకు కట్టబెట్టే సమాచార గూండాగిరీకి యెల్లో మీడియా పాల్పడు తున్నది. అది ప్రజాభిప్రాయ 'ఉత్పత్తి' దశను దాటి ప్రజాభి ప్రాయ 'రిగ్గింగ్' దశకు చేరుకున్నది. అందులో భాగమే తెలంగాణలో, హైదరాబాద్‌లో ఉన్న సెటిలర్లంతా బాబు వర్గమే అనే ప్రచారం. బాబు వర్గం అంటే వారి ఉద్దేశం ప్రకారం టీడీపీకి వెన్నుదన్నుగా ఉన్న సామాజికవర్గం. సెటిలర్లలో వారు సింహభాగం ఉంటారు. మిగిలిన వారిని ప్రభావితం చేస్తారని వారి ఉద్దేశం. ఈ తప్పుడు లెక్కలతోనే తెలంగాణ రాజకీయ పార్టీలను యెల్లో మీడియా దబాయిస్తున్నది. సెటిలర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పోటీ చేయబోయే నాయకులను బెదిరించి బాబు అరెస్టును ఖండించే ప్రకటనలు యెల్లో మీడియా చేయిస్తున్నది. కానీ వారు చెబుతున్న లెక్కలు వాస్తవమేనా?

తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ! తప్పించుకు తిరిగేవాడు దొరికితే సంచలనమే సుమీ!! చార్లెస్ శోభరాజ్ వంటి కరుడుగట్టిన నేరస్తుడు అరెస్టయితేనే అప్పట్లో అదో సంచలన వార్తయింది. అటువంటిది మన అతిపెద్దమనిషి చంద్రబాబు అరెస్టయితే సంచలనం కలగకుండా ఉంటుందా? ఆయనపై ఇప్పటివరకు కనీసం రెండు డజన్ల పెద్దస్థాయి అవినీతి ఆరోపణలు వచ్చాయి. కనీసం ఒక్కదానిపై కూడా విచారణ జరక్కుండా అడ్డుచక్రాన్ని గిరగిరా తిప్పి విసరడంతో ఆయన చూపుడు వేలు నేర్పరితనం ఇప్పటికే రికార్డు పుటల్లోకి ఎక్కింది.

చంద్రబాబును సెంట్రల్ జైలుకు పంపించిన అభియోగాలు ఇప్పుడు న్యాయస్థానాల పరిశీలనలో ఉన్నాయి. కనుక వాటి మీద చర్చను పక్కనపెడితే, ఆయన అరెస్టు మాత్రం పెద్ద వార్తే అయింది. పెద్ద వార్తల చుట్టూ అనేక పిల్ల వార్తలూ, పిట్టకథలూ, ఉపాఖ్యానాలు, వ్యాఖ్యానాలు చేరిపోవడం సహజం. అలా చేరిపోయిన వాటిలో పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోని ఇద్దరు నాయకుల రాజకీయ వ్యాఖ్యానాలు మరో చర్చకు దారితీశాయి. ఐటీ ఉద్యోగుల పేరుతో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ వారు రెండు, మూడు ఊరేగింపులు చేశారు. దీనిపై కేటీఆర్ అభ్యంతరం చెబుతూ 'పక్క రాష్ట్ర రాజకీయ అంశంపై ఇక్కడెందుకు నిరసనలు? ఐటీ కారిడార్‌లో శాంతిభద్రతల సమస్య సృష్టించడమెందుకని' ప్రశ్నించారు. వెంటనే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దానిపై స్పందించారు. చంద్రబాబు జాతీయ నాయకుడనీ, ఆయన కోసం ఎక్కడైనా ఆందోళన చేయవచ్చనీ చెబుతూనే 'బీఆర్ఎస్‌కు ఆంధ్ర వాళ్ల ఓట్లు కావాలి గానీ, వాళ్ల సమస్యలు అక్కర్లేదా' అని వ్యాఖ్యానించారు.

ఈ చర్చలో అంతర్లీనంగా రెండు అంశాలు ఇమిడి ఉన్నాయి. ఒకటి – ఐటీ రంగ అభివృద్ధికీ, హైదరాబాద్ అభివృద్ధికీ మారుపేరుగా చంద్రబాబును ప్రస్తావిస్తూ ఒక ఫేక్ బ్రాండ్ ఇమేజ్‌ను గత పాతికేళ్లుగా యెల్లో మీడియా పోషించుకుంటూ వస్తున్నది. దాని కొనసాగింపుగానే ఐటీ ఉద్యోగులంతా చంద్రబాబును తమ తాతపాదుల వారిగా తలపోస్తున్నారనే భ్రాంతిని సృష్టించడం కోసం ఈ ర్యాలీలను తెలుగుదేశం పార్టీ నిర్వహించింది. ఈ ర్యాలీల్లో కూడా ఒక సామాజిక వర్గమే ప్రధాన భూమికను పోషించిందన్న మాట కూడా ఒక నిష్ఠుర సత్యం. ఇక రెండో అంశం – తెలంగాణలో ఆంధ్రావాళ్ల ఓట్లు. సెటిలర్ల ఓట్లన్నీ గంపగుత్తగా తెలుగుదేశం పార్టీ ఖాతాలో, బాబు కనుసైగల అజమాయిషీలో ఉన్నట్టు కూడా యెల్లో మీడియా మరో భ్రాంతి జనిత బ్రాండ్‌ను సృష్టించింది.

ఇద్దరు తెలంగాణ నాయకుల వ్యాఖ్యలు యథాలాపమా, ఆలోచనాపూర్వకమా అనే విషయం వారికి మాత్రమే తెలుసు. కానీ ఆచరణలో అవి స్పష్టమైన పాత్రనే నిర్వహించాయి. చంద్రబాబు మీద కప్పిన ఫేక్ బ్రాండ్ ముసుగును తొలగించే ప్రయత్నం కేటీఆర్ వ్యాఖ్యల్లో కనిపిస్తే, ఆ ముసుగును కాపాడే అంతరార్థం రేవంత్‌రెడ్డి మాటల్లో ధ్వనించింది. రేవంత్‌రెడ్డికి పూర్వాశ్రమంలో చంద్రబాబుతో ఉన్న సాహచర్యం కారణంగా అలా కావాలని మాట్లాడి ఉండవచ్చేమో! చంద్రబాబు పట్ల ఆయన సానుకూల స్పందన పెద్ద విశేషమేమీ కాదు. కానీ, ఆ నకిలీ బ్రాండ్ ముసుగును తొలగించడం బీఆర్ఎస్‌కు కచ్చితంగా ఒక రాజకీయ అవసరం. తమ హయాంలో జరిగిన నగరాభివృద్ధినీ, ఐటీ పురోగతినీ కూడా యథేచ్ఛగా యెల్లో మీడియా చంద్రబాబు ఖాతాలో వేస్తుంటే ఏ ప్రభుత్వమైనా ఎంతకాలం భరిస్తుంది?

తెలుగుదేశం పార్టీ నేతలకు తమిళ సినిమారంగ స్టార్ రజనీకాంత్ సన్నిహితుడు. ఎన్టీఆర్‌కు వెన్ను పోటు పొడిచిన సమయంలో ఆయన హైదరాబాద్‌కు వచ్చి మరీ చంద్రబాబు గ్యాంగ్‌కు మద్దతు పలికిన సంగతి చాలా మందికి గుర్తే. ఆయన ఈమధ్య మాట్లాడుతూ హైదరాబాద్‌కు వెళ్తే న్యూయార్క్‌కు వెళ్లినట్లుంటుందని చెబుతూ, అందుకు చంద్రబాబే కారకుడని ఓ వీరతాడును ఆయన మెడలో వేశారు. ఈ పదేళ్లలో హైదరాబాద్‌లో జరిగిన పరిణామాలకూ, ఇరవయ్యేళ్ల కిందనే తోక ముడిచిన చంద్రబాబుకూ ఏరకమైన సంబంధముంటుంది? ఇటువంటి ఘటనలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు సహజంగానే అసౌకర్యాన్ని కలిగిస్తాయి. ఆ అసౌకర్యమే కేటీఆర్ మాటల్లో వెల్లడై ఉండవచ్చు.

తెలంగాణ నాయకులు కేటీఆర్, రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు యథాలాపమా, ఆలోచనాపూర్వకమా అనే విషయం వారికి మాత్రమే తెలుసు. కానీ ఆచరణలో అవి స్పష్టమైన పాత్రనే నిర్వహించాయి. చంద్రబాబు మీద కప్పిన ఫేక్ బ్రాండ్ ముసుగును తొలగించే ప్రయత్నం కేటీఆర్ వ్యాఖ్యల్లో కనిపిస్తే, ఆ ముసుగును కాపాడే అంతరార్థం రేవంత్‌రెడ్డి మాటల్లో ధ్వనించింది. రేవంత్‌రెడ్డికి పూర్వాశ్రమంలో బాబుతో ఉన్న సాహచర్యం కారణంగా అలా కావాలని మాట్లాడి ఉండవచ్చేమో! బాబు పట్ల ఆయన సానుకూల స్పందన పెద్ద విశేషమేమీ కాదు. కానీ, ఆ నకిలీ బ్రాండ్ ముసుగును తొలగించడం బీఆర్ఎస్‌కు కచ్చితంగా ఒక రాజకీయ అవసరం. తమ హయాంలో జరిగిన నగరాభివృద్ధినీ, ఐటీ పురోగతిని కూడా యథేచ్ఛగా యెల్లో మీడియా చంద్రబాబు ఖాతాలో వేస్తుంటే ఏ ప్రభుత్వమైనా ఎంతకాలం భరిస్తుంది?

టీడీపీ నేతలకు తమిళ సినిమారంగ స్టార్ రజనీకాంత్ సన్నిహితుడు. ఎన్టీఆర్‌కు వెన్ను పోటు పొడిచిన సమయంలో ఆయన హైదరాబాద్‌కు వచ్చి మరీ బాబు గ్యాంగ్‌కు మద్దతు పలికిన సంగతి చాలా మందికి గుర్తే. ఆయన ఈమధ్య మాట్లాడుతూ హైదరాబాద్‌కు వెళ్తే న్యూయార్క్‌కు వెళ్లినట్లుంటుందని చెబుతూ, అందుకు బాబే కారకుడని ఓ వీరతాడును ఆయన మెడలో వేశారు. ఈ పదేళ్లలో హైదరాబాద్‌లో జరిగిన పరిణామాలకూ, ఇరవయ్యేళ్ల కిందనే తోక ముడిచిన చంద్రబాబుకూ ఏరకమైన సంబంధముంటుంది?

యెల్లో మీడియాను మాత్రమే అనుసరించే వారి మెదళ్లలో ఈ ఫేక్ బ్రాండ్ గుజ్జు ఎంత నిండిందో తెలియజెప్పే ఉదంతమొకటి ఈమధ్యనే మీడియాలో కనిపించింది. బాబు అరెస్టుకు నిరసన తెలియజేస్తున్న 'ఐటీ ఉద్యోగుల్లో' ఒక యువతి ముందు మన యెల్లో మీడియా మైకు పెట్టింది. "సీబీఎన్ అరెస్టును తెలంగాణ ప్రభుత్వం ఖండించలేదండీ! ఎందుకంటే ఇప్పుడు సీబీఎన్ బయటకొస్తే ఆటోమేటిక్‌గా ఏపీ డెవలపయి పోతుంది. తెలంగాణ వెనకబడుతుంది. అందుకని వాళ్లు ఖండించరు". ఆహా ఎంత పరిణతి! సాక్షాత్తూ జ్ఞాన సరస్వతీ దేవి ఉపదేశమా ఇది. "తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్ ... ... సరస్వతీ భగవతీ పూర్ణేందు బింబాననా!" మనం మరోసారి అక్షరాభ్యాసం చేయాల్సిందే. నిన్నటిదాకా ఆయన బయటే ఉన్నాడు కదమ్మా. ఐదేళ్లు అధికారంలో కూడా ఉన్నాడు కదమ్మా. మరి ఆటోమేటిగ్గా ఏపీ అగ్రస్థానంలోకి ఎందుకు దూసుకెళ్లలేదు తల్లీ అనే సహజమైన ప్రశ్న కూడా ఆ దిగ్భ్రాంతి క్షణాన ఎవరికీ జనించి ఉండదు.

ఆధిపత్య వర్గాలు తమ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రచార సాధనాల (మీడియా) ద్వారా ప్రజాభిప్రాయాన్ని ఎలా ఉత్పత్తి చేసుకుంటాయో (manufacturing consent) తెలియజెప్పే సిద్ధాంత పత్రాన్ని అమెరికా మేధావులు నోమ్ చోమ్‌స్కీ, ఎడ్వర్డ్ హెర్మాన్‌లు వెలువరించారు. ఏపీలో చంద్రబాబు అధికారంలోకి రాకపూర్వమే అమెరికా పరిస్థితులను అధ్యయనం చేసి వారు ఈ థియరీని ప్రతిపాదించారు. కానీ, ప్రస్తుత మన యెల్లో మీడియా కర్మాగారాలను, వాటి ఉత్పత్తులను చూసి ఉంటే పరిశోధన పక్కనపెట్టి మూర్ఛపోయేవారు. ఈ కర్మాగారాల్లో తయారైన అతి ముఖ్యమైన ఉత్పత్తి 'బ్రాండ్ బాబు'! ఐటీకి ఆద్యుడుగా, అభివృద్ధికి రోల్‌మోడల్‌గా, హైదరాబాద్ నిర్మాతగా బ్రాండ్ బాబును ప్రచారంలో పెట్టారు. ఇప్పుడీ బ్రాండ్ బాబు ఇమేజిపై పోస్టుమార్టమ్ జరిగి తీరాలి. వర్తమాన చరిత్రకు జరుగుతున్న వక్రీకరణను సరిచేయవలసిన బాధ్యత కూడా వర్తమాన సమాజానిదే!

హైదరాబాద్‌లోనే కాదు, మొత్తం దేశంలో కూడా ఐటీ అభివృద్ధికి సంబంధించి ఏ ఒక్కరికో క్రెడిట్ ఇవ్వాల్సి వస్తే అది మన తెలుగుజాతి కీర్తికిరీటం పీవీ నరసింహారావుకే దక్కాలి. ఆయన ప్రధానిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) పేరుతో ఐదారు నగరాల్లో ఐటీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో హైదరాబాద్ మొదటిది. చంద్రబాబు నిర్మించినట్టుగా మనం చదువుకుంటున్న హైటెక్ సిటీ లేదా సైబర్ టవర్స్‌కు 1993లోనే అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి శంకుస్థాపన చేశారు. దేశంలోనే పెద్దవైన ఐదు ఐటీ కంపెనీల్లో ఒకటైన సత్యం కంప్యూటర్స్ (టెక్ మహీంద్ర) 1987లోనే ఏర్పాటైంది. 1995లో జరిగిన వెన్నుపోటు పట్టాభిషేకం నాటికి సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో హైదరాబాద్‌ది మూడో స్థానం. 2004లో చంద్రబాబు గద్దె దిగేనాటికి నాలుగో స్థానం. ఆ తర్వాత వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో మళ్లీ మూడో స్థానానికి ఎగబాకింది. ఐటీ ఎగుమతుల్లో ఇప్పుడు హైదరాబాద్‌ది దేశంలో రెండో స్థానం. గూగుల్, ఫేస్‌బుక్, ఆపిల్, క్వాల్‌కామ్, అమెజాన్ వంటి దిగ్గజ సంస్థలు వాటి అతిపెద్ద క్యాంపస్‌లను (అమెరికా వెలుపల) హైదరాబాద్‌లో చంద్రబాబు అనంతర కాలంలోనే ఏర్పాటు చేశాయి.

ఐటీ రంగం విస్తృతమవుతున్న నేపథ్యంలో నేదురుమల్లి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే కొత్తగా 11 ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతినిస్తే, వాటికి వ్యతిరేకంగా చంద్రబాబు నేతృత్వంలో యెల్లో మీడియా ఆధ్వర్యంలో, కమ్యూనిస్టుల తోడ్పాటుతో, పెద్ద ఉద్యమాన్ని లేవదీసి వాటిని ఆపేశారు. చంద్రబాబు గద్దెనెక్కగానే ఏకంగా 30 కాలేజీలను ప్రారంభించారు. ఎవరూ కిమ్మనలేదు. ఆ పదకొండు ఎవరికి చెందినవి, ఈ 30 ఎవరివి అనేది ఒక ప్రత్యేక రాజకీయ – సామాజిక అధ్యయనాంశం. ఇప్పుడు అప్రస్తుతం. వైఎస్ఆర్ అధికారంలో ఉన్న సమయంలో ఇంజనీరింగ్ మాస్టర్స్ కోసం అమెరికా వెళ్లే విద్యార్థుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరగడంతో వీసాల కోసం అమెరికా కాన్సులేట్ కార్యాలయాన్ని వైఎస్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయించారు.

ఇవన్నీ వాస్తవాలు! చెరిపేస్తే చెరిగిపోయేవి కావు. ఎవరైనా రికార్డులను పరిశీలించుకోవచ్చు. ఔటర్ రింగ్ రోడ్డును, శంషాబాద్ ఎయిర్‌పోర్టును కూడా యెల్లో మీడియా బాబు ఖాతాలోనే వేస్తున్నది. బాబు సంగతి సరేసరి. 'సెల్‌ఫోన్ కనిపెట్టింది కూడా నేనే' అనే స్థాయికి చేరిన వైపరీత్యం ఆయన మనస్తత్వానిది. ఎయిర్‌పోర్టు పనులకు శంకుస్థాపన చేసిందీ, కొత్త ఎయిర్‌పోర్టును ప్రారంభించిందీ కూడా వైఎస్సార్ హయాంలోనే! ఔటర్ రింగ్‌రోడ్డు కోసం భూసేకరణ దగ్గర్నుంచీ రోడ్డు నిర్మాణం 90 శాతం పూర్తయింది కూడా వైఎస్సార్ హయాంలోనే! ఇక ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా ఎయిర్‌పోర్టు నుంచి నగరానికి వస్తున్నప్పుడు రజనీకాంత్‌కు కనిపించిన న్యూయార్క్ దృశ్యం ఈ అయిదేళ్లలో ఆవిష్కృతమైన పరిణామం.

పీవీ నరసింహారావుకు, వైఎస్సార్‌కు, కేసీఆర్‌కూ దక్కాల్సిన ఘనతలను కూడా బరబరా లాక్కుని చంద్రబాబుకు కట్టబెట్టే సమాచార గూండాగిరీకి యెల్లో మీడియా పాల్పడుతున్నది. అది ప్రజాభిప్రాయ 'ఉత్పత్తి' దశను దాటి ప్రజాభిప్రాయ 'రిగ్గింగ్' దశకు చేరుకున్నది. అందులో భాగమే తెలంగాణలో, హైదరాబాద్‌లో ఉన్న సెటిలర్లంతా బాబు వర్గమే అనే ప్రచారం. బాబు వర్గం అంటే వారి ఉద్దేశం ప్రకారం టీడీపీకి వెన్నుదన్నుగా ఉన్న సామాజికవర్గం. సెటిలర్లలో వారు సింహభాగం ఉంటారు. మిగిలిన వారిని ప్రభావితం చేస్తారని వారి ఉద్దేశం. ఈ తప్పుడు లెక్కలతోనే తెలంగాణ రాజకీయ పార్టీలను యెల్లో మీడియా దబాయిస్తున్నది. సెటిలర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పోటీ చేయబోయే నాయకులను బెదిరించి చంద్రబాబు అరెస్టును ఖండించే ప్రకటనలు యెల్లో మీడియా చేయిస్తున్నది. కానీ వారు చెబుతున్న లెక్కలు వాస్తవమేనా?

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చేసిన క్షేత్రస్థాయి పరిశీలన ప్రకారం దాదాపు ఇరవై లక్షలమంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సెటిలర్లు ఉన్నారు. వీరిలో ఇరవై శాతం వరకు కమ్మవారుంటారని అంచనా. పదిహేను శాతం రెడ్లు, పదిహేను శాతం కాపులు. బీసీలు ముప్పయ్ శాతం. మిగిలిన ఇరవై శాతం ఇతరులు. ఇవి వాస్తవికతకు దగ్గరగా ఉన్న ఉజ్జాయింపు లెక్కలు మాత్రమే. యెల్లో మీడియా దబాయింపు ప్రకారం ఇరవై శాతం సామాజిక వర్గం చెప్పుచేతుల్లోనే ఎనభై శాతం మసలుకుంటున్నట్టు లెక్క. వాస్తవానికి ఆంధ్రా సెటిలర్లు అనేది ఒక ఓటు బ్యాంకు ఎంతమాత్రమూ కాదు. ఎవరి రాజకీయ అభిప్రాయాలు వారివి. కులాల లెక్కలు కూడా చెల్లవు. అసలు ఆంధ్రప్రదేశ్‌లోనే కుల ప్రభావం తగ్గుముఖం పట్టింది. రాజకీయ పోరాటాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వర్గ పోరాటంగా మార్చివేశారు. పేదలకూ – పెత్తందార్లకూ మధ్య యుద్ధంగా ఆయన పదేపదే ప్రస్తావిస్తున్నారు. ఇంకా తెలుగుదేశం పార్టీ మాత్రమే ఒక్క కులాన్ని పట్టుకుని వేలాడుతున్నది. అటువంటి విభజనే సెటిలర్లలో కొంతమేరకు ఉండవచ్చు. లేదా స్థానిక అంశాల ఆధారంగా వారి మద్దతు ఉండవచ్చు. సెటిలర్లపై చంద్రబాబు ప్రభావం అనేది యెల్లో మీడియా ఉత్పత్తి చేస్తున్న భ్రాంతి మాత్రమే. తెలంగాణ ప్రజలకు చంద్రబాబులో ఇప్పటికీ ఒక సామాజిక విధ్వంసకుడు కన్పిస్తాడు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ గడిచిన ఎన్నికల ఫలితాల నుంచి గుణపాఠం నేర్చుకున్నదో లేక మరోసారి బలిపీఠం ఎక్కడానికి సిద్ధపడుతున్నదో వేచి చూడాలి.

vardhelli1959@gmail.com

ఆలస్యమే అయినా... మేల్కొన్నట్లేనా?

విశ్లేషణ



డి. పాపారావు

సుమారుగా నాలుగు దశాబ్దాల నుంచి ప్రపంచ దేశాలను శాసిస్తోన్న 'నయా ఉదారవాద' ఆర్థిక విధానాలు నేడు ప్రశ్నించబడుతున్నాయి. నిన్నటి వరకూ ఈ విధానాలకు ప్రతినిధులుగా ఉన్న ఆర్థికరంగ మేధావులు కూడా నేడు భిన్నమైన గొంతుకలను వినిపిస్తున్నారు.

ఈ క్రమంలో, ఈ మధ్యకాలంలో మన దేశంలోని ఇరువురు ప్రముఖుల ప్రకటనలు లేదా ఇంటర్వ్యూలు మనదేశంలో కూడా నయా ఉదారవాద విధానాలను అనివార్యంగా విడనాడవలసిన అవసరాన్ని చెబుతున్నాయి. వీరిలో ఒకరు రిజర్వుబ్యాంకు మాజీ గవర్నర్ రంగరాజన్. రెండవవారు నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ కె. బెరి. రంగరాజన్ మాటలు నేడు వ్యవస్థలో మౌలికంగానే తలెత్తుతోన్న ప్రశ్నలకు అద్దం పడుతున్నాయి. ఆయన లేవనెత్తిన ప్రశ్న ఉపాధి అవకాశాలను సరిపడా సృష్టించలేని అభివృద్ధి దేనికి అనేది. అలాగే ఆయన తలసరి ఆదాయం పెరిగితేనే అది అసలైన దేశాభివృద్ధి అన్నారు. దానితో పాటుగా నిరుపేదలకు రాయితీలు అవసరమేనని స్పష్టీకరించారు. గతంలో దేశంలో పెట్రోలియం ధరలకు సంబంధించి సబ్సిడీల రద్దులను ప్రతిపాదించిన కమిటీలలో ఒకదానికి నాయకత్వం వహించిన రంగరాజన్ నోట వెలువడిన ఈ మాటలు చాలా కీలకమైనవి. వ్యవస్థలో నేడు మారుతోన్న ఆలోచనలకూ... నయా ఉదారవాద సంస్కరణల వైఫల్యానికీ ఈ మాటలు అద్దంపడుతున్నాయి.

సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పీజీ) విధానాలనే సూక్ష్మంగా 'నయా ఉదారవాదం' అంటున్నాం. ప్రపంచంలో 1980ల నుంచీ... మనదేశంలో 1991 అనంతరం మొదలైన ఈ విధానాలు కార్పొరేట్‌లకు మరింతగా రాయితీలు ఇవ్వడాన్ని ప్రతిపాదించాయి. అలాగే, జన సామాన్యానికి ఇచ్చే సబ్సిడీలు, సంక్షేమ పథకాలపై కోతలను ప్రతిపాదించాయి. ఈ విధానాల అమలు క్రమంలోనే నేడు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల మధ్య, అలాగే విడివిడిగా వివిధ దేశాలలో అంతర్గతంగా కూడా ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగిపోయాయి. ధనికులు మరింత ధనికులూ, పేదలు మరింత పేదలూ అవుతున్నారు. నేడు పరాకాష్ఠకు చేరుకుంటున్న ఈ పరిస్థితి ఈ విధానాలను ప్రశ్నార్థకం చేస్తోంది. ఈ క్రమంలోనే రంగరాజన్ వంటివారు కూడా తమ పాత ఆలోచనలను పరిత్యజించవలసి వస్తోంది.

మరో పక్కన నీతి ఆయోగ్ సుమన్ బెరి 1950ల నుంచి బలమైన నమూనాగా ఉన్న మొత్తం ఆర్థిక నమూనానే ప్రశ్నిస్తున్నారు. ఈ నమూనా ప్రకారంగా ఒక దేశ ఆర్థిక అభివృద్ధి క్రమం: తొలుత వ్యవసాయక ప్రాధాన్యత గలదిగా ఉండి, తరువాత సరుకు ఉత్పత్తి పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యత ఉన్నదిగానూ... అనంతరం (చివరగా) సేవా రంగం ప్రాధాన్యత దిశగా సాగాలి. అయితే, ప్రస్తుతం ప్రపంచంలో నెలకొని ఉన్న ఆర్థిక పరిస్థితులూ, అలాగే భారీగా ఆటోమేషన్ దిశగా అభివృద్ధి చెందిన సాంకేతిక రంగం వంటి వాటి దృష్ట్యా నేడు మనదేశానికి ఈ పాత దశల అభివృద్ధి నమూనా పనికి రాదనేది సుమన్ బెరి ప్రతిపాదన. ఈ సందర్భంగా ఆయన 'భూగోళం మరో చైనాను భరించలేదు' అని పేర్కొన్నారు. అంటే, నేడు భూగోళంపై జరుగుతోన్న పర్యావరణ మార్పులూ... వినాశనం దృష్ట్యా చైనా స్థాయిలో పారిశ్రామిక సరుకు ఉత్పత్తి చేయగల మరో దేశం అవసరం లేదన్నమాట. అటువంటిదే జరిగితే ప్రపంచంలో కాలుష్యం మరింత వేగంగానూ, తీవ్రంగానూ పెరిగిపోతుంది. ఈ క్రమంలోనే ఆయన భారతదేశం సరుకు ఉత్పత్తి రంగంలో చైనాతో పాటుగా ఎదిగే ప్రయత్నాన్ని ప్రశ్నించారు. దీనిలో భాగంగానే ఆయన ఏది ఏమైనా సరే భారీ వృద్ధిరేట్లను సాధించాలనే దృక్పథాన్ని విమర్శిస్తూ... దాని స్థానే నేడు భారత్‌కు కావాలిసింది హేతుబద్ధమైన, పర్యావరణం పట్ల చైతన్యం గల వినియోగం, ఉత్పత్తి అని పేర్కొన్నారు.

ఈ సందర్భంలోనే, 2014లో 'మేకిన్ ఇండియా' కార్యక్రమాన్ని మోదీ ఆరంభించిన నేపథ్యంలో మాజీ రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ అయిన రఘురామ్



రాజన్ మాటలను కూడా గుర్తుచేసుకోవచ్చు. ఆయన ప్రకారంగా 'మేకిన్ ఇండియా' కార్యక్రమం పేరిట ప్రపంచానికి మరో చైనా అవసరం లేదు. నిజానికి మనం కొద్ది దశాబ్దాల క్రితమే పారిశ్రామిక సరుకు ఉత్పత్తి దిగ్గజంగా ఎదిగే అవకాశాన్ని కోల్పోయాం... బస్సు మిస్సయ్యాం! సరుకు ఉత్పత్తి రంగంలో ముందుగానే 1980లలో ప్రయాణం ప్రారంభించిన చైనా నేడు శాచ్యురేషన్ స్థాయిని సాధించి ఉంది. అదీ విషయం. అంటే, రఘురామ్ రాజన్ ఈ మాటలను అంతర్జాతీయ మార్కెట్ తాలూకు అవసరాలు, డిమాండ్ స్థాయుల గురించి వివరిస్తూ చెప్పారు.

అయితే, గత పది సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం తన దృష్టినంతా సరుకు ఉత్పత్తిరంగం పైననే పెట్టింది. దీనిలో భాగంగానే 2014లో 'మేకిన్ ఇండియా' కార్యక్రమం ముందుకు వచ్చింది. అనంతరం 2019లో భారీస్థాయిలో కార్పొరేట్ ట్యాక్స్‌ను ప్రభుత్వం తగ్గించింది. ఇక తరువాత ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పేరిట లక్షల కోట్ల రూపాయల రాయితీలతో దేశంలో భారీ పారిశ్రామికీకరణను తలపెట్టింది. కానీ, ఈ ప్రయత్నాలు ఏవీ ఇప్పటివరకూ ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వలేదు. ఈ కారణం చేతనే కోవిడ్ అనంతర కాలంలో అంతర్జాతీయంగా ముందుకు వచ్చిన 'చైనా+1' ఆలోచన కూడా మనదేశానికి సంబంధించినంత వరకూ పెద్దగా ఫలితాలను సాధించలేదు. మరో పక్కన దేశంలో నిరుద్యోగం భారీగా పెరిగిపోతోంది. అనేక ఇతరేతర ఆర్థిక సమస్యలు కూడా చుట్టుముడుతున్నాయి. కాబట్టి నేడు మనం పాత దశలవారి సిద్ధాంతం అయిన వ్యవసాయరంగం నుంచి సరుకు ఉత్పత్తి రంగం, అనంతరం సేవారంగంలోకి ప్రయాణం అనే దానికి ఇక ఎంత మాత్రమూ అంటిపెట్టుకోలేము. సరికొత్త మార్గాన్ని అన్వేషించుకోవాలి. ప్రధాని మోదీ కూడా 'ఏదేమైనా వృద్ధిని సాధించడమే ఏకైక లక్ష్యమ'ని ఇక ఎంతమాత్రమూ అనలేము అంటూ ఈమధ్య పేర్కొనటాన్ని గమనించవచ్చు.

ఈ నేపథ్యంలో ముందుకు వచ్చినవే సుమన్ బెరి ఆలోచనలు. వాస్తవానికి నేడు ప్రపంచమంతటా పెరిగిపోతున్న సాంకేతికత దృష్ట్యా సరుకు ఉత్పత్తిరంగంలో ఉపాధి అవకాశాలు వేగంగా క్షీణిస్తున్నాయి. ఇదీ సమస్య తాలూకు మరో కోణం. అంటే, మనం సరుకు ఉత్పత్తిరంగంపై దృష్టిపెట్టి, దానిలో ఒకవేళ బాగా ముందుకు వెళ్ళగలిగినా అది మన ప్రధాన సమస్య అయిన నిరుద్యోగాన్ని పరిష్కరించలేదు. ఈ నేపథ్యంలో మనకు ఉన్న మెరుగైన మార్గాంతరంగా వ్యవసాయరంగంపై దృష్టిపెట్టడం అనేది ఉంది. దీనినే సుమన్ బెరి ప్రతిపాదిస్తున్నారు. ఆయన ప్రకారం మనం పర్యావరణ కాలుష్యం, నిరుద్యోగం వంటి సమస్యలు పరిష్కరించలేకపోవడం దృష్ట్యా, సరుకు ఉత్పత్తిరంగాన్ని మన ప్రాధాన్యతగా చేసుకోరాదు. మనం చేయవలసింది, వ్యవసాయ రంగంలో సూపర్ పవర్‌గా ఎదగగలగడం.

నేడు మన దేశ జనాభాలో 55–60 శాతం మేరకు వ్యవసాయ రంగంలోనే ఉన్న నేపథ్యంలో, వారి ఉత్పాదకతతోపాటు, వారి ఆదాయాలను కూడా పెంచేదిశగా చర్యలు తీసుకుంటే అవి దేశీయంగానే డిమాండ్ కల్పనకూ... వ్యవసాయరంగాన్ని ఒక మెరుగైన ఉపాధి రంగంగా యువకుల ముందు ఉంచగలిగేటందుకూ ఉపయోగపడతాయి. అటువంటి విధానాలు, దేశంలోని నగర ప్రాంతాలలో కూడా ఆర్థిక కార్యకలాపాల వృద్ధికి ఉపయోగపడతాయి. ఒక రచయితగా నేను 2014లో 'మేకిన్ ఇండియా' కార్యక్రమం ఆరంభం అయిన నాటి నుంచి పదే పదే వ్యాసాలలో, ఉపన్యాసాలలో వివరించినది ఇదే!

స్థూలంగా నేడు మనదేశంలో కూడా సరికొత్త ఆలోచనల పవనాలు వీస్తున్నాయి. కానీ, పుణ్యకాలం కాస్త అయిపోయిన తరువాత అన్నట్టుగా పది సంవత్సరాల విలువైన కాలాన్ని వృథా చేసుకుని నేడు మనం మరలా బండి చక్రాన్ని కనుగొంటున్నట్లుగా ఇది ఉంది. ఏదేమైనా, నేటికైనా మన దేశ ఆర్థిక నమూనా పాత సైద్ధాంతిక చట్రాలను బద్దలు కొట్టుకొని సరైన దారిలోకి ప్రయాణిస్తుందని ఆశిద్దాం.

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు
మొబైల్: 98661 79615

ఊతకర్రల మవుదాం!

భారతీయ సంప్రదాయ కుటుంబ వ్యవస్థలో ఒకప్పుడు పెద్దలకు ఎంతో గౌరవం ఉండేది. కుటుంబంలో పెద్దలే నిర్ణయాత్మక శక్తులుగా ఉండేవారు. పిల్లలు కూడా పెద్దవారికి సేవలు చేయడం, వారిని గౌరవించడం తమ విధ్యుక్త ధర్మాలుగా భావించేవారు. పిల్లలు తమ సంపాదనను పెద్దల చేతికిచ్చి, ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొనేముందు పెద్దవారితో సలహా సంప్రతింపులు తీసుకొనేవారు. ఈ రకమైన సలహాలు కుటుంబ అభివృద్ధికి అవసరమని ఆనాడు భావించేవారు. గత కాలంలో కుటుంబ పెద్దల మాటకు అగ్రతాంబూలం లభించేది.

నేడు పెద్దలు లేదా వయోవృద్ధుల పట్ల, కుటుంబ సభ్యుల ఆలోచనా ధోరణి విపరీతంగా మారింది. ఈ శతాబ్ది కాలంలో సంభవించిన సామాజిక, ఆర్థిక మార్పుల దృష్ట్యా కుటుంబాలలో వృద్ధుల పట్ల ప్రేమ, ఆదరాభిమానాలు క్రమేపీ క్షీణిస్తున్నాయి. వైద్య విప్లవం, పెరిగిన జీవన ప్రమాణాలు, పోషకాహారం లభ్యత వంటి కారణాలతో మనుషుల ఆయుర్దాయం పెరిగినమాట వాస్తవమే. చాలా దేశాలలో వయోవృద్ధులను వేధించడం, నిర్లక్ష్యానికి గురిచేయడం కనిపిస్తుంది. ఒంటరితనం ఒక శాపంగా మారి, ఎన్నో అవమానాలను భరిస్తూ, కనీస అవసరాలను కూడా తీర్చుకోలేని నిస్సహాయ స్థితిలో వృద్ధులు ఉన్నారు. వృద్ధాప్యంలో జీవిత భాగస్వామిని కోల్పోయిన పిల్లలు లేని వృద్ధుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది.



మనదేశంలో ప్రతి పదిమందిలో ఒకరు వృద్ధాప్యంలో ఉన్నారు. 2050 సంవత్సరానికి దేశంలో ఈ వృద్ధ జనాభా 50 కోట్లు దాటుతుందని అంచనా. 'వృద్ధాప్యం ఒక వరం, కారాదు శాపం' అన్నట్లుగా మలి సంధ్య వెలుగుల్ని వృద్ధతరం ఆస్వాదించేటట్లుగా పరిస్థితులను సమాజం సృష్టించాలి. వృద్ధాప్యాన్ని సుఖవంతం చెయ్యని జాతి ఎప్పటికీ ఫలవంతం కాదు. ఏ జాతి కీర్తి, గౌరవ సుఖసంపదలైనా ఆ జాతి వృద్ధుల నిర్విరామ కృషి ఫలితాలే!

వయోవృద్ధులకు సంరక్షణ, పోషణ కల్పించే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ చట్టాలను రూపొందిస్తున్నాయి. 'తల్లి తండ్రుల, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007'ను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. ఈ చట్టం వయోవృద్ధులకు ఒక భరోసా ఇవ్వగల సంక్షేమ చట్టం. ఈ చట్టాన్ని అనుసరించి పోషణకు నోచుకోని తల్లితండ్రులకు నెలకు పదివేల రూపాయల వరకు ఇవ్వవలసినదిగా కోర్టులు ఆదేశించవచ్చును. కుటుంబంలో వృద్ధులను సంరక్షించే బాధ్యత ఉన్న వ్యక్తులెవ్వరైనా, వారిని శాశ్వతంగా వదిలించుకొందామనే ఉద్దేశ్యంతో, ఈ వృద్ధులను ఏదైనా ప్రదేశంలో వదలివేస్తే, అలాంటి వ్యక్తులకు మూడు నెలలు జైలు శిక్ష లేదా ఐదు వేల రూపాయల జరిమానా లేదా రెండూ కోర్టులు విధించవచ్చు.

జీవితమనే 'నాటకం'లో చివరి అంకం వార్ధక్యం. మానవ జీవితంలో ఎవరికైనా తప్పని దశ. వృద్ధాప్యం 'శాపం' అనుకొంటూ చీకట్లోకి జారిపోయే కంటే వృద్ధాప్యాన్ని 'రంగుల హరివిల్లు' చేసుకొంటే బాగుంటుందనే సానుకూల దృక్పథం వృద్ధులలోనూ కలగాలి. మలి సంధ్య వెలుగుల్ని ఈ 'వృద్ధతరం' ఆస్వాదించే పరిస్థితులున్న సమాజం సృష్టించడానికి మన మందరం 'ఊతకర్ర'లమవుదాం!

– అంగలకుదిటి నాగ వీర భద్రాచారి, రిటైర్డ్ ప్రిన్సిపాల్, చీరాల

(నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** బ.విదియ ప.12.13 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** అశ్వని రా.11.10 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** రా.7.19 నుండి 8.52 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.11 నుండి 5.01 వరకు, **అమృతఘడియలు:** సా.4.12 నుండి 5.46 వరకు; **రాహుకాలం:** సా.4.30 నుండి 6.00 వరకు, **యమగండం:** ప.12.00 నుండి 1.30 వరకు, **సూర్యోదయం:** 5.54, **సూర్యాస్తమయం:** 5.48



శంఖుస్థాపన

NH-163G, నాగ్‌పూర్-విజయవాడలో భాగంగా వరంగల్ నుండి ఖమ్మం వరకు నాలుగు వరుసల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం

(పొడవు : 108 కి.మీ. । అంచనా వ్యయం : ₹3397 కోట్లు)

- గిరిజన, ఆకాంక్షాత్మక మరియు ఎల్ డబ్ల్యుఇ ప్రభావిత జిల్లాల సామాజిక ఆర్థిక అభివృద్ధిని మెరుగుపరుస్తుంది.
- పుణ్యక్షేత్రాలకు మెరుగయిన కనెక్టివిటీన ద్వారా పర్యాటక మరియు ఉపాధి అవకాశాలు పెరుగుతాయా

NH-163G, నాగ్‌పూర్-విజయవాడలో భాగంగా ఖమ్మం నుండి విజయవాడ వరకు నాలుగు వరుసల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం

(పొడవు : 90 కి.మీ. । అంచనా వ్యయం : ₹3007 కోట్లు)

- ప్రధాన రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు మరియు ఓడరేవులతో అంతర్రాష్ట్ర మరియు బహుళ-నమూనా కనెక్టివిటీని మెరుగుపరుస్తుంది.
- నాగ్‌పూర్ - విజయవాడ మధ్య ప్రయాణ సమయం, ఖర్చు మరియు దూరం 178 కి.మీ తగ్గుతుంది

కృష్ణపట్నం నుండి హైదరాబాద్ వరకు బహుళ ఉత్పత్తుల పైప్‌లైన్

(పొడవు : 425 కి.మీ. । అంచనా వ్యయం : ₹1932 కోట్లు)

- నిర్మాణం మరియు O&M సమయంలో 13 లక్షల పనిదినాల ఉపాధి అవకాశాలు కలుగుతాయి
- తెలంగాణలో విశ్వసనీయమైన మరియు అంతరాయం లేని పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా

ప్రారంభోత్సవం & జాతికి అంకితం

NH-365BB, సూర్యాపేట - ఖమ్మం సెక్షన్ నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణం

(పొడవు : 59 కి.మీ. । అంచనా వ్యయం : ₹2457 కోట్లు)

- తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య వేగవంతమైన, ఇబ్బంది లేని ప్రయాణం మరియు సరుకు రవాణా సదుపాయం
- ఈ ప్రాంతంలో బొగ్గు మరియు గ్రానైట్ పరిశ్రమల అభివృద్ధి

జక్లేర్ నుండి కృష్ణా కొత్త రైల్వే లైన్ ప్రాజెక్ట్ నిర్మాణం

(పొడవు : 37 కి.మీ. । అంచనా వ్యయం : ₹505 కోట్లు)

- నారాయణపేట జిల్లాలో కొత్త ప్రాంతాలకు మొదటి సారి రైలు మార్గం
- కొత్త రైలు వలన ఈ ప్రాంత ప్రజలకు సామాజిక-ఆర్థిక అభివృద్ధిని పెంపొందిస్తుంది.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో కొత్త భవనాలు

(స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, మేనేజ్మెంట్ స్టడీస్, లెక్చర్ హాల్ కాంప్లెక్స్-3, ఎస్.ఎన్.స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్, అనుబంధం)

(అంచనా వ్యయం : ₹81 కోట్లు)

- విద్యార్థులకు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పన

HPCL - హసన్ - చెర్లపల్లి LPG పైప్‌లైన్

(పొడవు : 650 కి.మీ. । అంచనా వ్యయం : ₹2166 కోట్లు)

- వినియోగదారుడికి అదే రోజు ఎల్ పిజి సిలిండర్ డెలివరీని అందించడం
- కార్బన్ పాదముద్రను సంవత్సరానికి 12,600 మెట్రిక్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గిస్తుంది.

హైదరాబాద్ (కాచిగూడ) - రాయచూర్-హైదరాబాద్ (కాచిగూడ) రైలు సర్వీస్ ఫ్లాగ్-ఆఫ్

- ప్రయాణీకుల కొరకు వేగవంతమైన, సురక్షితమైన మరియు ఆర్థిక రవాణా సదుపాయం
- నారాయణపేట జిల్లాలో చేనేత పరిశ్రమకు ప్రోత్సాహం

నరేంద్ర మోదీ

భారత ప్రధాన మంత్రి

వారి అమృత హస్తాల మీదుగా

ఆదివారం, 01 అక్టోబర్, 2023 | మ. గం॥ 02:00 | మహబూబ్‌నగర్

వీరి ఘనమైన సమక్షంలో

కె.చంద్రశేఖర్ రావు
ముఖ్యమంత్రి, తెలంగాణ

జి. కిషన్ రెడ్డి
కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మరియు ఈశాన్య ప్రాంతం అభివృద్ధి శాఖ మంత్రివర్యులు

వేముల ప్రశాంత్ రెడ్డి
రోడ్లు & భవనాలు, శాసన వ్యవహారాలు & గృహ శాఖ మంత్రి వర్యులు,తెలంగాణ ప్రభుత్వం

మన్నె శ్రీనివాస్ రెడ్డి
పార్లమెంట్ సభ్యులు (లోక్‌సభ)

శ్రీ సంజయ్ కుమార్ బండి
పార్లమెంట్ సభ్యులు

((•)) DD న్యూస్ లో ప్రత్యక్ష ప్రసారం వీక్షించండి

CBC 37107/15/0031/2324

క్లుప్తంగా...

రూ.2 వేల నోట్ల మార్పిడికి 7 వరకు గడువు

ముంబై: రూ.2 వేల నోట్ల ఉపసంహరణ గడువును రిజర్వ్ బ్యాంక్ మరో వారంపాటు, అక్టోబర్ 7వ తేదీ వరకు పొడిగించింది. మే 19వ తేదీ నుంచి మొదలైన రూ.2 వేల నోట్ల ఉపసంహరణ, మార్పిడి ప్రక్రియలో సెప్టెంబర్ 19వ తేదీ వరకు ప్రజలు రూ. 3.42 లక్షల కోట్ల విలువైన నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేశారని శనివారం ఒక ప్రకటనలో ఆర్‌బీఐ వెల్లడించింది. దేశంలో మే 19వ తేదీ వరకు చెలామణిలో ఉన్న కరెన్సీలో ఇది 96 శాతానికి సమానమని పేర్కొంది. ప్రస్తుతం రూ.14 వేల కోట్ల విలువైన రూ.2 వేల నోట్లు మాత్రమే చెలామణిలో ఉన్నాయని తెలిపింది. అక్టోబర్ 7వ తేదీ తర్వాత కూడా రూ.2 వేల నోట్ల మార్పిడి చేసుకోవచ్చని, అయితే ఆ అవకాశం దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో మాత్రమే ఉంటుందని స్పష్టం చేసింది.

సైనికులకు సిరిధాన్యాల ఆహారం

మైసూరు: దేశ రక్షణ కోసం సరిద్దుల్లో పని చేస్తున్న సైనికుల ఆరోగ్యాన్ని పెంపొందించేలా సిరిధాన్యాలను వారి ఆహారంలో వినియోగిస్తామని కేంద్ర రక్షణ, పర్యాటక శాఖల సహాయ మంత్రి అజయ్ భట్ తెలిపారు. శనివారం మైసూరులోని కేంద్ర రక్షణ ఆహార పరిశోధనా ప్రయోగాలయం (డీఎఫ్ఆర్ఎల్)లో 'మిలిటరీ రేషన్, పౌష్టికాంశాలతో కూడిన సిరిధాన్యాలు'అంశంపై రెండు రోజుల సదస్సును ఆయన ప్రారంభించారు. చిరుధాన్యాల నిపుణుడు, పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలి కూడా పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ అత్యంత ఎత్తైన సియాచిన్ లాంటి ప్రాంతాల్లో గస్తీ విధులను నిర్వహిస్తుంటారని చెప్పారు. క్లిష్ట పరిస్థితుల్లో పనిచేసే సైనికుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా కష్టమైన పని అన్నారు. వారు ఆరోగ్యవంతులుగా ఉండేందుకు సిరిధాన్యాలతో కూడిన ఆహారాన్ని అధికంగా ఇస్తామని చెప్పారు.

లిప్‌స్టిక్, బాబ్డ్ హెయిర్ మహిళలకే ప్రయోజనం

మహిళా రిజర్వేషన్లపై ఆర్‌జేడీ నేత వ్యాఖ్య

పట్నా: మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా చట్టసభల్లోకి ప్రవేశించే మహిళలనుద్దేశించి ఆర్‌జేడీ సీనియర్ నాయకుడు అబ్దుల్ బరి సిద్దిఖి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. లిప్‌స్టిక్‌లు వేసుకొని, బాబ్డ్ హెయిర్‌తో ఉన్న మహిళలు ఇక చట్టసభల్లోకి అడుగు పెడతారని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకి కోటా ఇవ్వకపోవడంతో ఇక లిప్‌స్టిక్ మహిళలే ఆ చట్టం ద్వారా లబ్ధి పొందుతారని వ్యాఖ్యానించారు. ముజఫర్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సిద్దిఖి చేసిన ఈ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో తనని తాను సమర్థించుకున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకి అర్థం కావడానికే అలా మాట్లాడానన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలు ముగిసేంత వరకు టీవీ, సోషల్ మీడియాకి దూరంగా ఉండాలని తన అనుచరులకు సూచించారు.

పోలీసు లాంఛనాలతో స్వామినాథన్ అంత్యక్రియలు

సాక్షి, చెన్నై: హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ పార్థివ దేహానికి శనివారం చెన్నైలో తమిళనాడు పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. వయో సంబంధ ఆరోగ్య సమస్యలతో స్వామినాథన్ (98) చెన్నైలో గురువారం కన్నుమూసిన విషయం తెలిసిందే. అదే రోజు రాత్రి తరమణిలోని ఎంఎస్ స్వామినాథన్ ఫౌండేషన్‌కు భౌతిక కాయాన్ని తరలించారు. శనివారం ఉదయం 11 గంటలకు తరమణి నుంచి ప్రత్యేక వాహనంలో పార్థివదేహాన్ని బీసెంట్ నగర్ శ్మశాన వాటికకు తీసుకొచ్చారు. పోలీసులు మూడు సార్లు గాలిలోకి కాల్పులు జరిపిన అనంతరం స్వామినాథన్ పార్థివ దేహాన్ని విద్యుత్ శ్మశాన వాటికలో దహనం చేశారు.

వీల్‌చైర్ వాడేవారి కోసం రైళ్లలో ర్యాంపులు

న్యూఢిల్లీ: వీల్‌చైర్ వాడే వారు, సీనియర్ సిటిజన్ల సౌకర్యం కోసం రైళ్లలో త్వరలో ప్రత్యేకంగా ర్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఇందుకోసం కొత్తగా రూపొందించిన ర్యాంపుల ఫొటోలను శనివారం ఆయన విడుదల చేశారు. ఇలాంటి వాటిని ఇప్పటికే చెన్నై రైల్వే స్టేషన్‌లో వినియోగించి చూశామని, ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉన్నట్లు ప్రయాణికుల నుంచి ఫీడ్ బ్యాక్ కూడా అందిందన్నారు. త్వరలో వీటిని వందేభారత్ రైళ్లలో, ఆ తర్వాత మిగతా రైళ్లలోనూ అందుబాటులోకి తెస్తామని తెలిపారు. టికెట్లు బుకింగ్ చేసుకునే సమయంలోనే వీటి అవసరముందనే విషయం ప్రయాణికులు తెలిపేందుకు వీలుగా మార్పులు చేస్తున్నామన్నారు. దాని ఆధారంగా సంబంధిత రైల్వే స్టేషన్లకు అలెర్ట్ వెళ్తుందని, దాన్ని బట్టి అక్కడి సిబ్బంది ర్యాంపును సిద్ధంగా ఉంచుతారని వివరించారు. బోగీ తలుపుల వద్ద వీటిని సునాయాసంగా ఏర్పాటు చేయొచ్చన్నారు.

గురుత్వాకర్షణ పరిధిని దాటిన ఆదిత్య-ఎల్1

బెంగళూరు: సూర్యుడిపై పరిశోధనలే లక్ష్యంగా ప్రయోగించిన ఆదిత్య-ఎల్1 ఉపగ్రహం భూమికి 9.2 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించి, భూ గురుత్వాకర్షణ పరిధిని దాటేసిందని ఇస్రో తెలిపింది. ప్రస్తుతం అది లాగ్రాంజ్ పాయింట్ దిశగా ప్రయాణం సాగిస్తోందని శనివారం 'ఎక్స్'లో వెల్లడించింది. ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ- సి57 రాకెట్ ద్వారా సెప్టెంబర్ 2వ తేదీన శ్రీహరి కోట నుంచి ప్రయోగించిన విషయం తెలిసిందే.



జస్ట్.. 5 గ్రాములు చాలట!

రోజుకు 8 గ్రాముల ఉప్పు చాలా ఎక్కువ
నిర్ధారిత మోతాదు దాటితే ప్రమాదమే..

జర్నల్ నేచర్ తాజా అధ్యయనం చెప్పిందిదే!

రోడ్డు పక్కన వేడివేడి పకోడీ, మిరపకాయ బజ్జీ, సమోసా మొదలుకుని మంట కింద మసాలా దాకా. ఇలా బయట ఏం తిన్నా మనలో చాలామందికి కాస్త ఉప్పు గట్టిగా పడాల్సిందే. ఇంట్లో కూడా కూరలు మొదలుకుని తెలుగు వారికే ప్రత్యేకమైన నానా రకాల పచ్చళ్ల దాకా అన్నింట్లోనూ ఉప్పు కాస్త ఎక్కువగా వేయనిదే ముద్ద దిగని వాళ్లు చాలామందే ఉన్నారు. ఇలా సగటు భారతీయుడు రోజూ ఎడాపెడా ఉప్పు తినేస్తున్నా డట. ఈ క్రమంలో నిర్ధారిత మోతాదును ఎప్పుడో దాటేశాడని తాజా అధ్యయ నం ఒకటి తేల్చింది...ఆరోగ్య వంతుడైన వ్యక్తి ఆహారంలో రోజుకు 5 గ్రాములు, అంతకంటే తక్కువ ఉప్పు తీసుకోవాలి. కానీ భారతీయులు మాత్రం రోజుకు ఏకంగా 8 గ్రాములు లాగించేస్తున్నారు! జర్నల్ నేచర్ పోర్టుఫోలియో తాజాగా జరిపిన అధ్యయనంలో ఈ మేరకు తేలింది.

ఇలా చేశారు...

జాతీయ అంటీతర వ్యాధుల పర్యవేక్షణ సర్వేకు సేకరించిన శాంపిల్‌నే ఈ సర్వేకు ఆధారంగా తీసుకున్నారు.

- వారిలో 3,000 మంది వయోజనులను రాండమ్‌గా ఎంచుకున్నారు.
- ఉప్పులో కీలకంగా ఉండే సోడియం మోతాదు వారి మూత్రంలో ఏ మేరకు ఉందో పరిశీలించారు.
- అంతర్జాతీయ ప్రమాణాలతో దాన్ని పోల్చి చూశారు.
- వారందరూ మోతాదుకు మించి చాలా ఎక్కువగా ఉప్పు తీసుకుంటున్నట్టు తేలింది!

'ఉప్పు' వీరులు పురుషులే!

సర్వేలో చాలా ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి...

- అన్ని సామాజిక వర్గాల వారూ ఉప్పు చాలా ఎక్కువగా తింటున్నారు. అయితే ఈ విషయంలో మహిళలతో పోలిస్తే పురుషులదే పైచేయి.
- మహిళలు రోజుకు 7.9 గ్రాముల ఉప్పు తింటుంటే పురుషులు 8.9 గ్రాములు లాగిస్తున్నారు!
- ఉద్యోగులు 8.6 గ్రాములు, పొగ తాగేవారు 8.3 గ్రాములు, హై బీపీ ఉన్నవారు 8.5 గ్రాముల ఉప్పు తింటున్నారని తేలింది.
- ఇక ఊబకాయులైతే ఏకంగా రోజుకు 9.3 గ్రాముల ఉప్పు తినేస్తున్నారు.
- వీరితో పోలిస్తే నిరుద్యోగులు, పొగ తాగని వారు, బీపీ, ఊబకాయం లేనివారు ఉప్పు తక్కువ తీసుకుంటున్నట్టు తేలడం విశేషం!

సోడియం కథా కమామిషు...

- నరాలు, కండరాల పనితీరుకు సోడియం చాలా అవసరం. అలాగని ఒంట్లో దాని స్థాయి మితిమీరకూడదు కూడా.
- ఒక వ్యక్తి రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ సోడియం తీసుకోవాలి.
- అంతకంటే ఎక్కువైతే హైబీపీ, హైపర్ టెన్షన్ వంటివాటికి దారితీస్తుంది.
- సోడియం పరిమాణం తక్కువగా ఉన్న ఉప్పు తినడం ఆరోగ్యవంతులకు మంచిదే. కానీ షుగర్ పేషెంట్లు, హృద్రోగులు తదితరులకు రక్తంలో హెచ్చు పొటాషియం హైపర్ కలేమియాకు దారి తీస్తుంది. దానివల్ల కండరాలు బలహీనపడతాయి. అంతేగాక పల్స్, గుండె కొట్టుకునే వేగం కూడా పడిపోతాయి!
- సోడియం ఎక్కువగా ఉండే తిండి హై బీపీ, హైపర్ టెన్షన్ రిస్కును బాగా పెంచుతుందని ఈ అధ్యయనం మరోసారి తేల్చింది.
- అవి చివరికి గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వంటివాటికి దారితీసి ప్రాణాంతకంగా మారతాయి.
- అందుకే ఆరోగ్యవంతులైనా, మరొకరైనా ఆహారంలో ఉప్పు మోతాదు వీలైనంత తగ్గించడమే మంచిది.

- 'మనమంతా ఆహారంలో ఉప్పును రోజుకు కనీసం 1.2 గ్రాముల మేరకు తగ్గిస్తే చాలు. హైబీపీ కేసులు సగానికి సగం తగ్గిపోతాయి! కనుక ఆహారంలో ఉప్పును తగ్గించుకోవాల్సిన ఆవశ్యకతపై అందరిలోనూ, ముఖ్యంగా భారతీయుల్లో అవగాహన పెరిగేలా ప్రచార తదితర కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం చాలా ఉంది'

– డాక్టర్ ప్రశాంత్ మాథుర్, అధ్యయనకర్త, డైరెక్టర్, ఐసీఎంఆర్– నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్, ఇన్ఫర్మాటిక్స్ అండ్ రీసెర్చ్

– సాక్షి, నేషనల్ డెస్క్

యూకే గురుద్వారాలో భారత హైకమిషనర్ అడ్డగింత

- స్కాట్‌లాండ్‌లో రెచ్చిపోయిన సిక్కు యువకులు
- అవమానించారంటూ మండిపడిన భారత హైకమిషన్ కార్యాలయం



దొరైస్వామి

లండన్: ఖలిస్తాన్ సానుభూతిపరుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. కెనడాతో ఖలిస్తాన్ అంశంలో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతుండగానే అవి యూకేకు కూడా పాకాయి. స్కాట్‌లాండ్‌లోని గ్లాస్గో నగరంలో ఒక గురుద్వారాలోకి వెళ్లకుండా భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామిని ఖలిస్తానీ అతివాదులు అడ్డుకున్నారు. ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ (టీఎఫ్‌సీ) హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్ర ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్కాట్‌లాండ్‌లో ఖలిస్తానీ సిక్కు యువత రెచ్చిపోవడం ఆందోళన కలిగిస్తోంది. యూకే పర్యటనలో ఉన్న దొరైస్వామి అల్బర్ట్ డ్రైవ్‌లోని గ్లాస్గోలో గురుద్వారా గురు గ్రంథ సాహిబ్ కమిటీ సభ్యులతో సమావేశమవడానికి శుక్రవారం వచ్చారు. ఈ విషయాన్ని ముందే తెలుసుకున్న ఖలిస్తానీ యువత ఆయనను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. గురుద్వార సిబ్బందిని కూడా వారు బెదిరించారు. ఈ క్రమంలో అక్కడ ఘర్షణలు చోటు చేసుకున్నాయి. గురుద్వారా కమిటీ ఆహ్వానం మేరకే భారత హైకమిషనర్ అక్కడికి వచ్చినా సిక్కు యువకులు వారిని అడ్డుకున్నారు. ఇద్దరు యువకులు విక్రమ్ దొరైస్వామి కూర్చున్న కారు తలుపుని తీయడానికి ప్రయత్నించారు. దీంతో మరింత ఘర్షణని నివారించడానికి దొరైస్వామి అక్కడ్నుంచి వెళ్లిపోయారు.

అడ్డుకోవడం అవమానకరం

దొరైస్వామి కాన్వాయ్‌ని ఖలిస్తానీ సానుభూతిపరులు అడ్డుకోవడాన్ని భారత ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. బ్రిటన్ ప్రభుత్వం దృష్టికి దీనిని తీసుకువెళ్లింది. మరోవైపు లండన్‌లో భారత హైకమిషన్ ఈ చర్యను ఉద్దేశపూర్వకంగా అవమానించారంటూ మండిపడింది. బ్రిటన్ ప్రభుత్వానికి, పోలీసులకు దీనిపై ఫిర్యాదు చేసింది.

ఆన్‌లైన్ గేమింగ్‌లపై 28 శాతం జీఎస్టీ

నేటి నుంచి అమలులోకి

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు బెట్టింగ్‌ల పూర్తి విలువపై 28 శాతం జీఎస్టీని ఈరోజు(అక్టోబర్ 1వ తేదీ) నుంచి వసూలు చేయనున్నాయి. ఈ రంగంలో విదేశాల నుంచి భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీలు జీఎస్టీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫై చేసింది. సెంట్రల్ జీఎస్టీ, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ చట్టాలలో సవరించిన నిబంధనలకు అక్టోబర్ 1వ తేదీని అపాయింటెడ్ డేట్‌గా ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా నోటిఫై చేసింది. కేంద్ర జీఎస్టీ చట్టంలోని మార్పుల ప్రకారం ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోలు, గుర్రపు పందాలను ఇక నుంచి లాటరీ, బెట్టింగ్, జూదం మాదిరిగా పరిగణిస్తారు. ఆఫ్‌షోర్ ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లు భారత్‌లో రిజిస్ట్రేషన్ తీసుకోవడంతోపాటు దేశీయ చట్టానికి అనుగుణంగా 28 శాతం పన్ను చెల్లించడం తప్పనిసరి చేసింది. రిజిస్ట్రేషన్, పన్ను చెల్లింపు నిబంధనలను పాటించడంలో విఫలమైతే విదేశాలలో ఉన్న ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలను నిరోధించేందుకు ఈ సవరణలు వీలు కల్పిస్తాయి. కాగా, ఆర్థిక శాఖ కార్యదర్శి సంజయ్ మల్హోత్రాకు ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ లేఖ రాసింది. 15 రాష్ట్రాలు స్టేట్ జీఎస్టీ చట్టాల్లో మార్పులు ఇంకా చేయలేదని.. ఆయా రాష్ట్రాల ఆటగాళ్ల నుండి పొందిన డిపాజిట్లపై ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు అనుసరించాల్సిన జీఎస్టీ విధానం ఏమిటో తెలపాలని లేఖలో కోరింది. ఈ నోటిఫికేషన్లను పునఃపరిశీలించాలని, జీఎస్టీ స్కీమ్, భారత సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా అన్ని రాష్ట్రాలు తమ సంబంధిత సవరణలను ఆమోదించే వరకు వాటిని నిలిపివేయాలని కేంద్రాన్ని అభ్యర్థించింది. ఈలోగా తాము పేర్కొన్న సమస్యలను అవసరమైన వివరణలతో పరిష్కరించాలని కోరింది.

ఎల్‌నినో ఉన్నప్పటికీ సాధారణ వర్షపాతం

- దక్షిణాది రాష్ట్రాల్లో 8% లోటు
- భారత వాతావరణ విభాగం వెల్లడి

న్యూఢిల్లీ: ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ మొత్తమ్మీద సాధారణ వర్షపాతంతో ఈ సీజన్ ముగిసిందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) తెలిపింది. నాలుగు నెలల వర్షాకాలంలో దేశంలో దీర్ఘకాల సగటు వర్షపాతం 868.6 మిల్లీమీటర్లు కాగా, ఈసారి ఎల్‌నినో పరిస్థితులను నిలువరించే సానుకూల కారకాల ప్రభావంతో 820 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, ఇది 94.4 శాతమని ఐఎండీ తెలిపింది. దీర్ఘకాలం సరాసరి వర్షపాతం 94–106 శాతం మధ్య నమోదైతే సాధారణ వర్షపాతంగానే పరిగణిస్తారు. వాతావరణ మార్పుల కారణంగా రుతుపవనాల్లో అస్థిరత ఏర్పడినట్లు ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర శనివారం మీడియాతో అన్నారు. దేశంలోని 36 వాతావరణ సబ్ డివిజన్లకుగాను మూడింటిలో అధిక వర్షపాతం, 26 సబ్ డివిజన్లలో సాధారణ, ఏడింట్లో లోటు వర్షపాతం నమోదైందని చెప్పారు. లోటు వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, జార్ఖండ్, బెంగాల్, బిహార్, యూపీలో కొంత భాగం, కర్ణాటక దక్షిణ ప్రాంతం, కేరళ ఉన్నాయన్నారు. అదేవిధంగా, దక్షిణాది రాష్ట్రాల్లో 8% లోటు వర్షపాతం నమోదైందని చెప్పారు. అరేబియా సముద్రం, హిందూ మహాసముద్ర జలాల ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసాలు (హిందూ మహాసముద్రం డైపోల్), గాల్లో మేఘాలు, వర్షాలు తూర్పు దిశగా కదిలే తీరు(మాడెన్-జులియన్ ఆసిలేషన్) ఈ దఫా రుతుపవనాలను ప్రభావితం చేశాయని మహాపాత్ర విశ్లేషించారు. ఈ రెండు పరిస్థితులు ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించాయని వివరించారు. నైరుతి రుతు పవనాల సమయంలో ఏటా సాధారణంగా 13 వరకు అల్పపీడనాలు ఏర్పడుతుంటాయి, ఈసారి 15 అల్ప పీడనాలు ఏర్పడినప్పటికీ వాటి వృద్ధి సక్రమంగా లేదన్నారు. ఎల్‌నినో కారణంగానే 1901 తర్వాత అత్యంత వేడి మాసంగా ఈ ఏడాది ఆగస్ట్ రికార్డు సృష్టించిందన్నారు. నైరుతి రుతుపవనాల తిరోగమనం ఈసారి 8 రోజులు ఆలస్యంగా సెప్టెంబర్ 25వ తేదీన పశ్చిమ రాజస్తాన్ నుంచి ప్రారంభమయిన విషయం తెలిసిందే.

బీసీననే నాపై ద్వేషం

- కాంగ్రెస్‌పై మోదీ నిప్పులు
- ఇండియా కూటమి ఓ అహంకారుల గ్రూప్ అంటూ ధ్వజం
- ఛత్తీస్‌గఢ్‌లో ఆ పార్టీకి మళ్లీ అధికారమిస్తే మరింత అవినీతే
- ఈసారి బీజేపీని గెలిపించాలని ప్రజలకు పిలుపు

బిలాస్‌పూర్: కాంగ్రెస్ సారథ్యంలోని విపక్షాల ఇండియా కూటమిని అహంకారుల గ్రూప్‌గా, కాంగ్రెస్‌కు తానంటే ఎనలేని ద్వేషమని ప్రధాని మోదీ ఆరోపించారు. 'అసలు బీసీలన్నా, ఎస్సీలు, ఎస్టీలన్నా, ముఖ్యంగా పేదలన్నా ఆ పార్టీకి ఎనలేని ద్వేషం. అందుకే కాంగ్రెస్ వాళ్లు నన్ను నోటికొచ్చినట్టు తిట్టిపోస్తుంటారు. ఆ నెపంతో వాళ్లు అవమానించేది నిజానికి బీసీలను' అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తనపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు కోర్టు శిక్షించినా వారి వైఖరి అసలే మారలేదని దుయ్యబట్టారు. 'రాష్ట్రపతి పదవికి దళితుడైన రామ్‌నాథ్ కోవింద్ అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించింది. తాజాగా ఆదివాసీ మహిళ అయిన ద్రౌపదీ ముర్ము అభ్యర్థిత్వాన్నీ అలాగే వ్యతిరేకించింది. ఆయా సామాజికవర్గాల పట్ల ద్వేషమే అందుకు కారణం తప్ప సైద్ధాంతిక విభేదాలు కాదు. లేదంటే యశ్వంత్ సిన్హా వంటి మాజీ బీజేపీ నేతను పోటీగా బరిలో దింపేవారే కాదు' అని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శనివారం బిలాస్‌పూర్‌లో బీజేపీ నిర్వహించిన 'పరివర్తన్ మహాసంకల్ప' ర్యాలీలో మోదీ మాట్లాడారు. 30 ఏళ్లుగా మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ఏమీ చేయని కాంగ్రెస్, దాని భాగస్వామ్య పార్టీల అహంకార గ్రూప్ తాను బిల్లును ఆమోదం దాకా తీసుకెళ్లడం చూసి ఆశ్చర్యపోయిందన్నారు. 'అందుకు వాళ్లు నాపై ఆగ్రహంగా కూడా ఉన్నారు. విధి లేని పరిస్థితుల్లో మాత్రమే మహిళా బిల్లుకు వాళ్లు మద్దతిచ్చారు. ఇప్పుడిక మోదీకి మహిళలంతా ఎక్కడ మద్దతు పలుకుతారోనని భయపడుతున్నారు' అని ఎద్దేవా చేశారు. 'ఇప్పుడు మహిళా రిజర్వేషన్లను ఓబీసీలకు కూడా వర్తింపజేయాలంటూ కొత్త నాటకానికి కాంగ్రెస్ తెర తీసింది. తద్వారా మహిళల మధ్యా విభేదాలు రాజేసేందుకు ప్రయత్నిస్తోంది' అని ఆరోపించారు. 'మహిళా రిజర్వేషన్ల ప్రభావం వేలాది ఏళ్ల పాటు ఉంటుంది. మీ కూతుళ్ల భవిష్యత్తును బంగారుమయం చేస్తుంది' అని అన్నారు. 'అమ్మలారా. అక్కాచెల్లెళ్లారా! కాంగ్రెస్ వంటి అబద్ధాలకోర్ల వలలో పడకండి. నాకు మీ ఆశీస్సులు ఇలాగే కొనసాగాలి. అప్పుడే మీతో పాటు ప్రతి ఒక్కరి ఆకాంక్షలనూ నెరవేర్చగలుగుతా' అని పేర్కొన్నారు.



వేదికపై ప్రధాని మోదీ అభివాదం

అవినీతి కూపంలో కాంగ్రెస్

ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ పార్టీ పాలన పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని మోదీ ఆరోపించారు. ఖజానాలో డబ్బులకు కొదవే లేదని, కేంద్రం నుంచి వేలాది కోట్లు వస్తున్నాయని సాక్షాత్తూ ఆ పార్టీకి చెందిన ఉప ముఖ్యమంత్రే వేదికపై చెప్పారని గుర్తు చేశారు. 'రాష్ట్రంలో ప్రతి స్కీమ్‌లోనూ స్కామే. ఆ పార్టీకి గనక మరో అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని మరింత దోచుకుంటుంది' అని దుయ్యబట్టారు.

ఉగ్రవాదాన్ని కెనడా ప్రోత్సహిస్తోంది

- నిజ్జర్ హత్య కంటే అదే అతి పెద్ద సమస్య
- కెనడా ప్రభుత్వంపై జైశంకర్ ధ్వజం

వాషింగ్టన్: ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యపై నెలకొన్న విభేదాలను భారత్, కెనడా ప్రభుత్వం పరస్పరం చర్చించుకుంటే పరిష్కరించుకోవచ్చునని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. నిజ్జర్ హత్య కంటే ఉగ్రవాదాన్ని కెనడా ప్రభుత్వం ప్రోత్సహించడం అత్యంత తీవ్రమైన అంశంగా చూడాలని అన్నారు. ఖలిస్తానీ ఉగ్రవాదానికి, హింసాత్మక కార్యక్రమాలకు ట్రూడో ప్రభుత్వం అనుమతులిస్తోందని వెంటనే వాటిని నివారించాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న జై శంకర్ వాషింగ్టన్‌లో శుక్రవారం భారతీయ జర్నలిస్టులతో మాట్లాడారు. నిజ్జర్ హత్య వెనుక భారతీయ ఏజెంట్లు ఉన్నారంటూ కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణల్ని భారత్ గట్టిగా తిప్పి కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి కచ్చితమైన ఆధారాలుంటే చూపించాలన్నారు. వాటిని పరిశీలించడానికి భారత్ సిద్ధంగా ఉందని జైశంకర్ చెప్పారు. ''కెనడా ప్రభుత్వం నుంచి భారత్ చాలా కాలంగా ఎన్నో సమస్యల్ని ఎదుర్కొంటోంది. ఉగ్రవాదం, హింసాత్మక కార్యకలాపాలపై వారి ఉదాసీన వైఖరే ఇందుకు కారణం. భారత్‌లో నేరాలు చేసిన ఎందరో కెనడాలో తలదాచుకుంటున్నారు. వారిని అప్పగించాలని పలుమార్లు విజ్ఞప్తులు చేసినా కెనడా ప్రభుత్వం స్పందించడం లేదు. నిజ్జర్ హత్యపై ఆధారాలు ఇవ్వకుండా అభాండాలు వేస్తోంది. మేము నాలుగ్గోడల మధ్య లేము. ఏదైనా పరిశీలిస్తాం'' అని జై శంకర్ మండిపడ్డారు. నిజ్జర్ హత్య కంటే కెనడా ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడమే అతి పెద్ద సమస్యని దానినే మొట్టమొదట పరిష్కరించుకోవాలని అన్నారు.

ఓ వైపు గాంధీ.. మరోవైపు గాడ్సే

- వచ్చే ఎన్నికలు సిద్ధాంతాల మధ్య పోరాటం
- అధికారంలోకి వస్తే కులగణన చేపడతామన్న రాహుల్
- మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ జన ఆక్రోశ్ ర్యాలీ



భోపాల్: అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే లోక్‌సభ ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య జరిగే యుద్ధంగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఒక వైపు మహాత్మాగాంధీ, మరోవైపు ఆయనని హత్య చేసిన నాథూరామ్ గాడ్సే మధ్య ఎన్నికల పోరు జరగనుందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఓబీసీల సంఖ్య తెలుసుకోవడానికి కులగణన చేపడతామని చెప్పారు. ఈ డిసెంబర్‌లో ఎన్నికలు జరగనున్న మధ్యప్రదేశ్‌లోని షాజపూర్‌లో జన ఆక్రోశ్ ర్యాలీలో రాహుల్ గాంధీ శనివారం పాల్గొన్నారు. ''ఈ సారి ఎన్నికల పోరు రెండు సిద్ధాంతాల మధ్య జరుగుతుంది. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ, మరోవైపు బీజేపీ, ఆరెస్సెస్, ఒక వైపు మహాత్మాగాంధీ మరోవైపు గాడ్సేలు నిలిచి పోరాడతారు. ప్రేమ, సోదరభావం ద్వేషానికి మధ్య ఈ పోరాటం ఉంటుంది'' అని రాహుల్ చెప్పారు. బీజేపీ ప్రజలకి ఏం ఇస్తే వారు అదే తిరిగి ఇస్తారని, ఇన్నాళ్లూ బీజేపీ వారిలో విద్వేషం నింపిందని, ఇప్పుడు ప్రజలే బీజేపీని ద్వేషిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ దేశంలో ఆరెస్సెస్‌కు చెందిన కొందరు కేంద్ర ప్రభుత్వ అధికారులే చట్టాలు చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని, బీజేపీ ప్రజాప్రతినిధులకి ఎలాంటి పాత్ర లేదని అన్నారు. ఆరెస్సెస్ చెప్పినట్టుగా కేంద్ర ప్రభుత్వం ఆడుతోందని రాహుల్ ఆరోపించారు.

అవినీతి కేంద్రంగా ఎంపీ

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కుల ప్రాతిపదికన జనాభా గణన చేపడతామని రాహుల్ మరోసారి స్పష్టం చేశారు. ఇతర వెనుకబడిన కులాల (ఓబీసీ) సంఖ్యను తెలుసుకోవడానికే కుల గణన చేపడతామన్నారు. అవినీతికి మధ్యప్రదేశ్ కేంద్రంగా మారిందని రాహుల్ ఆరోపించారు. బీజేపీ హయాంలో గత 18 ఏళ్లలో 18 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని రాహుల్ చెప్పారు.

న్యూయార్క్‌లో వరద విలయం

న్యూయార్క్: అమెరికా ఆర్థిక రాజధాని న్యూయార్క్ అకాల వర్షాలతో అతలాకుతలమవుతోంది. శుక్రవారం రాత్రి ఏకధాటిగా కురిసిన వర్షానికి వీధులు, సబ్‌వేలు, హైవేలు జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో 20 సెంమీ. వర్షం కురిసింది. విమానాలు రద్దయ్యాయి. మెట్రో రైళ్లను నిలిపివేశారు. మెట్రో స్టేషన్లను మూసివేశారు. వరదల ధాటికి జనజీవనం స్తంభించింది. నగరంలో ఎమర్జెన్సీ విధించినట్టుగా రాష్ట్ర గవర్నర్ కాథి హౌచల్ ప్రకటించారు. ''నగరంలో వర్ష బీభత్సం ప్రమాదకరంగా మారింది. ఇల్లు దాటి బయటకు వస్తే ప్రాణాలు తీసేటట్టుగా ఉంది. అందుకే న్యూయార్క్ నగరం, లాంగ్ ఐలాండ్, హడ్సన్ వ్యాలీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితి విధిస్తున్నాం'' అని హౌచల్ వెల్లడించారు.

అమెరికాలో ఆర్థిక ప్రతిష్టంభన తప్పదా?


వాషింగ్టన్: అమెరికా మరోసారి ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిపోతోంది. ఫెడరల్ ప్రభుత్వం ప్రతిపాదించిన వార్షిక ద్రవ్య బిల్లును విపక్ష రిపబ్లికన్ పార్టీ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో అక్టోబర్ 1 నుంచి ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరం చెల్లింపులన్నీ నిలిచిపోయే ముప్పు ఉంది. రిపబ్లికన్ల డిమాండ్ మేరకు సరిహద్దు భద్రత సహా వివిధ ఏజెన్సీల చెల్లింపుల కోసం ప్రతిపాదిత బడ్జెట్‌లో 30% మేరకు నిధుల్లో కోత విధించినప్పటికీ మద్దతునివ్వడానికి వారు అంగీకరించడం లేదు. ప్రజాప్రతినిధుల సభలో రిపబ్లికన్లకే స్వల్ప మెజార్టీ ఉండడంతో ఈ బిల్లు పాస్ కాకపోతే ఏం చెయ్యాలన్న ఆందోళనలో అధ్యక్షుడు జో బైడెన్ ఉన్నారు. అదే జరిగితే 20 లక్షల మందికి పైగా భద్రతా సిబ్బంది జీతాల్లేకుండా పని చేయాల్సి ఉంటుంది. వివిధ పథకాలకు నిధులు కేటాయించలేరు.

పాఠాలు మానేసి ఇన్‌స్టా రీల్స్

లక్నో: స్కూలు పిల్లలకి పాఠాలు చెప్పే టీచర్లు సోషల్ మీడియా రీల్స్‌లో మునిగి తేలుతున్నారు. ఒక టీచర్ కెమెరా ముందు యాక్షన్ చేస్తే, మరో టీచర్ దానిని షూట్ చేయడం, ఇంకో టీచర్ ఎడిటింగ్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లు పోస్టు చేయడం ఇదీ తంతు. అక్కడితో వారు ఆగలేదు. తమ చానెల్‌ను లైక్, షేర్ చేసి సబ్‌స్క్రైబ్ చేయాలంటూ పిల్లలపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహా జిల్లాలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో గత కొద్ది నెలలుగా ఇదే జరుగుతూ వస్తోంది. దీంతో విసిగిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆ టీచర్లపై చర్యలు తీసుకోవాలంటూ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ (డీఎం)కు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ''మా టీచర్స్ అంబికా గోయెల్, పూనమ్ సింగ్, నీతూ కశ్యప్ ప్రతి రోజూ రీల్స్ చేస్తారు. వాటిని లైక్ చేసి షేర్ చేయాలని మాపై ఒత్తిడి తెస్తారు. అలా చేయకపోతే కొడతామంటూ వార్నింగ్ కూడా ఇస్తున్నారు'' అని అన్ను అనే విద్యార్థిని తన గోడు చెప్పుకుంది. తమ చేత టీ పెట్టించుకోవడం, వారి కోసం వండి పెట్టడం వంటి పనులు కూడా చేయించుకుంటారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అయితే టీచర్లు ఈ ఆరోపణల్ని కొట్టి పారేశారు.

ఐఎన్ఎస్ అధ్యక్షునిగా రాకేశ్ శర్మ

నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్న ది ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ



న్యూఢిల్లీ: ది ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ(ఐఎన్ఎస్)కి 2023–24 కాలానికి నూతన అధ్యక్షునిగా రాకేశ్ శర్మ(ఆజ్ సమాజ్) ఎన్నికయ్యారు. వార్తాసంస్థలు, మ్యాగజైన్‌లు, పీరియాడికల్స్ సంస్థల సంఘమైన ఐఎన్ఎస్ 84వ వార్షిక సాధారణ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా కొత్తగా అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యనిర్వాహక కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఇప్పటిదాకా సంస్థకు కె.రాజ ప్రసాద్ రెడ్డి(సాక్షి) అధ్యక్షునిగా కొనసాగిన విషయం తెల్సిందే. 2023–24 కాలానికిగాను ఐఎన్ఎస్ డిప్యూటీ ప్రెసిడెంట్‌గా శ్రేయాంస్ కుమార్(మాతృభూమి), వైస్ ప్రెసిడెంట్‌గా వివేక్ గుప్తా(సన్మార్గ్), గౌరవ ట్రెజరర్‌గా తన్మయ్ మహేశ్వరి(అమర్ ఉజాలా) ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కె.రాజ ప్రసాద్ రెడ్డి(సాక్షి), ఐ.వెంకట్(ఈనాడు, అన్నదాత)సహా 41 మంది ఎన్నికయ్యారు. సొసైటీకి సెక్రెటరీ జనరల్‌గా మేరీ పాల్ ఎంపికయ్యారు. మరోవైపు అధ్యక్షునిగా కొనసాగిన కాలంలో తనకు పూర్తి సహాయక సహకారాలు అందించిన ఐఎన్ఎస్ ఉపాధ్యక్ష, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు, తదితరులకు మాజీ అధ్యక్షుడు కె.రాజ ప్రసాద్ రెడ్డి(కేఆర్‌పీ రెడ్డి) కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి
హైదరాబాద్
ఆదివారం, 1, అక్టోబర్, 2023



ఉత్సాహంగా ‘ఉమాంగ్’

మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శనివారం జిటో (జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో ఉమాంగ్ 2.0 పేరుతో ఆభరణాలు, జీవనశైలి ప్రదర్శనను మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమాంగ్ కేవలం ఎక్స్‌పో మాత్రమే కాదని, వ్యవస్థాపక స్ఫూర్తికి వేదిక అని తెలిపారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. మూడు రోజుల పాటు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు మహాత్రియా రా, ఎక్స్‌పో ప్రాజెక్టు చైర్మన్ గౌతమ్ గెహ్లాట్, ప్రకాశ్ సేథియా, పరేష్ షా, సుశీల్ సంచేటీ తదితరులు పాల్గొన్నారు. – మాదాపూర్

న్యూస్‌రీల్

దివ్యాంగులకు 1,843 డబుల్ బెడ్రూం ఇళ్లు

రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి



చాదర్‌ఘాట్: హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో దివ్యాంగులకు డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీలో 5 శాతం కేటాయించినట్లు రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. శనివారం మలక్‌పేటలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మూడు జిల్లాల్లో దివ్యాంగులకు త్వరలో జరగబోయే మూడోఫేజ్‌లో 1,843 డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా దివ్యాంగులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించడం ముఖ్యమంత్రి సీఎం సాధ్యమయిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనేక సంక్షేమ పథకాలతో పాటు దాదాపు రూ. 7.50 కోట్ల విలువైన పరికరాలను దివ్యాంగులకు పంపిణీ చేశామని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ కార్పొరేటర్

బీఆర్‌ఎస్‌ను వీడనున్న బద్రినాథ్ యాదవ్



సాక్షి, సిటీబ్యూరో: బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ బద్రినాథ్ యాదవ్ కాంగ్రెస్ గూటికి చేరనున్నారు. శనివారం ఆయన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిశారు. త్వరలోనే భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిసింది. సనత్‌నగర్‌తో పాటు సికింద్రాబాద్, ముషీరాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో బద్రినాథ్‌కు ఉన్న పరిచయాలు కాంగ్రెస్‌కు ఉపకరిస్తాయని ఆ పార్టీ నేతలు భావిస్తున్నట్లు సమాచారం.

‘చార్లెస్ హార్ట్ హీరోస్’ క్యాంప్‌ను కొనసాగిస్తాం

నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప



లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రిలో పేద చిన్నారుల గుండె ఆపరేషన్ల కోసం ‘చార్లెస్ హార్ట్ హీరోస్’ పేరిట చేపట్టిన ప్రత్యేక శిబిరం కొనసాగుతుందని డైరెక్టర్, ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. శనివారం ఆస్పత్రి లెర్నింగ్ సెంటర్‌లో బ్రిటన్ వైద్య బృందానికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ.. బ్రిటన్ వైద్యుల సహకారంతో నిమ్స్‌లో ఏర్పాటు చేసిన చిన్నారుల గుండె ఆపరేషన్లు విజయవంతమయ్యాయని చెప్పారు. ఈ శిబిరంలో నలుగురు నవజాత శిశువులతో పాటు 17 మంది చిన్నారులకు గుండె సంబంధ సమస్యలపై ఆపరేషన్లు చేశామన్నారు. చిన్నారులకు ఆపరేషన్లు చేసిన బ్రిటన్‌కు చెందిన వైద్య బృందాన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ అమరేష్ రావు మాలెంపాటి, డాక్టర్ రమణ ధన్నపునేని తదితరులు పాల్గొన్నారు.

నేడు మాస్ క్లీనింగ్

సాక్షి,సిటీబ్యూరో: దేశ వ్యాప్తంగా జరిగే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నగరంలో ఆదివారం పెద్ద ఎత్తున మాస్ క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. జీహెచ్‌ఎంసీ అన్ని వార్డుల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ఐమాక్స్ వద్ద జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత సుద్దాల అశోక్‌తేజ, నటి అమల, కమిషనర్ రోనాల్డ్‌రాస్ పాల్గొననున్నారు. దీంతో పాటు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని కూడా నిర్వహించనున్నారు.

చదువరికి.. భాగ్య సిరి

పుస్తకాల పూదోటలో అక్షరాల పక్షులు

- కేబీఆర్ పార్కులో ‘హైదరాబాద్ రీడ్స్’
- ప్రతి శనివారం గ్రంథ పఠనంలో నిమగ్నం
- అన్ని వర్గాల పాఠకులకు ఆలవాలం
- ఆలోచనలు, అభిప్రాయాల మేళవింపు
- మంచి అనుభూతి అంటున్న యువత



బంజారాహిల్స్: వారాంతం వచ్చిందంటే చాలు ఎక్కడికి వెళ్దామా.. ఏ పర్యాటక ప్రాంతాన్ని చూసొద్దామా అని కొందరు ఉవ్విళూరుతుంటారు. కానీ ఇంకొందరు మాత్రం విభిన్నంగా ఆలోచిస్తారు. చల్లని సాయంత్రం తాము చదివే పుస్తకాన్ని వెంట తెచ్చుకుంటారు. తమలాంటి వారందరినీ ఆహ్వానిస్తారు. రెండు గంటలపాటు కలిసి చదువుకుంటారు. టీ/కాఫీ తాగుతూ తాము చదివే పుస్తకాలపై అభిప్రాయాలను పంచుకుంటుంటారు.. ఇది ఎక్కడో కాదు. నగరంలోని పచ్చని చిగురుటాకుల వనం కేబీఆర్ పార్క్‌లో.. ప్రతీ శనివారం సాయంత్రం 4.30 గంటలకు మొదలవుతుంది పుస్తక పఠనం. ప్రధాని నరేంద్ర మోదీ పుస్తక పఠనం గురించి మాట్లాడుతూ.. బెంగళూరుకు చెందిన ఇద్దరు ఏర్పర్చిన ‘కబ్బన్ రీడ్స్’ గురించి ఉదహరించారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని దేశంలో ముఖ్య నగరాలు, పట్టణాలలో సుమారు వంద ప్రదేశాలలో నిర్వహిస్తున్నారు వీటిని. ఇందులో నగరంలోని కేబీఆర్ పార్క్ ఒకటి (హైదరాబాద్ రీడ్స్). ఇక్కడి ప్రశాంత వాతావరణం .. పక్షుల కిలకిలారావాలు.. నెమళ్ల సోయగాల మధ్య పుస్తకాలు చదవటం గొప్ప అనుభూతి కలిగించే విషయం.



ఉత్సాహంగా.. సరికొత్తగా..

కరోనా సమయంలో ఒంటరితనంతో, వర్క్ ఫ్రం హోంతో సాముహిక జీవితంలో మనుషులు ఇమడలేని తనంలోంచి బయటపడేస్తూ బుక్ రీడ్స్ కొత్త తరాన్నంత ఒకటి చేస్తోంది. హైదరాబాద్‌లో ఈ ఏడాది జూన్ 3న బుక్ రీడ్స్ ప్రారంభమై ప్రతీ వారం కొనసాగుతోంది. దీనిని ప్రియాంక పిరంశెట్టి, శ్లోక చంద్ర మొదలు పెట్టారు. ఇందులో మూడేళ్ల పిల్లలు, యువతీ యువకులు, వృద్ధుల వరకు పాల్గొంటున్నారు. నగరంలో వివిధ వృత్తులు చేస్తుండే, వివిధ భాషలలోని వారు వారంలో కొన్ని గంటలను ఒకే అభిరుచి కల్గిన మనుషుల మధ్య గడుపుతారు. ఈ సమయం ఎంతో ఉత్సాహం ఇస్తుందని సభ్యులు పేర్కొంటున్నారు. నవలలు, కవిత్వం, కథలు, చరిత్ర, పురాణాలు, వైజ్ఞానిక అంశాలు.. ఇలా ఎవరికి నచ్చిన అంశంలో వారు ఆయా పుస్తకాలు చదవడం, ఒకరి నుంచి మరొకరు అభిప్రాయాలు, పుస్తకాలు పరిచయం చేసుకుంటూ పంచుకుంటూ కొత్త స్నేహాలు ఏర్పర్చుకుంటున్నారు. పాఠకులు తమ దుప్పటి/మ్యాట్ తెచ్చుకుని పార్క్‌లో తమకు నచ్చిన స్థానంలో కూర్చుంటారు. ఇలాంటి వేదికలు నగరంలో విస్తరిస్తున్నాయి. అలాగే.. ప్రస్తుతం సికింద్రాబాద్ రీడ్స్, గండిపేట రీడ్స్ ఏర్పడ్డాయి.

సాహిత్య గ్రంథాలు ఎక్కువగా తిరగేస్తున్నాం



కేబీఆర్ పార్కులో ప్రతి శనివారం రెండు గంటల పాటు పుస్తక ప్రియులమంతా కలిసి చదువుకోవడమే కాకుండా ఆ తర్వాత ఆ పుస్తకాల్లోని భావాలను పంచుకుంటున్నాం. ఒకే ఆలోచన గల వ్యక్తులంతా ఒక చోట చేరడం వల్ల అభిప్రాయ మార్పిడి మంచి ఫలితాలిస్తోంది. కరోనా తర్వాత మంచి స్నేహాల కోసం తపిస్తున్న వారికి కేబీఆర్ పార్కులో బుక్ రీడింగ్ ఒక మంచి వేదికగా నిలుస్తోంది. ప్రతీ శనివారం కోసం ఎదురు చూస్తుంటాం. ఇక్కడ ఎక్కువగా బెంగాలీ, మలయాళీ లిటరేచర్ పుస్తకాలు చదువుంటాం. ఫిక్షన్, నాన్ ఫిక్షన్ కూడా తిరగేస్తుంటాం.

– నుస్రత్ ఖాద్రి

పుస్తకాల్లో మనుషులుంటారు



‘పుస్తకాలలో మనుషులుంటారు’ అని రష్యన్ రచయిత గోర్కీ అంటాడు. ఆ మనుషులను చదవటం భలే ఇష్టంగా ఉంటుంది. అందులోనూ మనలాంటి అభిరుచి ఉన్న మనుషుల మధ్య కూర్చుని చదవటం చాలా ఆనందంగా ఉంటుంది. ఎవరి ఏకాంత ప్రపంచంలో వారు ఎప్పుడూ ఉండకుండా. సాముహిక ప్రపంచంలో కొన్ని గంటలు కేటాయించడం తృప్తిగా ఉంటుంది. చదవటం ఇష్టానికి సంబంధించినది కాదు. అది ఒక అందమైన పని. బాధ్యత.

– ఏపీ అరవింద్, సినీ రచయిత, ఫొటోగ్రఫర్

ప్రియ నేస్తాలు



పుస్తకాలు ప్రియనేస్తాలు. అంతేకాదు కేబీఆర్ పార్కులో హైదరాబాద్ రీడ్స్‌లో నేను ప్రతి శనివారం సహచరులతో కలిసి పుస్తక పఠనం చేస్తుంటే కొత్త నేస్తాలు పరిచయం అవుతున్నారు. ఒక వైపు పుస్తకం, మరోవైపు కొత్త నేస్తం సరికొత్త అనుభూతులకు కేబీఆర్ పార్కు నెలవుగా మారుతోంది. ఇదొక మంచి స్థలం. లైక్ మైండెడ్ పీపుల్ అంతా ఒకే చోట కలుస్తుండటంతో ఒకరి నుంచి మరొకరు అభిప్రాయాలు పంచుకుంటున్నారు. కరోనా సమయంలో సంబంధ బాంధవ్యాలు తెగిపోయాయి. ఇప్పుడు హైదరాబాద్ రీడ్స్‌తో అనుబంధాలు మళ్ళీ పెనవేసుకుంటున్నాయి.

– షామోహిత

కంటోన్మెంట్‌లో ‘డబుల్’ దుమారం!

- కాకరేపిన మంత్రి తలసాని ‘గూడుపుఠాణీ’ వ్యాఖ్యలు
- ఇళ్లు అమ్ముకున్నారంటూ ఆరోపణలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సొంత పార్టీ నేతలు
- ఆందోళన చేపట్టిన లబ్ధిదారులు
- నష్ట నివారణ చర్యల్లో రెవెన్యూ అధికారులు


మారేడుపల్లిలో ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లోని డబుల్ బెడ్రూం ఇళ్ల వ్యవహారంలో మంత్రి తలసాని చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. కొందరు స్థానిక నేతలు గూడుపుఠాణి చేసి ఇళ్లు అమ్ముకున్నారంటూ మంత్రి పేర్కొనడం పట్ల అధికార పార్టీ నేతలతో పాటు లబ్ధిదారులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మారేడుపల్లిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. తమను మంత్రి స్థానికేతరులుగా పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండించారు. రెండు రోజులుగా నిరసనలు చేపట్టిన ఆందోళనకారులు శనివారం మరింత తీవ్రం చేశారు. సుమారు 100 మంది లబ్ధిదారులు తమ ఆందోళనకు అనుమతి ఇవ్వాలంటూ పోలీసులకు దరఖాస్తు చేసుకోవడంతో ఉన్నతాధికారులు జోక్యం చేసుకున్నారు. స్పందించిన రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఒకట్రెండు రోజుల్లో బస్తీ సభ నిర్వహణ ద్వారా లబ్ధిదారులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు.

ఏడేళ్లుగా సాగుతున్న వ్యవహారం..

- మారేడుపల్లి పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న హౌజింగ్ బోర్డు స్థలంలో కొన్నేళ్ల క్రితమే ఓ బస్తీ ఏర్పడింది. 2014లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీఆర్‌ఎస్ (ప్రస్తుతం బీఆర్‌ఎస్) ప్రభుత్వం జీఓ 58 ద్వారా పేదలకు పట్టాల పంపిణీ చేపట్టింది. అందులో భాగంగానే ఓల్డ్ మారేడుపల్లి బస్తీ వాసులకూ పట్టాలు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. అయితే.. ఇరుకైన బస్తీలో మౌలిక సదుపాయాలకు ఇబ్బందులు ఎదురవుతాయని భావించిన కొందరు ఈ స్థలంలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించాలని ప్రతిపాదించారు.
- తక్కువ విస్తీర్ణంలో ఇళ్లు ఉన్న వాళ్లు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు ఒప్పుకోగా, పెద్ద ఇళ్లు ఉన్న వాళ్లు అభ్యంతరం చెప్పారు. దీంతో దివంగత స్థానిక ఎమ్మెల్యే సాయన్న, మంత్రి తలసాని జోక్యం చేసుకుని ఎక్కువ విస్తీర్ణంలో ఇళ్లు కలిగిన వారికి కుటుంబానికి రెండు లేదా మూడు చొప్పున డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఇళ్ల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఏడేళ్ల క్రితం ఇక్కడ ఉన్న ఇళ్లు కూల్చేసి, 468 డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించారు. రెండేళ్ల క్రితమే తొలి విడతలో సుమారు 250 మందికి ఇళ్లు కేటాయించారు.

ఆధిపత్య పోరుతో వాయిదా..

- స్థానిక ఎమ్మెల్యే సాయన్న, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ల మధ్య ఆధిపత్య పోరుతో మలివిడత ఇళ్ల పంపిణీ వాయిదాపడుతూ వచ్చింది. ఇటీవల సాయన్న మరణంతో వ్యవహారం పూర్తిగా తలసాని చేతుల్లోకి వెళ్లింది. దీంతో పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్ల జాబితాను పక్కన పెట్టేయాలంటూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అంతే కాకుండా మారేడుపల్లి, మడ్‌ఫోర్ట్‌లో స్థానికులకు ఈపాటికే ఇళ్లు పంపిణీ చేశామని, కొత్తగా ఎవరికీ ఇచ్చేది లేదంటూ చెప్పేశారు.
- మూడు రోజుల క్రితం సికింద్రాబాద్ ఆర్డీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. కొందరు స్థానిక నేతలు గూడుపుఠాణీ చేసి ఇళ్లు అమ్ముకున్నారంటూ ఆరోపణలు చేశారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదిత సమక్షంలోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడంతో సాయన్న అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దివంగత నేతపై అవినీతి బురద జల్లే ప్రయత్నం చేయడం ఎంతవరకు సబబు అంటూ నిలదీస్తున్నారు. మంత్రి వ్యాఖ్యలతో నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్య నందిత సైతం ఇరకాటంలో పడ్డారు.

కనువిందుగా.. పసందుగా..

- లేక్ ఫ్రంట్ పార్క్ రెడీ
- నేటి నుంచి అందుబాటులోకి
- మార్నింగ్ వాకర్స్, వేడుకలకు ప్రత్యేక అనుమతులు



సాక్షి, సిటీబ్యూరో: ఆహ్లాదానికి చిరునామాలాంటి భాగ్యనగర ప్రత్యేకతలకు మరో సరికొత్త ఆకర్షణ తోడయింది. ప్రకృతి అందాలకు నిలయమైన హుస్సేన్ సాగర్ అభిముఖంగా పచ్చని సొగసుల లేక్ ఫ్రంట్ పార్క్ కొలువుదీరింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) తీర్చిదిద్దిన ఈ పార్క్ నేటి నుంచి సందర్శకులకు అందుబాటులోకి రానుంది. దాదాపు రూ.26.65 కోట్ల వ్యయంతో రూపుదిద్దుకున్న లేక్ ఫ్రంట్ పార్క్‌ను గత మంగళవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ లాంఛనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే.

వాకర్స్ కోసం ప్రత్యేక వేళలు..

ఈ లేక్ ఫ్రంట్ పార్క్ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు సందర్శకులకు ప్రవేశానికి అనుమతిస్తారు. ఉదయం 5 నుంచి 9 గంటల వరకు వ్యాయామ అభిలాషులైన వాకర్స్ కోసం మాత్రమే ప్రత్యేకంగా కేటాయిస్తున్నారు. ఈ సదుపాయాన్ని ఉపయోగించుకుని ఆహ్లాదకరమైన పరిసరాల్లో నడక ద్వారా ఆరోగ్యాన్ని అందుకోవాలనే ఆరోగ్యాభిలాషులు నెలకు రూ.100 చొప్పున రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

వేడుకలకూ.. వేదికగా..

పరిమిత బడ్జెట్‌లో చిన్న చిన్న వ్యక్తిగత వేడుకలు నిర్వహించాలని కోరుకునే నగరవాసులకు కూడా అవకాశం కల్పిస్తున్నారు. ఈ లేక్ ఫ్రెండ్ పార్కులో వంద మందికి మించకుండా బర్త్ డే ఫంక్షన్స్, గెట్ టుగెదర్ ఫంక్షన్స్, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చు. దీనికి రూ.11 వేలు చెల్లించాల్సి ఉంటుంది. తద్వారా వేడుకలు నిర్వహించుకునే అవకాశాన్ని హెచ్‌ఎండీఏ కల్పిస్తోంది.

ఫుడ్ స్టాల్స్‌కూ చోటు..

సందర్శకుల సౌకర్యార్థం లేక్ ఫ్రంట్ పార్క్ లో ఫుడ్ స్టాల్స్‌కు కూడా చోటు కల్పించారు. కరాచీ బేకరీ అవుట్ లెట్‌తో పాటు మరికొన్ని అవుట్ లెట్స్ సందర్శకుల కోసం ఉదయం 9 నుంచి రాత్రి 11 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సైకిల్ ట్రాక్ నేడు ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డుకు చేరువలో రూ.100 కోట్లతో హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన ప్రతిష్టాత్మక సైకిల్ ట్రాక్‌ను ఆదివారం సాయంత్రం మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. దక్షిణ కొరియాలో ఉన్న సైకిల్ ట్రాక్ తరహాలో దేశంలోనే ఆ స్థాయిలో తొలి సైకిల్ ట్రాక్‌ను నగరంలో ఏర్పాటు చేయడం విశేషం. కొల్లూరు నుంచి నార్సింగి వరకూ, నార్సింగి నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకూ మొత్తం 23 కి.మీ మార్గంలో ఈ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. సైకిల్ ట్రాక్ పొడవునా సోలార్ రూఫ్ టాప్ సైతం ఏర్పాటు చేశారు. సోలార్ పలకల నుంచి ఉత్పన్నమయ్యే విద్యుత్‌ను ట్రాక్ అవసరాల కోసం వినియోగిస్తారు. ట్రాక్ పొడవునా అద్దె సైకిళ్లు, సైకిల్ రిపేరింగ్ కేంద్రాలు కూడా నెలకొల్పారు. రైడర్లు విశ్రాంతి తీసుకునేందుకు కెఫెటేరియా వంటి వసతులు కూడా అందుబాటులోకి తెచ్చారు.



ఆ మూడింట ‘ఢీ’ఆర్‌ఎస్!

- ఉప్పల్‌లో చాపకింద నీరులా ముగ్గురి నేతల మధ్య వర్గపోరు
- మల్కాజిగిరిలో కేడర్‌ను ఉత్సాహపర్చేందుకు సమ్మేళనాలు
- కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ విడివిడిగా ప్రజల వద్దకు
- బీఆర్‌ఎస్ పార్టీలో సయోధ్య కుదిరేనా?

సాక్షి, మేడ్చల్ జిల్లా: రానున్న శాసనసభ ఎన్నికలను సమర్థంగా ఎదుర్కొని విజయం సాధించాలన్న బీఆర్‌ఎస్ అధిష్టానం ఆదేశాలను మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నేతలు పాటించటం లేదని.. ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్న తీరు తేటతెల్లం చేస్తోంది. మేడ్చల్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు మినహాయించి.. మిగతా మూడింటిలో పార్టీ నేతల్లో నెలకొన్న అంతర్గత విభేదాల ప్రభావం కేడర్‌పై పడుతోంది. పైగా అసంతృప్తి నేతలను పార్టీ కోసం పని చేసేలా ప్రయత్నించటంలో కూడా విఫలమవుతున్నారన్న అపవాదును ఎదుర్కొంటున్నారు. వర్గాలుగా విడిపోయిన పార్టీ కార్యకర్తల మధ్య సమన్వయం కుదర్చడంపై కూడా శ్రద్ధ చూపటం లేదనే ఆరోపణలున్నాయి.

- ఉప్పల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ నేతలు ఎవరికి వారే అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. ఉప్పల్ బీఆర్‌ఎస్‌లో మొదటి నుంచీ మూడు వర్గాలు చాపకింద నీరులా కొనసాగుతూ.. వస్తున్నాయి. బండారి లక్ష్మారెడ్డికి టికెట్ ఖరారు అవుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, నగర మాజీ మేయరు బొంతు రామ్మోహన్ ఐక్యతగా ఉన్నట్లు ప్రదర్శించినా... షరా మామూలే అన్నట్లుగా ఇద్దరి మధ్య అంతర్గత వైరుధ్యం అలాగే ఉన్నట్లు తెలుస్తోంది. ఉప్పల్ అభ్యర్థిగా బండారి లక్ష్మారెడిని అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో ఈ నేతల మధ్య చాపకింద నీరులా ఉన్న వర్గ భేదాలు మరింత ముదిరాయి. బండారి లక్ష్మారెడ్డి కేడర్‌తో సమావేశాలు, సామాజిక వర్గాలతో ఆత్మీయ సమ్మేళనాలకు పరిమితవుతుండగా, ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి మాత్రం ఒంటరిగానే నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల పేరుతో పర్యటనలు నిర్వహిస్తున్నారు. మరో నేత బొంతు మాత్రం స్తబ్దతతో మౌనంగా కార్యకలాపాలను సాగిస్తున్నారు.
- కుత్బుల్లాపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్‌కు టికెట్ ఖరారు కావటంతో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అసంతృప్తితో ఉన్నారు. అనుచరులతో కలిసి ఆత్మీయ సమావేశాల పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే వివేకానందగౌడ్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో బిజీగా ఉంటున్నారు. ఇద్దరు నేతలు ఎవరికి వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో.. ద్వితీయ శ్రేణి నాయకులు, కేడర్ అయోమయానికి గురవుతున్నారు. వీరు వేర్వేరుగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో కేడర్ పూర్తి స్థాయిలో భాగస్వామ్యాన్ని పంచుకొనలేకపోతున్నారు.

మల్కాజిగిరిలో మచ్చిక చేసుకునేందుకు..

ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బీఆర్‌ఎస్ పార్టీని వీడటంతో.. మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి టికెట్‌ను అధిష్టానం ఖరారు చేసింది. ఈయన ప్రస్తుతం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తుండటంతో.. ఇక్కడి కేడర్, పలువురు నాయకులతో సత్సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే మామ మంత్రి మల్లారెడ్డితో కలిసి మల్కాజిగిరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మొదటిసారి మర్రి రాజశేఖర్‌రెడ్డి ర్యాలీ పేరుతో బల ప్రదర్శన నిర్వహించారు. నైరాశ్యంలో ఉన్న బీఆర్‌ఎస్ ద్వితీయ శ్రేణి నాయకులు, కేడర్‌ను మచ్చిక చేసుకునేందుకు ప్రాంతాల వారీగా రాజశేఖర్‌రెడ్డి సమావేశాలు నిర్వహిస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో బాలుడి కిడ్నాప్

- బెగ్గింగ్ మాఫియా సభ్యులుగా గుర్తింపు
- ఇద్దరు నిందితుల అరెస్టు
- గాంధీ ఆసుపత్రికి బాలుడి తరలింపు


బాలుడు శివసాయి


సీసీ కెమెరాకు చిక్కిన కిడ్నాపర్లు విక్రం, రెహానా

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో బాలుడి కిడ్నాప్ వ్యవహారం రైల్వేపోలీసులను ఉరుకులు పరుగులు పెట్టించింది. భిక్షాటన చేస్తున్న ఓ జంట బాలుడిని కిడ్నాప్ చేసినట్లు గుర్తించిన రైల్వే పోలీసులు శనివారం మధ్యాహ్నం నిందితులను అరెస్ట్ చేశారు. తీవ్ర అస్వస్థతకు గురైన బాలుడిని కిడ్నాపర్ల బారి నుంచి సంరక్షించి చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే.. మెదక్ జిల్లా, కొడిపల్లి మండలం, రాయలపురం గ్రామానికి చెందిన ఎం.దుర్గేశ్ బధిరుడైన తన కుమారుడు శివసాయి(5)తో తిరుమల దర్శనం కోసం వెళ్లి శుక్రవారం తిరిగి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. సాయంత్రం 5గంటల ప్రాంతంలో 1వ నెంబర్ ప్లాట్‌ఫామ్ వద్ద కుమారుడు శివసాయిని తన లగేజీ బ్యాగ్ వద్ద కూర్చోబెట్టి వాష్‌రూంకు వెళ్లివచ్చేసరికి శివసాయి కనిపించలేదు. ప్లాట్‌ఫామ్‌పై గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో అతను జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా.....

దుర్గేశ్ ఫిర్యాదుతో అప్రమత్తమైన జీఆర్‌పీ పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా గుర్తు తెలియని జంట శివసాయిని కిడ్నాప్ చేసినట్లు గుర్తించారు. రైల్వేస్టేషన్ పరిసరాల్లో వాకబు చేయగా వారు ఇరువురు బెగ్గింగ్ మాఫియాలో సహాయకులుగా పనిచేస్తున్న విక్రం, రెహానాగా గుర్తించారు. శివసాయితోపాటు కిడ్నాపర్లు వెంట తీసుకెళ్లిన బ్యాగ్‌లో దుర్గేశ్ సెల్‌ఫోన్ ఉండటంతో సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా నిందితుల కదలికలను గుర్తించిన పోలీసులు వారు బాలుడిని మాదాపూర్ ప్రాంతానికి తీసుకెళ్లినట్లు గుర్తించారు. విక్రం బ్యాగులోని సెల్‌ఫోన్‌ను విక్రయించేందుకు యత్నించగా అది చోరీ చేసిన సెల్‌ఫోన్‌గా భావించిన ఆటో డ్రైవర్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని మాదాపూర్ పోలీసులకు అందించాడు. మాదాపూర్ పోలీసుల సహకారంతో జీఆర్‌పీ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

చిన్నారుల అపహరణే లక్ష్యంగా....

మహారాష్ట్రకు చెందిన విక్రం భార్యాపిల్లలతో నగరానికి వచ్చి బషీర్‌బాగ్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. హోటల్ వర్కర్‌గా పని చేయడంతోపాటు నేరాలకు పాల్పడేవాడు. అతడికి రెహానా అనే యాచకురాలితో పరిచయం ఏర్పడటంతో సహజీవనం చేస్తున్నారు. వీరు మాదాపూర్ ప్రాంతంలో నివాసం ఉంటూ బెగ్గింగ్ మాఫియాకు కిడ్నాప్ చేసిన పిల్లలను అందిస్తూ డబ్బు సంపాదిస్తున్నట్లు పోలీసు విచారణ వెల్లడైంది. మాదాపూర్ వంతెన సమీపంలో తీవ్ర అస్వస్థతకు గురైన శివసాయిని గుర్తించిన పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు నిందితులను వేర్వేరు ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు.

కొనసాగుతున్న దర్యాప్తు...

నిందితులను అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణ చేపట్టారు. బాలుడి కిడ్నాప్ వెనుక ఉన్న మాఫియా గుట్టును రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. బాలుడు ప్లాట్‌ఫామ్ మీద ఒంటరిగా ఉన్నందున కిడ్నాప్ చేశారా లేక మూగ చెవిటి బాలుడిగా గుర్తించిన అనంతరం రెక్కీ నిర్వహించి కిడ్నాప్ చేశారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఒంటరిగా ఉన్న బాలుడు ఆకలితో ఏడుస్తున్నందున తాము వెంట తీసుకెళ్లామని, ఉద్దేశపూర్వకంగా కిడ్నాప్ చేయలేదని నిందితులు బుకాయిస్తున్నట్లు సమాచారం.

సముద్ర మార్గంలో గంజాయి సరఫరా!

- హైదరాబాద్ మీదుగా ఒడిశా నుంచి తమిళనాడుకు
- ఆపై తీర ప్రాంతాల నుంచి శ్రీలంకకు రవాణా
- కొబ్బరిపీచు లారీలో తరలింపు
- ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు
- 250 కిలోల గంజాయి పట్టివేత
- పరారీలో ప్రధాన సూత్రధారి రాజేష్

సాక్షి, సిటీబ్యూరో: కొకైన్, ఎండీఎంఏ వంటి ఖరీదైన డ్రగ్స్ మాత్రమే కాదు గంజాయి కూడా సముద్ర మార్గంలో సరఫరా చేస్తున్నారు. హైదరాబాద్ మీదుగా ఒడిశా నుంచి మహారాష్ట్ర, తమిళనాడు తదితర సముద్రతీర రాష్ట్రాలకు లారీలో తరలించి.. ఆపై అక్కడి నుంచి శ్రీలంకకు చేరవేస్తున్నారు. ఈ ఘరానా ముఠాలో ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను రాచకొండ పోలీసులు అదుపులోకి తీసుకుని 250 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) డీసీపీ కే మురళీధర్‌తో కలిసి ఎస్ఓటీ కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ శనివారం మీడియాకు వెల్లడించారు.

- తమిళనాడుకు చెందిన మల్యాలి స్వామి అలియాస్ శివ కొన్నేళ్ల క్రితం కుటుంబంతో సహా హైదరాబాద్‌కు వలస వచ్చి చాంద్రాయణగుట్టలో ఉంటూ స్థానికంగా స్నాక్స్ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగు నెలల క్రితం తమిళనాడు నుంచి వలస వచ్చిన రామర్‌కు స్వామితో అతడికి పరిచయం ఏర్పడింది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఇద్దరు కలిసి అక్రమంగా గంజాయి రవాణా చేసి సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు.
- ఇదిలా ఉండగా స్వామి మేనమామ తమిళనాడుకు చెందిన రాజా స్టాలిన్ గతంలో గంజాయి కేసులో అరెస్టు అయ్యాడు. అతడికి బెయిల్ ఇప్పించే క్రమంలో స్వామికి ఇదే కేసులో అరెస్టైన కేరళకు చెందిన గంజాయి విక్రయదారుడు రాజేష్‌తో పరిచయం ఏర్పడింది.



- బయటికి వచ్చాక తన వద్ద గంజాయి సరఫరా చేసే వాహన డ్రైవర్‌గా పని చేస్తే డబ్బులు ఇస్తానని స్వామికి రాజేశ్ ఆశ చూపించాడు. ఒడిశా నుంచి హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తే ట్రిప్‌కు రూ.1.50 లక్షలు ఇస్తానని చెప్పాడు. ఈ క్రమంలో స్వామి గతంలో 500 కిలోల గంజాయిని విజయవంతంగా డెలివరీ చేశాడు. రాజేశ్ ఈ సరుకును చిన్న ప్యాకెట్లుగా చేసి తన ఏజెంట్ల ద్వారా హైదరాబాద్, మహారాష్ట్ర, తమిళనాడు, శ్రీలంకలోని కస్టమర్లకు విక్రయించి, సొమ్ము చేసుకునేవాడు.

ఈనెల 29న రాజేశ్ సూచనల మేరకు ఒడిశాకు వెళ్లిన స్వామి గంజాయి విక్రయదారుడు చంద్రశేఖర్‌ను సంప్రదించాడు. 250 కిలోల గంజాయిని కొనుగోలు చేసి కొబ్బరిపీచు తరలించే లారీ (టీఎన్09 ఏపీ 3217)లో దాచి హైదరాబాద్ మీదుగా బయలుదేరాడు. దీనిపై సమాచారం అందడంతో మహేశ్వరం జోన్ ఎస్ఓటీ, మీర్‌పేట పోలీసులు టీకేఆర్ కమాన్ క్రాస్ రోడ్ వద్ద లారీని పట్టుకున్నారు. ఇద్దరు నిందితులు స్వామి, రామర్‌లను అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి రూ.75 లక్షలు విలువ చేసే గంజాయి, లారీ, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. రాజేశ్, చంద్రశేఖర్ పరారీలో ఉన్నారు.

కస్టమర్లపైనా కూడా కేసులు..

మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపుతున్నాం. విక్రయ, సరఫరాదారులపైనే కాకుండా వినియోగదారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాదిలో ఇప్పటివరకు వందకు పైగా డ్రగ్స్ కస్టమర్లపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేశాం. ఈ నెలలో ఇప్పటివరకు 17 మంది వినియోగదారులపై సీఆర్‌పీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచాం.

చీటింగ్ కేసులో నలుగురికి జైలు

సాక్షి, సిటీబ్యూరో: విల్లాలు నిర్మిస్తున్నట్లు మాయమాటలు చెప్పి డబ్బు వసూలు చేసిన నలుగురు నిందితులకు న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే.. చిలకలగూడకు చెందిన సదాశివుని లలిత, సీతాఫల్‌మండికి చెందిన సదాశివుని సాయి రామకృష్ణ శ్రీవాస్తవ్, రంగారెడ్డి జిల్లా ఫెండ్స్ కాలనీకి చెందిన తాళ్ల రాకేష్ కుమార్, బర్కత్‌పురకు చెందిన ఖడ్కికర్ శ్రీనివాస్, ఉప్పల్‌కు చెందిన చైతన్య, సునీల్ కొన్నేళ్ల క్రితం కుత్బుల్లాపూర్‌కు చెందిన ఎక్సైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ గ్రూప్ ఏజెన్సీ మేనేజర్ వై పద్మజ, హైదర్‌గూడకు చెందిన నైనా జైన్‌లను సంప్రదించారు.

- రాకేష్, చైతన్య, సునీల్‌లు మేడ్చల్‌లో విల్లాలు నిర్మిస్తున్నారని, కొంత నగదు తక్కువ పడిందని సమకూర్చాలని కోరారు. ఈ మేరకు రూ.2 కోట్ల నిధులు కావాలని సూచించారు. ఆరు నెలల్లో ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని లలిత, రామకృష్ణ హామీ ఇచ్చారు. విల్లాల నిర్మాణం పూర్తయిన తర్వాత అసలుతో సహా 10 శాతం కంటే ఎక్కువ వడ్డీ చెల్లిస్తామన్నారు. లలిత, రామకృష్ణ హామీదారులుగా పేర్కొంటూ ప్రామిసరీ నోటు రాశారు. భౌతికంగా ప్రాజెక్ట్ దగ్గరికి తీసుకెళ్లకుండానే ఫిర్యాది దారుల నుంచి రూ.84.25 లక్షలు వసూలు చేశారు. అనంతరం నిర్మాణ పనులు చేయకుండా వదిలేశారు.
- దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ మేరకు కేసును విచారించిన 12వ ఏసీఎంఎం జడ్జి వీ ఈశ్వరయ్య శనివారం నిందితులు ఎస్ లలిత, ఎస్ సాయి రామకృష్ణ శ్రీవాస్తవ్‌లకు నాలుగు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.15 వేల చొప్పున జరిమానా, టీ రాకేష్ కుమార్, కే శ్రీనివాస్‌లకు రెండేళ్ల జైలు, రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఎస్‌బీఐ 12వ వెల్త్ హబ్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయం వేదికగా వెల్త్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన 'బ్యాంక్ వెల్త్ హబ్'ను సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ మాట్లాడుతూ..నగరంలో 12వ వెల్త్ హబ్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. 102 కేంద్రాల్లో 232 వెల్త్ హబ్‌లతో తమ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముంబై కార్పొరేట్ కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్ సుఖ్‌వీందర్ కౌర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



ఘనంగా హిందీ దినోత్సవం

సాక్షి, సిటీబ్యూరో: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని ప్రాంతీయ కార్యాలయం వేదికగా హిందీ దినోత్సవం, హిందీ పక్షం రోజుల ముగింపు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. హిందీ పఖ్వాడా సందర్భంగా కార్యాలయ సిబ్బందికి డ్రాఫ్టింగ్, క్విజ్, అంత్యాక్షరి తదితర పోటీలను నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న వారందరినీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రదీప్ సి జవల్‌కోటే అభినందించి అవార్డులను అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్‌లు మేనేజర్ రోహిత్ గార్గ్, కిరణ్ కుమార్, మేనేజర్ మహేష్ కుమార్, ఏజీ-2 మధు యాదవ్, ఏజీ-3 సుమన్ రామ్ పాల్గొన్నారు.



క్లుప్తంగా...

ఆ యువకులు ఆదర్శం



పంజగుట్ట: ఇద్దరు ముస్లిం యువకులు, మరికొంత మందితో కలిసి మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి చేసి 11 రోజులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి విగ్రహం ఏర్పాటు చేసిన చోటే బస్తీవాసుల సమక్షంలో అక్కడే ఓ కొలను ఏర్పాటు చేసి నిమజ్జనం చేసి కొత్త ఒరవడి సృష్టించారు. సదరు ఫ్రెండ్‌షిప్ ఫెడరేషన్ సభ్యులను శనివారం పంజగుట్ట ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ మోహన్ కుమార్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మోహన్ కుమార్ మాట్లాడుతూ .. కులమతాలకు అతీతంగా పండగ నిర్వహించుకున్న ఎస్.కె.ఒమర్, శ్రీనివాస్, మహేష్ రెడ్డి, అల్తాఫ్, అర్జున్ కుమార్ నేటితరం యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో మధురానగర్, పంజగుట్ట ఇన్‌స్పెక్టర్లు బి.శ్రీనివాస్, దుర్గారావు పాల్గొన్నారు.

సైఫాబాద్ సైన్స్ కాలేజీలో అంతర్జాతీయ సదస్సు

బంజారాహిల్స్: ఉస్మానియా విశ్వ విద్యాలయానికి అనుబంధ కాలేజీ అయిన సైఫాబాద్ పీజీ కాలేజీలో శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానంలో ఇటీవల ఆవిష్కరణలు అనే అంశంపై శనివారం ఒక రోజు అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ స్టేట్ కౌన్సిల్ వైస్ చైర్మన్ మహమూద్ ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సదస్సు నిర్వహించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ ఇది విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో జరుగుతున్న అభివృద్ధి గురించి అవగాహన కలిగిస్తుందని అన్నారు. భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచ దేశాలకు దీటుగా ముందడుగు వేస్తున్న సమయంలో ఈ సదస్సు నిర్వహించడం గర్వకారణంగా ఉందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. లక్ష్మణ్ నాయక్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్, డాక్టర్ నవనీత, ఎస్. వెంకటరమణ మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగంవైపు విద్యార్థులు అడుగులు వేసే విధంగా ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. సదస్సుకు వక్తలుగా అమెరికా నుంచి వచ్చిన ప్రొఫెసర్ విజయ రంగారి సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ జె. కోటేష్ కుమార్, ప్రొఫెసర్ బుర్రా ప్రసాద్, నాగబాబు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

బంజారాహిల్స్: ఓ యువకుడు అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డి వివరాల ప్రకారం..జూబ్లీహిల్స్ రోడ్ నెం. 46లోని అంబేడ్కర్ కాలనీలో నివసించే కె. రాజశేఖర్(24) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 13న డ్యూటీకి వెళ్లిన రాజశేఖర్ ఎంతకీ రాకపోవడంతో సోదరుడు శివరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మైనర్ బాలికపై లైంగికదాడి

ఇద్దరిపై పోక్సో, పీడీపీ కేసు

రహమత్‌నగర్: అభంశుభం తెలియని ఓ మైనర్ బాలికపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్ మిడ్ ల్యాండ్ బేకరి ప్రాంతంలో గిరిజన కుటుంబం నివాసముంటుంది. వారికి ఓ మైనర్ బాలిక ఉంది. ఇంటి యాజమాని కుమారుడు కావల్‌జిత్ సింగ్ అస్తాని(18) అతడి స్నేహితుడు సత్పల్ సింగ్ (19) సదరు మైనర్ బాలికను బెదిరించి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డారు. శనివారం బాలిక కడుపు నొప్పి వస్తుందని తల్లిదండ్రులకు చెప్పడంలో అనుమానం వచ్చి గట్టిగా నిలదీయగా అసలు విషయం చెప్పింది. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిపై పోక్సో, పీడీపీ యాక్టు నమోదు చేశారు.

మైనారిటీల సంక్షేమమే ధ్యేయం



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాగంటి

రహమత్‌నగర్: ముస్లిం మైనారిటీ సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ. 10 వేల చెక్కులను శనివారం ఆయన అందజేసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటు పడుతుందన్నారు. మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు ఇప్పటికే అందించడం జరిగిందని అర్హులైన అందరికి డబుల్ బెడ్రూమ్‌లు కేటాయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి రాజ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు కృష్ణమోహన్, అఫ్సూఖాన్, నజీర్, విజయ సింహ, విజయ్‌కుమార్, ఫయాజ్, గఫూర్, సర్దార్, సిరాజ్, జబ్బార్‌ఖాన్ పాల్గొన్నారు.

నాలా పనులు.. ఇంకెన్నాళ్లో ?

- చింతల్‌బస్తీ-ఆనంద్‌నగర్ కాలనీ మధ్య నిలిచిపోయిన రాకపోకలు
- దుర్గంధం, దుర్వాసనలతో సతమతమవుతున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు



చింతల్ బస్తీలో నిలిచిపోయిన నాలా శ్లాబ్ పనులు

బంజారాహిల్స్: దశాబ్దాలుగా ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్న వరదనీటి సమస్యకు పరిష్కారం చూపించే దిశలో ప్రారంభమైన నాలా వెడల్పు, శ్లాబ్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండగా స్థానికులకు నరకయాతన తప్పడం లేదు. ప్రేమ్ నగర్, ఆనంద్‌నగర్, చింతల్ బస్తీ నివాసితులకు వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు జూన్ 5న రూ.75 లక్షల వ్యయంతో నాలా విస్తరణతో పాటు శ్లాబ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో నాలా ఇరుకుగా ఉండటంతో వరద నీరు వెనక్కి వచ్చి ఇళ్లను ముంచెత్తేది. ప్రేమ్‌నగర్, చింతల్‌బస్తీ, ఆనంద్‌నగర్ కాలనీ, తదితర ప్రాంతాలవాసుల రాకపోకలకు ఇబ్బంది కలగడమే కాకుండా నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు.

ప్రారంభంలోనే అడ్డంకులు,,

పది మీటర్ల వెడల్పుతో 4.5 మీటర్ల రంధ్రాలతో ఇక్కడ నాలా నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ప్రారంభంలోనే ఎలక్ట్రిక్ కేబుల్స్ అడ్డంకులు సృష్టించాయి. వీటిని తొలగించడానికి మూడు నెలల సమయం పట్టింది. సరిగ్గా ఈ పనులు పూర్తయి నాలా పనులు మొదలు పెట్టాలని అనుకునే లోపే వరదలు మొదలయ్యాయి. ఫలితంగా పనులు మళ్లీ మొదటికొచ్చాయి. నత్తనడకన పనులు సాగుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీహెచ్ఎంసీ ఇంజనీర్లపై ఒత్తిడి కూడా పెరుగుతోంది. 25 మీటర్ల పొడవులో నిర్మాణంలో ఉన్న నాలా విస్తరణ ఎంతకూ ముందుకు సాగకపోతుండటంతో ఇటీవల కురిసిన వర్షాలకు వరద, మురుగు కలిసి నివాసితులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ర్యాఫ్ట్ ఫౌండేషన్, ఆర్‌సీసీ రీటైనింగ్ వాల్, శ్లాబ్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని పలుమార్లు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఆదేశించినా పనుల్లో కదలిక కరువైంది. దీనికి తోడు వారం క్రితం వరదల్లో ఒక మొసలి కొట్టుకురావడంతో స్థానికులు మరింత భయభ్రాంతులకు గురయ్యారు. శ్లాబ్ నిర్మాణం పూర్తయి ఉంటే ఈ మొసలి నాలాలో నుంచే హుస్సేన్‌సాగర్‌లోకి కొట్టుకుపోయేదని స్థానికులు అంటున్నారు.

పనుల్లో కదలిక లేదు



నెలల తరబడి నాలా విస్తరణ పనులు సాగుతున్నాయి. ఓ వైపు వరద, మరో వైపు మురుగు ఇక్కడ ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. ఇప్పటి వరకు 30 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. ఇంకా ఎన్ని రోజులు సాగుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులకు తరచూ మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. –నవీన్ జైన్

చుట్టూ తిరిగి పోవాల్సి వస్తోంది..



చింతల్‌బస్తీ–ఆనంద్‌నగర్ మధ్య ఈ నాలా ఓ వారధిలా ఉండేది. దీన్ని ఇప్పుడు తవ్వేసి నెలలు గడుస్తుండటంతో మేం చుట్టూ తిరిగి నివాసాలకు వెళ్లాల్సి వస్తోంది. పనులు ఎందుకు ముందుకు సాగడం లేదో అర్థం కావడం లేదు.దుర్గంధం, దుర్వాసనలతో నరకాన్ని చూస్తున్నాం. ఇటీవలనే ఓ మొసలి కొట్టుకురావడంతో భయం మరింత పెరిగింది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఇంజనీర్లు పనుల్లో వేగం పెంచాలి. –రవిబాబు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దానం



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

వెంకటేశ్వరకాలనీ: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని ఏ ఒక్కరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. పలువురికి మంజూరైన షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను శనివారం ఆయన వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధి జహీరానగర్ చౌరస్తాలో లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాల విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కేసీఆర్ ప్రవేశ పెడుతున్న ప్రతి సంక్షేమ పథకం నిరంతర ప్రక్రియ అని విడతల వారీగా లబ్ధిదారులకు అందజేస్తారన్నారు.

ఎమ్మెల్యేకు లడ్డూ అందజేత..

బంజారాహిల్స్: ఇందిరానగర్–శ్రీకృష్ణానగర్ షాప్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గణేష్ లడ్డూను వేలం పాటలో దక్కించుకున్న దుర్గా భవానీనగర్ బస్తీవాసి మాను నాయక్ శనివారం ప్రసాదాన్ని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు అందజేశారు.

మౌలిక సదుపాయల కల్పనే లక్ష్యం..

హిమాయత్‌నగర్: ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. శనివారం హైదర్‌గూడలోని సెయింట్ పాల్స్ స్కూల్ లైన్‌లో రూ.17 లక్షల వ్యయంతో మంచి నీటి నిర్మాణ పనులకు ఆయన కార్పొరేటర్ మహాలక్ష్మిరామన్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం పర్దాగేట్‌లో 39 మందికి షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి దశల వారీగా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఎంత పింఛన్ ఇచ్చారో ప్రజలందరికీ తెలుసన్నారు. షేర్ ఘాట్, పర్దాగేట్ ప్రాంతాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు రూ. 78లక్షలు, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరణ చేసేందుకు మరిన్ని నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం రామకృష్ణ, డీజీఎం సన్యాసిరావు, నాంపల్లి తహశీల్దార్ ప్రేమ్‌కుమార్, నాయకులు రామన్‌గౌడ్, నర్సింగ్ గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు యాదగిరి, అశోక్‌కుమార్, డి.రాజేందర్, శ్రీనాథ్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో త్వరలో 670 ఉద్యోగాల భర్తీ



ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

వెంగళరావునగర్: బీజేపీ పాలిత ప్రాంతాల్లో 5 గంటల విద్యుత్‌ను ప్రజలకు అందిస్తుంటే తెలంగాణలో మాత్రం 24 గంటలు సరఫరా చేస్తున్నామని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. విద్యుత్‌శాఖలో జూనియర్ లైన్‌మెన్లుగా ఉద్యోగాలు పొందిన వారికి శనివారం రాత్రి వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీటీఎస్ కాలనీ జెన్‌కో ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ విదేశాలకు చెందిన బడా పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు నెలకొల్పడానికి నేరుగా హైదరాబాద్ నగరానికి వస్తున్నారంటే.. వారికి ఇక్కడ కావాల్సిన విద్యుత్ దొరుకుతోందనే నమ్ముతున్నారన్నారు. ఈ ఘనత సీఎం కేసీఆర్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్మాణానికి ఎన్నిసార్లు వినతిపత్రాలు అందించినా కేంద్రం ఎంటయూ ఇవ్వడం లేదని ఆరోపించారు. గత తొమ్మిదిన్నర ఏళ్లలో 35,774 మందికి విద్యుత్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. త్వరలోనే మరో 670 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, టీఎస్ ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, డైరెక్టర్ జి.పర్వతం తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ అక్రమ కేసులకు భయపడేది లేదు'

లిబర్టీ: బీజేపీ సీబీఐతో ఎన్ని అక్రమ కేసులు పెట్టించినా ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సామాన్యుల ప్రయోజనాల కోసం పోరాడుతూనే ఉంటారని ఆమ్‌ఆద్మీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అధికారిక నివాసం పునరుద్ధరణలో ఆర్థిక అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బీజేపీ అధికార దుర్వినియోగంతో సీబీఐను ప్రయోగించి తప్పుడు కేసులు పెట్టడానికి ప్రయత్నిస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆధారాలు లేని చిన్న, చిన్న విషయాలపై బీజేపీ దృష్టి సారించడం కన్నా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలపై దృష్టి సారించి మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

బలహీన వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యం

పంజగుట్ట: బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారమే ధ్యేయంగా తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని రాష్ట్ర కోఆర్డినేటర్ పాండు యాదవ్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ .. రాష్ట్ర చరిత్రలో జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు ఇప్పటి వరకు ముఖ్యమంత్రి కాకపోవడం బాధాకరమని బీసీ ముఖ్యమంత్రే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామన్నారు. ఎస్సీలకు 22, ఎస్టీలకు 10, మైనార్టీలకు 4 స్థానాలు కేటాయించి తమ భా వాలతో ఏకీభవించే అగ్రకులాల వారికి కూడా సీట్లు ఇస్తామన్నారు. ఇప్పటివరకు ఎవ్వరూ ప్రకటించని విధంగా తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో శేఖర్ గౌడ్, గౌతమ్, నాగరాజు, విజయ్ కుమార్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రజాకార్ సినిమా విడుదలను ఆపాలి

7వ నిజాం మునిమనుమడు హిమాయత్ అలీ మీర్జా



బంజారాహిల్స్: రజాకార్ సినిమా విడుదలను ఆపాలని సెన్సార్ అనుమతులు ఇవ్వొద్దని నిజాం మునిమనుమడు హిమాయత్ అలీ మీర్జా డిమాండ్ చేశారు. శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని మషల్లా మంజిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సినిమాను విడుదల చేస్తే సదరు చిత్ర నిర్మాతపై రూ10 కోట్ల పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు సెన్సార్ బోర్డు చైర్మన్‌కు, ప్రధాని నరేంద్రమోదీకి కూడా తాను లేఖ రాసినట్లు తెలిపారు. ఈ సినిమాకు సెన్సార్ హక్కులు కల్పించవద్దని కోరారు. ఇటీవల సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేయడం జరిగిందని ఆయన ఆరోపించారు. కొన్ని రాజకీయ పార్టీలు తమ రాజకీయ పబ్బం గడుపుకునేందుకు, మత విద్వేశాలు రెచ్చగొట్టేందుకు సమాజాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ఈ సినిమాను రూపొందించాయని ఆరోపించారు. ఈ సినిమా ప్రదర్శనను నిషేధించాలని లేని పక్షంలో తీవ్ర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

లోన్ యాప్ వేధింపులకు యువకుడు బలి



విజయ్ (ఫైల్)

రహమత్‌నగర్: లోన్ యాప్ వేధింపులకు ఓ యువకుడు బలైన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవి కుమార్ వివరాల ప్రకారం.. బ్రహ్మశంకర్‌నగర్ ఫేజ్–2 బస్తీకి చెందిన దండుగుల విజయ్ (22) శంషాబాద్ విమానాశ్రయంలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన అవసరాల కోసం వివధ లోన్‌యాప్‌ద్వారా కొంత డబ్బులు తీసుకున్నాడు. గడువు కాకముందే తిరిగి చెల్లించాలని వేధింపులు ప్రారంభించారు. అంతటితో ఆగకుండా విజయ్ ఫొటోలు మార్ఫింగ్ చేసి ఇతర మాధ్యమాల్లో పోస్టు చేస్తామని బెదిరిస్తుండంతో భయాందోళనకు గురైన విజయ్ శుక్రవారం తన ఇంట్లో రెండు సిరప్‌లు కలిపి తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పంజగుట్ట: దళితుల్లో అత్యంత వెనకబడిన ఎస్సీ 57 ఉపకులాల ఆత్మగౌరవ సభ అక్టోబర్ 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు భైరి వెంకటేశం మోచి తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. తమ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 4వ తేదీన తాడ్‌బండ్ హనుమాన్ చౌరస్తాలోని ధోబీఘాట్ గ్రౌండ్స్‌లో వేలాదిమందితో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దళితుల్లో మాల, మాదిగలు కాకుండా మిగిలిన 57 ఉపకులాల వారు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో సభకు హాజరవుతారన్నారు. ఇప్పటికీ దళిత ఉపకులాల్లో ఎంతో మంది కూడు, గుడ్డ, ఉండేందుకు నీడ లేనివారు ఉన్నారని తెలంగాణలో 22 లక్షల మంది దళితులు ఉంటే అందులో 34 శాతం ఉపకులాల వారు ఉన్నారన్నారు. ఆత్మగౌరవ సభకు ముఖ్య అతిథులుగా అంబేడ్కర్ మనవడు ప్రకాష్ అంబేడ్కర్, కుమురం భీమ్ మనవడు కుమురం సోనేరావు భీమ్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ గిరిజన పరిశోధకులు కత్తి మల్లయ్య, టీఎస్ స్వామి, అయ్యాల్వార్, తులసిదాస్, చంద్రగిరి సత్యనారాయణ పాల్గొన్నారు.

చదువుతో పాటు జ్ఞానం పెంపొందించుకోవాలి



ఫౌండేషన్ ప్రతినిధులు, పిల్లలతో రవిగుప్తా

పంజగుట్ట: పిల్లలు చదువుతో పాటు జ్ఞానం పెంపొందించుకోవాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రవి గుప్తా అన్నారు. శనివారం ఎర్రమంజిల్‌లోని రవీంద్ర నికేతన్ పాఠశాలలో బిల్డ్ ఎ బెటర్ ఫ్యూచర్ ఫౌండేషన్ (బీబీఎఫ్) ఆధ్వర్యంలో పాఠశాలలో చిన్నపిల్లలకోసం ఏర్పాటు చేసిన కిండర్ గార్డెన్ ల్యాబ్, మాంటిసోరి ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 150 స్టోరీ బుక్స్ అందుబాటులోకి తెచ్చారు. బీబీఎఫ్ కో ఫౌండర్ అంజలీ గుప్తా మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ముఖ్యంగా విద్యా, వ్యవసాయం, వేస్ట్ మేనేజిమెంట్‌పై పని చేస్తుందన్నారు. ఫౌండేషన్ సొంత నిధులతో ఈ పాఠశాలలో కిండర్ గార్డెన్ ఏర్పాటు చేశామన్నారు. రవీంద్రనికేతన్ పాఠశాలలో మొత్తం నిరుపేదలు, వెనకబడిన వారు చదువుకుంటారని వారికి ఎంతో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని అదుకే పాఠశాలకు ఏదైనా చెయ్యాలని ఈ పాఠశాలను ఎంచుకున్నామన్నారు. త్వరలోనే బేగంపేటలో ఒక పాఠశాల, భువనగిరిలో మరో పాఠశాలకు కూడా తాము సాయం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, కరెస్పాండెట్ కరుణా, బీబీఎఫ్ కో ఫౌండర్ మైత్రేయి మహాపాత్ర, అంకూర్ గుప్తా, సౌమ్య, రంజన్ పాల్గొన్నారు.

ఆశ్రయం పొందుతున్న చిన్నారులను కన్నబిడ్డల్లా చూసుకోవాలి

న్యాయమూర్తి ప్రేమవతి



ఆధార్‌కార్డులు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి ప్రేమవతి

వెంగళరావునగర్: శిశువిహార్‌లో ఆశ్రయం పొందుతున్న చిన్నారులందరినీ కన్నబిడ్డల్లా చూసుకుంటూ వారిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మెట్రో పాలిటన్ సెషన్స్ మేజిస్ట్రేట్ ఎస్.ప్రేమవతి పేర్కొన్నారు. వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లోని మహిళా శిశుసంక్షేమశాఖ ప్రాంగణంలో ఉన్న శిశువిహార్‌ను శనివారం ఆమె సందర్శించి చిన్నారుల ఆలనాపాలనా, పరిశుభ్రత, వైద్యం తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. స్థానికంగా విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది చిన్నారులను ఎంతో ప్రేమగా చూస్తున్నారని ఇది ఎంతో ఆనందాన్నిస్తుందన్నారు. తాము ఉద్యోగాలు చేస్తున్నామని భావనతో కాకుండా తమ పిల్లల్లాగానే కాపాడుతూ వీరిని సంరక్షించడం అభినందనీయమన్నారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల తీసుకుంటున్న చర్యలు చాలా బాగున్నాయని, భవిష్యత్‌లో కూడా ఇదే విధంగా కొనసాగాలన్నారు. తొలుత చిన్నారులకు ఆధార్‌కార్డులు, అంగవైకల్యం ఉన్న వారికి సదరన్ కార్డులు, ఆయాలకు చీరలు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెట్రో పాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాధికా జైస్వాల్, జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, సదరన్ ఇన్‌చార్జి, ఎమ్మార్వో రాములు, శిశువిహార్ ఇన్‌చార్జి అధికారులు సంతోషిబాయి, శాంతిప్రియ, మెడికల్ అధికారులు క్రాంతి, సంధ్యారాణి, బీఆర్‌బీ కో ఆర్డినేటర్ సుమలత సిబ్బంది పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న దుర్గారావు

పంజగుట్ట: విద్యార్థులు, యువకులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పంజగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావు అన్నారు. అమీర్‌పేటలోని రుక్మిని కాలేజీలో శనివారం నిర్వహించిన యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్‌కు బానిసైతే ఆరోగ్యం పాడవ్వడమే కాకుండా కుటుంబ సభ్యులతో ప్రేమానుబంధాలు తగ్గిపోతాయన్నారు. డ్రగ్స్ తీసుకుంటే జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని, ఏమీ నేర్చుకోలేని స్థితికి వెళ్లడమే కాకుండా ఆలోచనలు మన అదుపులో ఉండవన్నారు. మీ స్నేహితుల ప్రవర్తనలో ఎవరిలోనైనా మార్పులు కనిపిస్తే డబ్బుల కోసం వెతుక్కోవడం, ఇష్టాల్లో మార్పులు రావడం, బాగా నిద్రపోవడం, లేదా నిద్ర అస్సలు పోకుండా ఉండడం, హఠాత్తుగా బరువు పెరగడం, ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వారిని వైద్యులను సంప్రదించాలని వారి కుటుంబ సభ్యులకు చెప్పాలన్నారు.

మిలాద్-ఉన్ నబీ ఊరేగింపు ప్రశాంతంగా జరుపుకోవాలి



బంజారాహిల్స్: ముస్లిం సోదరులు ఆనందంగా నిర్వహించుకునే మిలాద్–ఉన్ నబీ ఊరేగింపు ఆదివారం జరగనున్న ఏర్పాట్లను శనివారం బంజారాహిల్స్ ఏసీపీ సుబ్బయ్య అడిగి తెలుసుకున్నారు. ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించి ఊరేగింపు జరిగే ప్రాంతంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఊరేగింపు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో సీఐ నరేందర్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఫిలింనగర్‌లో..

ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించే మిలాద్–ఉన్ నబీ ఏర్పాట్లను సీఐ రామకృష్ణ సమీక్షించారు. శనివారం ఆయా ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులు పరిశీలించారు. ఓయూ కాలనీ వినాయక నగర్‌లో జరిగే ఉర్సు ఉత్సవాలను ఘనంగా జరుపుకునేలా బందోబస్తు ఏర్పాటు చేశారు. మిలాద్ ఊరేగింపు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.



స్టార్క్ హ్యాట్రిక్... ఆస్ట్రేలియా, నెదర్లాండ్ మ్యాచ్ రద్దు

తిరువనంతపురంలో జరిగిన ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. వానతో ఆట ఆలస్యం కావడంతో మ్యాచ్‌ను 23 ఓవర్లకు కుదించారు. ముందుగా ఆసీస్ 23 ఓవర్లలో 7 వికెట్లకు 166 పరుగులు చేసింది. స్టీవ్ స్మిత్ (55) అర్ధ సెంచరీ సాధించగా...గ్రీన్ (34), క్యారీ (28), స్టార్క్ (24 నాటౌట్) రాణించారు. వాన్ డర్ మెర్వ్, డి లీడ్, వాన్ బీగ్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం నెదర్లాండ్స్ 14.2 ఓవర్లలో 6 వికెట్లకు 84 పరుగులు సాధించింది. మిచెల్ స్టార్క్ చెలరేగి 'హ్యాట్రిక్' సాధించాడు. అతను వరుసగా మూడు బంతుల్లో మ్యాక్స ఔడ్, వెస్లీ బరెసి, బాస్ డి లీడ్‌లను అవుట్ చేశాడు. అయితే మళ్లీ వాన రావడంతో అంపైర్లు ఇక ఆటను కొనసాగించకుండా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆస్ట్రేలియా తర్వాతి వామప్ మ్యాచ్‌లో అక్టోబర్ 3న హైదరాబాద్‌లో పాకిస్తాన్‌తో తలపడుతుంది.

పసిడి టెన్నిస్ శభాష్ స్క్వాష్...

భారత్ ఖాతాలో రెండు స్వర్ణాలు • షూటింగ్‌లో వెండి పతకం • అథ్లెటిక్స్‌లో రజత, కాంస్యాలు • ఆసియా క్రీడల్లో కొనసాగిన భారత్ జోరు

ఆసియా క్రీడల్లో భారత్ పతకాల మోత కొనసాగుతోంది. శనివారం కూడా నాలుగు వేర్వేరు క్రీడాంశాల్లో కలిపి భారత్ ఖాతాలో 5 పతకాలు చేరాయి. స్క్వాష్ టీమ్ విభాగంలో, టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో మన ఆటగాళ్లు పసిడి పంట పండించారు. షూటింగ్‌లో సాంప్రదాయం కొనసాగిస్తూ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మరో రజతం మనకు దక్కింది. ఏకంగా 25 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత అథ్లెట్లు 10 వేల మీటర్ల పరుగులో రజత, కాంస్యాలు అందించారు. వీటికి తోడు మహిళల టేబుల్ టెన్నిస్‌లో ప్రపంచ చాంపియన్ చైనాకు షాక్ ఇచ్చి మన ప్యాడ్లర్లు సంచలనం సృష్టించగా... బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో భారత బృందం తొలిసారి ఫైనల్ చేరింది. ఎప్పటిలాగే హాకీ మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను చిత్తు చేసిన టీమిండియా అదనపు ఆనందాన్ని అందించింది.

హాంగ్జౌ ఆసియా క్రీడలు


విజయానంతరం అభయ్ సింగ్... భారత బృందం సంబరాలు

పాకిస్తాన్‌ను పడగొట్టి...

ఎనిమిదేళ్ల తర్వాత స్క్వాష్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత్ స్వర్ణ పతకం గెలుచుకుంది. ఫైనల్లో భారత్ 2-1 తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై విజయం సాధించింది. లీగ్ దశలో పాక్ చేతిలో ఓడిన సౌరవ్ ఘోషాల్ బృందం అసలు సమయంలో సత్తా చాటింది. పోరు 1-1తో సమంగా నిలిచిన తర్వాత భారత్‌ను గెలిపించాల్సిన బాధ్యత యువ ఆటగాడు అభయ్ సింగ్‌పై పడింది. లీగ్ దశలో తనపై విజయం సాధించిన నూర్ జమాన్‌తో అభయ్ తలపడ్డాడు. హోరాహోరీగా సాగిన ఐదు గేమ్‌ల పోరులో చివరకు అభయ్ 11-7, 9-11, 8-11, 11-9, 12-10తో జమాన్‌ను ఓడించాడు. నాలుగో గేమ్‌లో ఒక దశలో జమాన్ 9-7లో ఆధిక్యం నిలవగా, ఐదో గేమ్‌లోనూ అతను 10-8తో విజయానికి చేరువయ్యాడు. కానీ అద్భుత పోరాటపటిమ కనబర్చిన అభయ్ రెండు సందర్భాల్లోనూ సత్తా చాటి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. చివరి పాయింట్ తర్వాత భారత జట్టు సభ్యులు భావోద్వేగంతో సంబరాలు చేసుకున్నారు. అంతకు ముందు తొలి మ్యాచ్‌లో పాక్ ఆటగాడు ఇక్బాల్ నసీర్ 11-8, 11-2, 11-3తో మహేశ్ మంగావ్‌కర్‌పై ఘన విజయం సాధించాడు. అయితే ఆరో సారి ఆసియా క్రీడల బరిలోకి దిగిన భారత స్టార్ సౌరవ్ ఘోషాల్ రెండో మ్యాచ్‌లో 11-5, 11-1, 11-3తో ముహమ్మద్ ఆసిమ్ ఖాన్‌ను చిత్తు చేసి స్కోరును సమం చేశాడు. 2014 ఇంచియాన్ ఆసియా క్రీడల్లో స్వర్ణం నెగ్గిన భారత్ 2018 పోటీల్లో కాంస్యంతో సరిపెట్టుకుంది.



'ముఖర్జీ' ద్వయం సంచలనం

- టీటీలో వరల్డ్ చాంపియన్ చైనా జోడీపై విజయం
- సెమీస్ చేరి పతకం ఖాయం

టేబుల్ టెన్నిస్ మహిళల డబుల్స్‌లో భారత జోడీ సుతీర్థ ముఖర్జీ - ఐహిక ముఖర్జీ అసాధారణ ప్రదర్శన కనబర్చింది. సంచలన విజయంతో ఈ జోడి సెమీఫైనల్‌కు చేరి పతకాన్ని ఖాయం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో సుతీర్థ - ఐహిక 11-5, 11-5, 5-11, 11-9 (3-1) స్కోరుతో వరల్డ్ చాంపియన్, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న మెంగ్ చెన్ - యిడి వాంగ్‌ను ఓడించింది. ఆసియా క్రీడల చరిత్రలో మహిళల డబుల్స్ విభాగంలో భారత్ ఎప్పుడూ పతకం గెలవలేదు. ఈ నేపథ్యంలో తాజా విజయం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. 8, 9 నిమిషాల్లో వరుసగా తొలి రెండు గేమ్‌లను గెలుచుకొని భారత జోడి దూకుడు ప్రదర్శించింది. మూడో గేమ్‌లో కోలుకొని చైనా ప్రత్యర్థి ఆధిక్యాన్ని తగ్గించగా, నాలుగో గేమ్ హోరాహోరీగా సాగింది. చివరకు మెంగ్ కొట్టిన ఫోర్‌హ్యాండ్ షాట్ నెట్‌కు తాకడంతో భారత్ విజయం ఖాయమైంది. అంతకు ముందు మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో మనిక బాత్రా 8-11, 12-10, 6-11, 4-11, 14-12, 5-11 స్కోరుతో వరల్డ్ నంబర్ 4 యిడి వాంగ్ (చైనా) చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్‌లో మానుష్ షా - మానవ్ ఠక్కర్ జంట క్వార్టర్స్‌లో 8-11, 11-7, 10-12, 11-6, 9-11 తేడాతో వూజిన్ జాంగ్ - జాంగ్‌హూన్ లిమ్ (కొరియా) చేతిలో ఓడి నిష్క్రమించింది.

కిడాంబి శ్రీకాంత్ గెలిపించగా...

- తొలిసారి ఫైనల్లో భారత్


శ్రీకాంత్‌కు కోచ్‌లు పుల్లెల గోపీచంద్, గురుసాయిదత్ అభినందన

భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టు ఆసియా క్రీడల టీమ్ ఈవెంట్‌లో తొలిసారి ఫైనల్లోకి అడుగు పెట్టింది. తద్వారా మొదటి స్వర్ణం గెలిచేందుకు మరో అడుగు దూరంలో నిలిచింది. శనివారం జరిగిన సెమీ ఫైనల్లో భారత్ 3-2 తేడాతో దక్షిణ కొరియాను ఓడించింది. అనూహ్యంగా కొరియానుంచి భారత్‌కు తీవ్ర ప్రతిఘటన ఎదురు కావడంతో పోరు హోరాహోరీగా సాగిన చివరి మ్యాచ్ వరకు వెళ్లింది. పురుషుల తొలి సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 18-21, 21-16, 21-19తో జీన్ హ్యోక్ జీన్‌పై విజయం సాధించగా, పురుషుల డబుల్స్‌లో టాప్ జోడి సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టిపై 21-13, 26-24తో కాంగ్ మిన్ హ్యూక్ - స్యూంగ్ జే సంచలన విజయం సాధించారు. రెండో సింగిల్స్‌లో లక్ష్య సేన్ 21-7, 2-19తో లీ యూన్ గ్యూను చిత్తుగా ఓడించినా... రెండో డబుల్స్‌లో ఎంఆర్ అర్జున్ - ధ్రువ్ కపిల 16-21, 11-21తో కిమ్ వోన్ హో - సంగ్ సియూంగ్ చేతిలో పరాజయంపాలైంది. దాంతో భారత్‌ను గెలిపించాల్సిన బాధ్యత కిడాంబి శ్రీకాంత్‌పై పడింది. తొలి గేమ్‌ను అతనూ ఓడిపోవడంతో కొంత ఉత్కంఠ పెరిగింది. అయితే చివరకు 12-21, 21-16, 21-14తో చో జియోనిప్‌పై శ్రీకాంత్ గెలుపొందాడు.

'సిల్వర్' సరబ్‌జోత్ - దివ్య



భారత షూటర్ సరబ్‌జోత్ సింగ్ శనివారం తన 22వ పుట్టిన రోజున మరో ఆసియా క్రీడల పతకాన్ని సొంతం చేసుకున్నాడు. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అతనికి రజతం దక్కింది. మెరిశాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సరబ్‌జోత్ - దివ్య టీఎస్ జోడి రెండో స్థానంలో నిలిచి వెండి పతకాన్ని గెలుచుకుంది. స్వర్ణ పతకం కోసం జరిగిన పోరులో చైనాకు చెందిన ప్రపంచ చాంపియన్ జోడి జాంగ్ బోవెన్ - జియాంగ్ రాంగ్జిన్ 16-14 తేడాతో సరబ్‌జోత్ - దివ్యలను ఓడించింది. గురువారమే 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించిన సరబ్‌జోత్ మరోసారి పసిడిపై గురి పెట్టినా దురదృష్టవశాత్తూ ఆ అవకాశం చేజారింది. దివ్యకు ఇది రెండో రజతం. తాజా ప్రదర్శన తర్వాత ఈ ఆసియా క్రీడల షూటింగ్‌లో భారత్ పతకాలు సంఖ్య 19కి చేరింది. ఇందులో 6 స్వర్ణాలు, 8 రజతాలు, 5 కాంస్యాలు ఉన్నాయి.

సత్తా చాటిన కార్తీక్, గుల్వీర్



1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో 10,000 మీటర్ల పరుగులో భారత్‌కు చెందిన గులాబ్ సింగ్ కాంస్య పతకం గెలుచుకున్నాడు. ఆ తర్వాత ఐదు ఆసియా క్రీడలు జరిగినా ఈ లాంగ్ డిస్టెన్స్ ఈవెంట్‌లో మనకు మెడల్ దక్కలేదు. కానీ శనివారం ఆ లోటు తీరింది. పురుషుల 10 వేల మీటర్ల పరుగులో భారత్ ఖాతాలో రెండు పతకాలు చేరాయి. రజత, కాంస్యాలు రెండూ మన అథ్లెట్లే గెలవడం విశేషం. కార్తీక్ కుమార్‌కు రజతం దక్కగా, గుల్వీర్ సింగ్ కాంస్యం సాధించాడు. కార్తీక్ కుమార్ 28 నిమిషాల 15.38 సెకన్లలో పరుగు పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచాడు. 28 నిమిషాల 17.21 సెకన్ల టైమింగ్‌తో గుల్వీర్ మూడో స్థానం సాధించాడు. వీరిద్దరికీ ఈ టైమింగ్‌లో వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనలు కావడం గమనార్హం. ఈ ఈవెంట్‌లో బహ్రెయిన్‌కు చెందిన బిర్హాను యమతావ్ (28 నిమిషాల 13.62 సెకన్లు) స్వర్ణపతకం గెలుచుకున్నాడు.

భారత్ 10, పాకిస్తాన్ 2



ఆసియా క్రీడల్లో భారత హాకీ జట్టు చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను బలంగా దెబ్బ కొట్టింది. పూల్ ఎ మ్యాచ్‌లో భారత్ 10-2 గోల్స్ తేడాతో పాక్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. అంతర్జాతీయ హాకీలో పాక్‌పై భారత్‌కు ఇదే అతి పెద్ద విజయం కావడం విశేషం. 2017లో నమోదు చేసిన 7-1 స్కోరును భారత్ ఇక్కడ తిరగరాసింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ నాలుగు గోల్స్‌తో చెలరేగాడు. హర్మన్ 11వ, 17వ, 33వ, 34వ నిమిషాల్లో గోల్స్ కొట్టాడు. వరుణ్ కుమార్ 41వ, 54వ నిమిషాల్లో గోల్స్ సాధించగా...లలిత్ (49వ ని.), షంషేర్ (46వ ని.), సుమీత్ (30వ ని.), మన్‌దీప్ సింగ్ (8వ ని.) ఒక్కో గోల్ చేశారు. పాకిస్తాన్ తరఫున అబ్దుల్ వహీద్ రానా (45వ ని.), సూఫియాన్ ఖాన్ (38వ ని.) ఒక్కో గోల్ నమోదు చేశారు.

మెరిసిన బోపన్న-రుతుజ ద్వయం





ఆసియా క్రీడల టెన్నిస్ ఈవెంట్‌ను భారత్ రెండు పతకాలతో ముగించింది. శుక్రవారం భారత్‌కు పురుషుల డబుల్స్ విభాగంలో రజత పతకం దక్కగా...శనివారం మన జట్టు ఖాతాలో పసిడి పతకం చేరింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడి రోహన్ బోపన్న - రుతుజ భోస్లే ద్వయం ఈ ఘనత సాధించారు. పోటాపోటీగా సాగిన ఫైనల్లో బోపన్న - రుతుజ 2-6, 6-3, 10-4 స్కోరుతో చైనీస్ తైపీకి చెందిన సుంగ్ హవో - షువో లియాంగ్‌పై విజయం సాధించారు. భారత్ స్వీయ తప్పిదాలతో భారత్ తొలి సెట్ కోల్పోయినా...ఆ తర్వాత స్థాయికి తగ్గ ప్రదర్శనతో మ్యాచ్‌ను నిలబెట్టుకుంది. రుతుజ పేలవ సర్వీస్‌తో పాటు లియాంగ్ చక్కటి రిటర్న్‌లతో తైపీ 5-1తో దూసుకుపోయింది. ఏడో గేమ్‌లో బోపన్న ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. అయితే రెండో సెట్‌లో రుతుజ ఆట మెరుగవడంతో పరిస్థితి మారిపోయింది. బోపన్న సర్వీస్‌తో సెట్ మన ఖాతాలో చేరగా...మూడో సెట్ సూపర్ టైబ్రేక్‌కు చేరింది. ఇక్కడా భారత జోడి చక్కటి ఆటతో ముందుగా 6-1తో ఆధిక్యంలోకి వెళ్లి ఆపై దానిని నిలబెట్టుకుంది. బోపన్నకు ఇది రెండో ఆసియా క్రీడల స్వర్ణం కాగా, రుదుజకు మొదటిది.

బాక్సింగ్‌లో మూడు పతకాలు ఖాయం

ముగ్గురు భారత బాక్సర్లు సెమీ ఫైనల్లోకి అడుగు పెట్టి కనీసం కాంస్యాన్ని ఖాయం చేసుకున్నారు. 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్ సెమీస్ చేరింది. క్వార్టర్స్‌లో ఆమె 4-1తో జైనాశికర్‌బెకొవా (కజకిస్తాన్)ను ఓడించింది. తాజా ఫలితంతో ప్రీతి పారిస్ ఒలింపిక్స్‌కు కూడా అర్హత సాధించడం విశేషం. టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతకం విజేత లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు), పురుషుల విభాగంలో నరేందర్ (92 కేజీలు) సెమీ ఫైనల్లోకి అడుగు పెట్టారు. క్వార్టర్స్‌లో లవ్లీనా 5-0తో సియోంగ్ సుయాన్ (కొరియా)పై, నరేందర్ 5-0తో ఇమాన్ దిలావర్ (ఇరాన్)ను ఓడించారు.

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	114	68	34	216
జపాన్	28	38	39	105
దక్షిణ కొరియా	27	29	54	110
భారత్	10	14	14	38
ఉజ్బెకిస్తాన్	10	11	16	37
థాయ్‌లాండ్	8	4	14	26
చైనీస్ తైపీ	7	9	9	25
హాంకాంగ్	5	15	18	38
ఉత్తర కొరియా	5	7	4	16
ఇరాన్	3	11	11	25

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

మీరాబాయి చానుకు నాలుగో స్థానం

టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత మీరాబాయి చాను అనూహ్య ఓటమిని ఎదుర్కొంది. వెయిట్‌లిఫ్టింగ్ 49 కేజీల కేటగిరీలో చాను నాలుగో స్థానంలో నిలిచింది. మొత్తం 191 కేజీల బరువెత్తిన చాను కాంస్యం కోసం ప్రయత్నిస్తూ చివరి ప్రయత్నంలో దురదృష్టవశాత్తూ గాయపడింది. 117 కేజీల క్లీన్ అండ్ జర్క్ లక్ష్యంగా ప్రయత్నించి వెనుక వైపుకు పడిపోయింది. దాంతో కోచింగ్ సిబ్బంది ఆమెను బయటకు తీసుకుపోవాల్సి వచ్చింది. వైద్య పరీక్షలు జరిపి ఆమె గాయం తీవ్రతను తెలుసుకుంటామని భారత అధికారులు వెల్లడించారు.

ఫైనల్స్‌కు జ్యోతి క్వాలిఫై

భారత అథ్లెట్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యెర్రాజి ఆసియా క్రీడల మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో ఫైనల్స్‌కు అర్హత సాధించింది. హీట్స్‌ను ఆమె 13.03 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచింది. మరో భారత అథ్లెట్ నిత్య రామ్‌రాజ్ కూడా ఇదే ఈవెంట్‌లో ఫైనల్స్‌కు క్వాలిఫై అయింది. లాంగ్‌జంప్‌లో కామన్వెల్త్ రజత పతక విజేత మురళీ శ్రీశంకర్ కూడా ముందంజ వేశారు. 7.97 మీటర్లు దూకిన మురళి అర్హత మార్క్ (7.90 మీటర్లు)ను సునాయాసంగా దాటి ఫైనల్స్‌కు చేరాడు. జెస్విన్ ఆల్డ్రిన్ కూడా భారత్ తరఫున ఫైనల్లో పోటీ పడనున్నాడు. 1500 మీటర్ల పరుగులో భారత్ తరఫున జిన్సన్ జాన్సన్, అజయ్ కుమార్ బరిలోకి దిగుతారు.

తొలి 'వామప్' వర్షార్పణం



భారత్, ఇంగ్లండ్ మ్యాచ్ రద్దు

గువహటి: వన్డే వరల్డ్‌కప్‌లో భారత్‌కు సరైన సన్నాహకం లభించలేదు. వామప్ మ్యాచ్‌లను వరుసగా రెండో రోజూ వాన వెంటాడటంతో ఆట సాధ్యం కాలేదు. భారీ వర్షం కారణంగా శనివారం భారత్, ఇంగ్లండ్ మధ్య జరగాల్సిన వామప్ మ్యాచ్ రద్దయింది. రోజంతా కురిసిన వర్షం తెరిపినివ్వకపోవడంతో ఒక్క బంతి కూడా వేసే అవకాశం లేకపోయింది. మ్యాచ్ ఆరంభానికి కాస్త ముందు పరిస్థితి మెరుగ్గా ఉండటంతో టాస్ వేశారు. టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే ఆ తర్వాత జోరందుకున్న వానతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేయక తప్పలేదు. నిజానికి ఇరు జట్ల ఆటగాళ్లు అధికారికంగా అంపైర్లు ప్రకటించక ముందే మైదానం వీడి హోటల్‌కు వెళ్లిపోయారు. ఈ నెల 3న తిరువనంతపురంలో జరిగే తమ తర్వాతి వామప్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో భారత్ తలపడుతుంది. అయితే తాజా స్థితిని బట్టి చూస్తే ఈ మ్యాచ్ నిర్వహణ కూడా సందేహంగానే ఉంది. వరల్డ్ కప్ అసలు సమరంలో ఈ నెల 8న చెన్నైలో ఆస్ట్రేలియాను టీమిండియా ఎదుర్కొంటుంది.

'శాఫ్' అండర్-19 ఫుట్‌బాల్ విజేత భారత్



ఖట్మండూ (నేపాల్): దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-19 ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌ను భారత జట్టు గెలుచుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో భారత్ 3-0 గోల్స్ తేడాతో పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. 'శాఫ్' చాంపియన్‌షిప్‌లో భారత్ విజేతగా నిలవడం ఇదే ఎనిమిదో సారి కావడం విశేషం. భారత్ తరఫున మంగ్లెన్‌తంగ్ కిప్‌జెన్ రెండు గోల్స్ (64వ నిమిషం, 85వ నిమిషం) సాధించగా, గ్వాగమ్‌సర్ గోయరీ (90+5వ నిమిషం) మరో గోల్ కొట్టాడు.

రాహుల్‌కు మొదటి అవకాశం



న్యూఢిల్లీ: వరల్డ్ కప్‌లో భారత వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్‌కే తొలి ప్రాధాన్యత ఉంటుందని మాజీ వికెట్ కీపర్, మాజీ సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ అభిప్రాయ పడ్డారు. ఇషాన్ కిషన్‌కంటే మిడిలార్డర్‌లో రాహుల్ ఎంతో విలువైన ఆటగాడని ఆయన అన్నారు. తన ప్రదర్శనతో దీనిని అతను రుజువు చేసుకున్నాడని, మరో చర్చకు ఆస్కారం లేద ని ప్రసాద్ చెప్పారు. రాహుల్‌కు గాయం కావడం లేదా సుదీర్ఘ టోర్నీ కాబట్టి కొన్ని మ్యాచ్‌లలో తప్పనిసరిగా విశ్రాంతినివ్వాల్సి వస్తేనే ఇషాన్ కిషన్‌కు తుది జట్టులో చోటు దక్కుతుందని ఎమ్మెస్కే వివరించారు.



‘దేవుడే’ దిక్కు..!

నేటికీ కొనసాగుతున్న దురాచారం.. దుర్భరంగా జోగినుల జీవనం.. కూడు, గూడు లేక ఇబ్బందులు

అందని స్వయం ఉపాధి పథకాలు.. అర్హులకూ రాని ఒంటరి పింఛన్.. సర్కారు సాయం కోసం విజ్ఞప్తులు



నా తల్లిదండ్రులు నన్ను జోగినిగా చేసి వదిలేశారు. ఉపాధి లేక దొరికిన రోజు కూలి పనులకు వెళ్తున్నా. వచ్చే కూలి పైసలతో కుటుంబ పోషణ భారమైంది. ప్రభుత్వం మాకు దళితబంధు ఇస్తే ఉపాధి కల్పించినోళ్లయితరు. – గుర్రం బాలమ్మ



నన్ను తెలియని వయసులో జోగినిగా మార్చారు. నాకు ఇద్దరు పిల్లలు. మట్టి పని చేస్తూ సాకుతున్నా. పింఛన్ కోసం నాలుగేళ్లుగా ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నా. ఇప్పటికీ పెన్షన్ రాలేదు. ఎవరూ పట్టించుకోవడం లేదు. – చెక్క తిరుమలమ్మ



నన్ను జోగినిగా మార్చి 25 ఏళ్లు. ఈమె నా బిడ్డ భారతి. తండ్రి పేరు లేనిదే స్కూల్‌లో చేర్పించుకోమని చెప్పడంతో చదువు చెప్పించలేదు. మాకు ఈ పెంకుటిల్లు తప్ప వేరేది లేదు. వర్షం వస్తే ఇల్లంతా నీళ్లే. కూతురి కూలిపైనే కడుపు నింపుకొంటున్నాం. మాకు గృహలక్ష్మితో పాటు స్వయం ఉపాధి కల్పించాలి. – దొర్లపల్లి ఎల్లమ్మ



మాది పులిమామిడి గ్రామం. నాకు 38 ఏళ్లు.. ముగ్గురు పిల్లలు. నన్ను 20 ఏళ్ల క్రితమే జోగినిని చేశారు. ఒంటరి మహిళ కింద ఆసరా పింఛన్ కోసం మూడుసార్లు ఊట్కూరు మండల కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నా. మా తరఫున మాట్లాడేవారు లేకపోవడంతో అధికారులు అప్పుడు, ఇప్పుడు అంటూ దాటవేస్తున్నారు. – శివపురం గజలమ్మ

..ఈ నలుగురే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా సమాజంలో దేవుడి భార్యలుగా చెలామణి అవుతున్న వారి దీన గాథ ఇది. కూడు, గూడు, ఉపాధి లేక నానాపాట్లు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఒంటరి పింఛన్ మినహా.. వారి స్థితిగతులను మార్చేలా ఎలాంటి కార్యక్రమాలు ముందుకు పడకపోవడంపై వారిలో ఆవేదనతో కూడిన అసంతృప్తి పెల్లుబికుతోంది. ఆధునిక కాలంలోనూ ఆదరణకు నోచుకోకపోవడం.. విద్య, ఆర్థిక తదితర రంగాల్లో వెనుకబాటుతనం వెరసి దుర్భర జీవితాలు అనుభవిస్తున్న జోగినులపై ‘సాక్షి’ప్రత్యేక కథనం..

ఏడేళ్ల క్రితం వరకు యథేచ్ఛగా.. ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా

సాధారణంగా ఒకే కుటుంబానికి చెందిన అట్టడుగు వర్గాల స్త్రీలను జోగినులుగా మార్చి దేవతలకు అర్పించడం.. ఊరికి ఉపకారం పేరిట ఉంపుడుగత్తెలను చేయడం ప్రాచీన కాలం నుంచి ఆచారంగా వచ్చింది. ఈ దురాచారాన్ని 1988లో రద్దు చేశారు. అయితే ఏడెనిమిదేళ్ల క్రితం వరకు యథేచ్ఛగా సాగిన ఈ జోగినీ వ్యవస్థ ఇప్పటికీ పలుచోట్ల గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. కోవిడ్ కాలంలో ఈ దురాచారం మళ్లీ పురుడుపోసుకున్నట్లు పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. దేవరకద్ర, ఊట్కూరు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో రెండేళ్లుగా సుమారు 18 మందిని జోగినులుగా మార్చినట్లు సమాచారం. గత ఏడాది ఫిబ్రవరిలో దేవరకద్ర పరిధిలో ఓ విద్యావంతుల కుటుంబానికి చెందిన అమ్మాయిని జోగినిగా మార్చేందుకు ప్రయత్నించగా.. ఓ ఎన్జీఓ సంస్థ అడ్డుకోవడం ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది. ఇక జోగినుల జీవన భృతికి సంబంధించి ఒంటరి పింఛన్‌కు అర్బన్ ప్రాంతాల్లో 30 ఏళ్లు, గ్రామాల్లో 35 ఏళ్ల వయసు ఉన్న వారిని అర్హులుగా గుర్తించారు. కానీ పలుచోట్ల 20, 25 ఏళ్లు ఉన్న జోగిని మహిళలు ఒంటరి పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీన్ని బట్టి ఈ వ్యవస్థ ఇంకా కొనసాగుతోందని ఎన్జీఓలు చెబుతున్నారు.

అప్పట్లో నిజామాబాద్‌లో.. ఇప్పుడు పాలమూరులో ఎక్కువగా

1987–88లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 24,273 మంది జోగినులు ఉన్నట్లు ఆనాటి ప్రభుత్వం గుర్తించింది. ఇందులో తెలంగాణలోనే 14,863 మంది జోగినులు ఉండగా.. నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 5,666 మంది ఉన్నట్లు తేలింది. ఇక 2013లో ఏకసభ్య కమిషన్ నివేదిక ప్రకారం తెలంగాణలో 12 వేల మంది జోగినులు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల పరిధిలోని దేవరకద్ర, మహబూబ్‌నగర్, గద్వాల, గట్టు, ధరూర్, నారాయణపేట , ఊట్కూర్, మక్తల్, మాగనూర్, ధన్వాడ, నర్వ, అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో సుమారు ఐదు వేల మందికి పైగా ఉన్నట్లు నివేదికలో పొందుపరిచారు. ఇక ప్రస్తుతం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎనిమిది వేలకు పైగా జోగినులు ఉన్నట్లు ఎన్జీఓ సంస్థలు చెబుతున్నాయి.

జోగినులుగా మారిన మహిళలకు వివాహం ఉండదు.. కుటుంబం కుదరదు.. సొంత జీవితమంటూ ఉండదు.. ఎవరి ఆదరణకు నోచుకోకపోవడంతో వ్యభిచారంతో ఆరోగ్యం దెబ్బతిని ఇప్పటికే వందల సంఖ్యలో మృత్యువాతపడ్డారు. 75 శాతం మేర జోగినుల వయసు పైబడడం, తండ్రి పేరు లేకపోవడంతో వారి పిల్లలను పాఠశాలల్లో చేర్చుకోకపోవడం

విద్యకు దూరం..

తో ఉన్న వారు సైతం నిరక్షరాస్యులుగానే మిగిలారు. 2009లో తల్లిపేరుతో అవకాశం కల్పించినప్పటికీ.. పదో తరగతికి మించి ఒకట్రెండు కుటుంబాలు మినహా ఉన్నత విద్యను అభ్యసించలేకపోయాయి. దీనికి తోడు అమ్మాయిల సంతానం ఎక్కువగా ఉన్న కుటుంబాలు ఆడపిల్లలను వదిలించుకుందామనే ఉద్దేశంతో మొక్కు పేరిట జోగినిగా మారుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయా కుటుంబాలను చైతన్యం చేయడంతో పాటు స్వయం ఉపాధి కల్పించేలా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటేనే ఈ దురాచారాన్ని నిర్మూలించే అవకాశం ఉంది.

జోగినులకు ప్రత్యేక చట్టం చేయాలి..



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎంత మంది జోగినులు ఉన్నారనే దానిపై సర్వే చేపట్టాలి. ఆ తర్వాత ఏపీలో చేసిన తరహాలో ప్రత్యేక చట్టం చేయాలి. గతంలో ఏకసభ్య కమిషన్‌కు సమర్పించిన డిమాండ్లను నెరవేర్చాలి.

– హాజమ్మ, జోగిని నిర్మూలన హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్

ప్రత్యేక బడ్జెట్.. జోగిని బంధు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఏటా బడ్జెట్‌లో జోగిని సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.3 కోట్ల బడ్జెట్ కేటాయించేవారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ సంప్రదాయం అటకెక్కింది. దీన్ని కొనసాగించడంతోపాటు రాష్ట్రంలోని వివిధ కులాలకు ఉన్నట్లుగానే జోగినుల సంక్షేమం , అభివృద్ధిలో భాగంగా తమకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని జోగినులు డిమాండ్ చేస్తున్నారు. దీని ద్వారా ఒక్కో జోగిని కుటుంబానికి మూడు ఎకరాల చొప్పున భూమి ఇవ్వాలని.. నివాసం కోసం ఉచితంగా స్థలంతో పాటు ఇల్లు కట్టించాలని కోరుతున్నారు. అదేవిధంగా దళితబంధు, బీసీబంధు, మైనార్టీబంధు వలే జోగినిబంధు తీసుకొచ్చి.. ప్రతి ఒక్క జోగినికి స్వయం ఉపాధి నిమి త్తం రూ.10 లక్షలు ఇవ్వాలని కోరుతున్నారు.

జోగినుల ఇతర డిమాండ్లు..

- ప్రతి జోగినికి రూ.3 వేల భృతి ఇవ్వాలి.
- పదో తరగతి పాసైన జోగినిల పిల్లలకు అర్హతను బట్టి ఉద్యోగాలు ఇవ్వాలి.
- స్వయం ఉపాధి కల్పనలో భాగంగా బ్యాంకులతో సంబంధం లేకుండా ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు ఇవ్వాలి.
- చదువుకునే జోగిని పిల్లలందరికీ రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రైవేట్ విద్యాలయాల్లో ఉచితంగా నాణ్యమైన విద్యను బోధించాలి. డిగ్రీ ఆపై విద్యార్హత ఉన్న వారికి ఉన్నత ఉద్యోగావకాశాలు కల్పించాలి.
- 1988 జోగిని నిర్మూలన చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలి.
- ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కమిటీలో జోగినులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. గ్రామాల్లో ఉన్న ప్రతి జోగిని కుటుంబానికి ఆహారభద్రత కార్డు ఇవ్వాలి.

విద్యుత్ శాఖలో కొత్తగా లైన్ ఉమన్లు

నియామక పత్రాలు అందుకున్న ఆరుగురు అభ్యర్థులు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: విద్యుత్ శాఖలో జూనియర్ లైన్ ఉమెన్లుగా ఉద్యోగాలు దక్కించుకున్న ఆరుగురు మహిళా అభ్యర్థులు నియామక పత్రాలు అందుకున్నారు. శనివారం ఎర్రగడ్డలోని టీఎస్ జెన్‌కో ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జేఎల్‌ఎంల నియామకాల్లో ఇప్పటివరకు మహిళలకు అవకాశం కల్పించలేదని తెలిపారు. దీంతో ఆసక్తి ఉన్న ఎంతోమంది ఉద్యోగాలకు దూరమయ్యారన్నారు. అయితే న్యాయస్థానం తీర్పుతో తమకు చోటు దక్కడం సంతోషంగా ఉందన్నారు. పోల్ క్లైంబింగ్‌తో పాటు అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన తాము, పురుషులతో సమానంగా విధులు నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1,362 మంది అభ్యర్థులను ఎంపిక చేయగా.. వీరిలో ఆరుగురు మహిళలు ఉన్నారు.

బీసీల స్థితిగతులపై ఆర్నెల్లలో నివేదిక

- కసరత్తు వేగవంతం చేసిన తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్
- రాష్ట్రంలో బీసీల సామాజిక, ఆర్థిక స్థితిపై అధ్యయనం
- ఇప్పటికే ప్రత్యేక ఫార్మాట్‌తో ప్రభుత్వ శాఖల వారీగా సమాచార సేకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక స్థితిపై అధ్యయన ప్రక్రియను తెలంగాణ బీసీ కమిషన్ వేగవంతం చేసింది. ఇప్పటికే క్షేత్రస్థాయి పర్యటనలు పూర్తి చేసిన కమిషన్... తాజాగా వివిధ ప్రభుత్వ శాఖలతో వరుసగా భేటీలు నిర్వహించి మరింత సమాచారాన్ని సేకరిస్తోంది. పూర్తిస్థాయి నివేదికను 6నెలల్లోగా రాష్ట్ర ప్రభుత్వానికి అందించేందుకు సిద్ధమవుతోంది.

రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాలు, సామాజిక అంశాలు, స్థానిక సంస్థల్లో అందుతున్న అవకాశాలపై బీసీ కమిషన్ అధ్యయనం చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కమిషన్ కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో బీసీల స్థితిగతులను పరిశీలించింది. తాజాగా తెలంగాణలో ప్రభుత్వ శాఖల ద్వారా బీసీలకు అందుతున్న లబ్ధి, ఉద్యోగావకాశాలు, ఆర్థిక చేకూర్పు కార్యక్రమాలు, తదితరాలపై ఈనెల 25 నుంచి నాలుగు రోజుల పాటు సమీక్షించింది.

వకుళాభరణం అధ్యక్షతన సమీక్ష

రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు సీహెచ్. ఉపేంద్ర, శుభప్రద్ పటేల్ నూలి, కె. కిశోర్‌గౌడ్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బీసీ సంక్షేమ శాఖ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు, రిజర్వేషన్ల అమలు–తీరుతెన్నులు, కులాల వారీగా నిధుల కేటాయింపు, విద్యార్థులు, ఉద్యోగుల వారీగా లబ్ధిదారుల పూర్తి వివరాలను సమీక్షించారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారానే కాకుండా ఇతర ప్రభుత్వ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాల్లో బీసీ లబ్ధిదారులను తెలుసుకునేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ ప్రత్యేక ఫార్మాట్‌ను రూపొందించింది. ఈ ఫార్మాట్ ఆధారంగా ప్రతి ప్రభుత్వ శాఖ సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని బీసీ కమిషన్ స్పష్టం చేసింది. బీసీల్లోని కులాలు, ప్రాధాన్యతలను ప్రస్తావిస్తూ ఏయే కేటగిరీకి ఎంతమేర అవకాశాలు అందాయి... ఏమేరకు అవకాశాలు కల్పించాలి, అందుకు సంబంధించి చేయాల్సిన మార్పులు, తీసుకోవాల్సిన నిర్ణయాలను సైతం కమిషన్ సూచించనుంది. ఆరునెలల్లోగా నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించేలా చర్యలు చేపట్టింది.



సమావేశంలో మాట్లాడుతున్న వకుళాభరణం కృష్ణమోహన్

అది ఓ కప్పల తక్కెడ

▶ మొదటి పేజీ తరువాయి

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల నిర్వహించిన సభల్లో మాట్లాడారు. ఆ వివరాలు కేటీఆర్ మాటల్లోనే.. ''సత్తుపల్లి ప్రాంతానికి చెందిన వ్యక్తి ఓడిపోయి ఇంట్లో కూర్చుంటే గౌరవించి జిల్లా స్థాయిలో పెద్ద పదవిలో పెడితే.. ఇప్పుడు టికెట్ ఇవ్వకపోతే కేసీఆర్‌ను నిందిస్తున్నారు. పార్టీ అన్నప్పుడు కొన్ని నిర్ణయాలు జరుగుతాయి. నిన్నటిదాకా దేవుడిలా కనబడిన కేసీఆర్ వెంటనే దయ్యమై పోతాడా? రాజకీయాల్లో పార్టీలు మారడం సహజం. కానీ ఇష్టం వచ్చినట్లు నిందించడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలి (తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను ఉద్దేశించి పరోక్ష విమర్శలు).

గ్యారంటీల పేరిట ఊదరగొడుతున్నారు

కేసీఆర్ ఒకటి అంటే మేం రెండు చేస్తామంటూ కాంగ్రెస్ నేతలు ఊదరగొడుతున్నారు. గ్యారంటీలు అంటున్నారు. కాంగ్రెస్ హయాంలో బిందెడు నీళ్ల కోసం గోసపడ్డాం. ఇప్పుడు 96శాతం గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా మంచినీళ్లు అందుతున్నాయి. 24 గంటల కరెంట్ చూపిస్తే రాజీనామా చేస్తానంటున్నాడు ఓ ఎంపీ (కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఉద్దేశిస్తూ..). ఖమ్మం జిల్లాలోని ఏ నియోజకవర్గానికి వస్తారో రండి. ఇక్కడ కరెంట్ తీగలను పట్టుకుంటే కరెంట్ వస్తుందో, రాదో తెలుస్తుంది. కాంగ్రెస్ వాళ్లే సమస్యలు పరిష్కరించి ఉంటే ప్రజలు మాకెందుకు అధికారం ఇస్తారు? కొందరు నాయకులు సీతారామ ప్రాజెక్టు నీటితో ప్రజల కాళ్లు కడుగుతామంటున్నారు. గత ప్రభుత్వాల్లో ఉన్నప్పుడు ఎందుకు చేయలేదు? ఆ ప్రాజెక్టును పూర్తి చేసి ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో 7.5 లక్షల ఎకరాలకు నీళ్లు తెచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.



సత్తుపల్లిలో మంత్రుల పర్యటన సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో బీఆర్ఎస్ శ్రేణులు

కాంగ్రెస్ సీట్లు అమ్ముకుంటున్నారు!

పీసీసీ అధ్యక్షుడు రూ.50 కోట్లకు పదవి కొనుక్కున్నారని కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా అన్నారు. మరో నాయకుడు టికెట్ కోసం పదెకరాలు అడిగాడు. పది కోట్లు అడిగారని చెప్పున్నారు. కోట్లకు సీట్లు అమ్ముకుంటున్నారు. వారికి ఓటు వేస్తే రాష్ట్రాన్ని అమ్ముకోరా? మొండి చేయికి ఓటేస్తే మూడు గంటల కరెంట్, ఏడాదికో సీఎం మారడం గ్యారంటీ.

ప్రతిపక్షాలను ఫుట్‌బాల్ ఆడాలని..

గ్రౌండ్‌లో పిల్లలు ఫుట్‌బాల్ ఆడతారు. ఎన్నికలు వస్తున్నాయి, మీరు ప్రతిపక్షాలను ఫుట్‌బాల్ ఆడండి అని మంత్రి అజయ్‌కి చెప్పాను. ఖమ్మంలో అజయ్ ప్రత్యర్థుల కుట్రలను తుత్తునియలు చేసి గెలవాలని ఆకాంక్షిస్తున్నా. సత్తుపల్లిలో సండ్ర వెంకట వీరయ్యను గెలిపించుకోవాలి. హుజూరాబాద్ తర్వాత ఆ స్థాయిలో సత్తుపల్లిలో దళితబంధు ప్రారంభించాలని సీఎం చెప్పారు. అలాగే మధిర నియోజకవర్గం బోనకల్ మండలంలోనూ ప్రతీ దళిత కుటుంబానికి దళితబంధు ఇస్తాం.

కర్ణాటక డబ్బులు వస్తున్నాయి

కర్ణాటక నుంచి డబ్బులు ఇక్కడకు బాగా వస్తున్నాయట.. అక్కడి కాంగ్రెస్ నుంచి ఇక్కడకు డబ్బులు వస్తున్నాయట., అక్కడ స్పెషల్ ట్యాక్స్‌లు వేస్తున్నారట. కొత్తగా బిల్డింగ్ కడితే స్క్వేర్ ఫీట్‌కు రూ.500 ముక్కు పిండి వసూలు చేస్తున్నారట.. తెలంగాణ కాంగ్రెస్‌కు రూ.వందల కోట్లు పంపుతున్నారట.. కానీ అమ్ముడుపోయే అంగడి సరుకు కాదు నా తెలంగాణ అని ఢిల్లీ, బెంగళూరు వారికి తెలిసేలా తీర్పు ఇవ్వండి. మోసాన్ని మోసంతోనే జయించాలి. కర్ణాటక నుంచి వచ్చే సొమ్మును తప్పకుండా తీసుకోండి. ఓటు మాత్రం కచ్చితంగా కారు గుర్తుకు కేసీఆర్, అజయ్‌కుమార్, వెంకటవీరయ్యకు వేసి గెలిపించండి.

ఎన్టీఆర్ పేరులో పవర్

తెలుగువారిని దేశం గుర్తించేలా వ్యవహరించింది ఆనాడు ఎన్టీఆర్ అయితే.. తెలంగాణ వారికి అస్తిత్వం ఉంది, పాలన చేతవుతుందంటూ తెలంగాణ పౌరుషం ఏమిటో దేశానికి రుచి చూపించినది కేసీఆర్. ఎన్టీఆర్ అనే పేరులోనే పవర్ ఉంది. ఆయన ఆశీస్సులు, ప్రజల ఆశీర్వాదంతో కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కావాలి..'' అని కేటీఆర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి పువ్వాడ అజయ్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, లావు డ్యా రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్‌కు నమస్కరిస్తున్న పువ్వాడ

అజయ్ సార్.. రండి!

ఖమ్మం సభలో ప్రసంగించిన సందర్భంగా పువ్వాడ అజయ్‌కుమార్‌ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమయంలో వేదికపైనే ఉన్న పువ్వాడ అజయ్‌ను పిలుస్తూ.. 'అజయ్ సార్ రండి.. ప్రజలకు పరిచయం కండి' అన్నారు. దీనితో అజయ్ ముందుకొచ్చి ప్రజలకు అభివాదం చేశారు. కేటీఆర్ వద్ద కాస్త ముందుకు వంగి కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరించారు.

భరత్ భూషణ్ కుటుంబానికి 'డబుల్‌బెడ్రూం'

- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు కలెక్టర్ ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: ప్రఖ్యాత ఫొటో జర్నలిస్టు, చిత్రకారుడు దివంగత భరత్‌భూషణ్ కుటుంబానికి హైదరాబాద్‌లోని జియాగూడలో డబుల్ బెడ్రూం ఇల్లును ప్రభుత్వం కేటాయించింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి కేటీఆర్ స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ మేరకు జియాగూడలో నిర్మించిన డబుల్‌బెడ్రూం కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. భరత్ భూషణ్ 1953లో వరంగల్ జిల్లాలో జన్మించారు. తెలంగాణ సంస్కృతి, గ్రామీణ జీవన స్థితిగతులపై అనేక ఫొటో ప్రదర్శనలిచ్చి జాతీయ, అంతర్జాతీయ గుర్తింపును పొందారు. తెలంగాణ బతుకమ్మ ఫెస్టివల్‌ను డాక్యుమెంట్ చేసి తెలంగాణ సంస్కృతిపై తనకున్న ప్రత్యేక శ్రద్ధను చాటుకున్నారు. భరత్ భూషణ్ తన జీవిత కాలంలో ఏడు సోలో ఫొటో ఎగ్జిబిషన్లు, ఆరు ఆర్ట్ షోలు ప్రదర్శించి ప్రశంసలందుకున్నారు. గతంలో ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు వైద్యఖర్చుల కోసం ముఖ్యమంత్రి ఆరోగ్య నిధి నుండి ప్రభుత్వం చేయూతనందించింది. తమను కష్టకాలంలో ఆదుకుంటూ, ఇప్పుడు తమకు డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించి మరోసారి అండగా నిలిచినందుకు భరత్ భూషణ్ భార్య సుభద్రమ్మ, కుటుంబ సభ్యులు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

యాదాద్రి పవర్‌ప్లాంట్‌పై కుట్రలెందుకు?

ఎన్జీటీ ఆదేశాలను బేఖాతరు చేస్తున్న కేంద్రం: మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యాదాద్రి థర్మల్ అల్ట్రా మెగా పవర్ ప్లాంట్‌కు కావాలనే కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం లేదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. శనివారం సూర్యాపేటలో మీడియాతో ఆయన మాట్లాడారు. అనుమతులు ఇవ్వడంలో కేంద్రం చేస్తున్న జాప్యంపై మండిపడ్డారు. తొమ్మిది నెలల్లో టర్మ్ ఆఫ్ రిఫరెన్స్ ఇవ్వాలన్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలను కేంద్రం బేఖాతర్ చేస్తోందని, థర్మల్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినా అనుమతులు రావడం లేదన్నారు. ప్రధాని మోదీ జోక్యం చేసుకొని కేంద్ర మంత్రికి ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మోదీ అడుగు పెట్టే ముందు ఆదేశాలు ఇచ్చి రావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రైతాంగానికి గుండెకాయగా మారుతుందనే యాదాద్రి ప్లాంట్‌పై కుట్రలు పన్నుతున్నారని, రాష్ట్రంపై జరుగుతున్న కుట్రలను తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఉచిత విద్యుత్ ప్రతిపక్షాలకు కంటగింపుగా మారిందని, మూడు గంటలు చాలు అన్న కాంగ్రెస్ నాయకులు...కరెంట్ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా వరిచేను, ఒక్క వరి కంకి ఎండిపోలేదని, ప్రతిపక్షాలది పసలేని ప్రచారం అని ఎద్దేవా చేశారు.

తెలంగాణ అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి

మంత్రి సత్యవతి రాథోడ్



మహేశ్వరం: తెలంగాణ సమగ్ర అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతగానో కృషిచేస్తున్నారని స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో రూ.14 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శనివారం స్థానిక మంత్రి సబితారెడ్డితో కలసి ఆమె శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బంజారాలు, ఆదివాసీల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని తెలిపారు. రూ.100 కోట్లతో హైదరాబాద్‌లో బంజారా భవన్, ఆదివాసీ భవన్‌లను నిర్మించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది నిరసన

మహేశ్వరంలో పర్యటిస్తున్న మంత్రుల వాహనాలను అంగన్‌వాడీ సిబ్బంది అడ్డుకున్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శివగంగ రాజేశ్వరాలయం ఎదుట ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చిన ఆందోళనకారులు కాన్వాయ్‌కి అడ్డుగా నిలిచారు. వెంటనే తేరుకున్న పోలీసులు వారిని పక్కకు నెట్టేసి కాన్వాయ్‌ను ముందుకు పంపించారు. ఈ సందర్భంగా పోలీసులు తమతో దురుసుగా వ్యవహరించారని నిరసనకారులు మండిపడ్డారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీనిపై స్పందించిన మంత్రి సత్యవతి మాట్లాడుతూ.. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. దీంతో అంగన్‌వాడీలు శాంతించారు.

బీఆర్ఎస్‌ది అసమర్థ పాలన

▶ మొదటి పేజీ తరువాయి

జిల్లాలో, 3వ తేదీన నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఆయా చోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతోపాటు బీజేపీ నిర్వహించే ప్రజాగర్జన బహిరంగ సభల్లోనూ పాల్గొననున్నారు. ఈ పర్యటనల సందర్భంగా అటు అభివృద్ధి మంత్రం, ఇటు రాజకీయ తంత్రంతో ద్విముఖ వ్యూహాన్ని అమలు చేయనున్నట్లు బీజేపీ వర్గాలు చెప్తున్నాయి.

మోదీ పాలమూరు పర్యటన ఇలా..

ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి వైమానిక దళ ప్రత్యేక విమానంలో ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి ఎంఐ–17 సైనిక హెలికాప్టర్‌లో బయలుదేరి 2.05 గంటలకు పాలమూరుకు చేరుకుంటారు. 2.15 గంటల నుంచి 2.50 గంటల వరకు వివిధ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనల కార్యక్రమం ఉంటుంది. తర్వాత కాస్త దూరంలో విడిగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వేదిక వద్దకు వస్తారు. 3 గంటల నుంచి 4 గంటల వరకు సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సాయంత్రం 4.45 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని ఢిల్లీకి తిరుగుప్రయాణం అవుతారు.

బీఆర్ఎస్‌పై నేరుగా దాడే!

ప్రధాని మోదీ పాలమూరులో జరిగే బీజేపీ సభలో అసెంబ్లీ ఎన్నికల ప్రచార శంఖారావం పూరిస్తారని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలో పూర్తి స్థాయి రాజకీయ ప్రసంగం చేస్తారని, తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలన వైఫల్యాలు, హామీల అమలు, కేంద్రం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు సహాయ నిరాకరణ వంటి అంశాలపై నిలదీస్తారని అంటున్నాయి. ప్రసంగంలో భాగంగా కేసీఆర్ సర్కార్‌పై అవినీతి ఆరోపణలు, కుటుంబ పాలనపైనా ఘాటుగా విమర్శలు గుప్పించే అవకాశం ఉందని నేతలు చెప్తున్నారు. గతంలో ఎన్నడూ లేనంత తీవ్ర స్థాయిలో విమర్శల దాడి ఉంటుందని.. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రత్యామ్నాయంగా బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకు మోదీ పిలుపునిస్తారని అంటున్నారు. ఇదే సమయంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గత తొమ్మిదేళ్లలో సాధించిన విజయాలను వివరిస్తారని.. కేంద్రం నుంచి తెలంగాణకు అందిన సాయాన్ని గణాంకాలతో వెల్లడిస్తారని చెప్తున్నారు. దీనితోపాటు ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి రెండు, మూడు వరాలు, ప్రకటనలు చేసే అవకాశం కూడా ఉందని అంటున్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే తొలి కేబినెట్ భేటీలోనే పేద కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వడంపై నిర్ణయం తీసుకుంటామని ప్రకటించవచ్చని.. విద్య, వైద్యం వంటి కీలక అంశాలపైనా హామీలు ఉంటాయని చెప్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీపైనా మోదీ ఘాటుగా విమర్శలు గుప్పిస్తారని వివరిస్తున్నారు.

3న పసుపు బోర్డుపై ప్రకటన?

మంగళవారం (3న) నిజామాబాద్ పర్యటన సందర్భంగా రాష్ట్రంలో పసుపుబోర్డు ఏర్పాటును ప్రధాని మోదీ ప్రకటించే అవకాశాలు ఉన్నాయని బీజేపీ నేతలు చెప్తున్నారు. పసుపు బోర్డు కోసం ఈ ప్రాంత ప్రజలు, రైతులు ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్నందున దీనిపై అధికారిక ప్రకటన వెలువడవచ్చని అంటున్నారు.

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



రెడ్డి/High Matches, డైవర్స్ 40, 30 లక్షలు జీతం, *రెడ్డి/31, Divorce, బిజినెస్, 50 Crores ప్రాపర్టీ. కాల్: 9392023911 (రెడ్డి పెళ్లి సంబంధాలను సకాలంలో సెట్ చేయబడును). [HA-11784]

35 years/1st మ్యాచ్ Govt. ఎంప్లాయ్ 2,00,000/- (pm) కోట్ల ప్రాపర్టీ కలిగిన అందమైన వరుడికి (ఓసీ కమ్మ, కాపు, రెడ్డి, పద్మశాలి) వధువు కావలెను. సంప్ర: 7386550413 [H-788687]

SC హిందు మాల: M.Tech, IIT/ C.Govt. ఎలక్ట్రికల్ ఇంజినీర్/BHEL/90,000/- pm/ 6' ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [H-14773]

క్రిస్టియన్ మాదిగ: M.Tech/ Govt.Asst ఇంజినీర్/ ఎలక్ట్రికల్ Dept/ 70,000/- pm/ 5'11" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9963410191 [H-14773]

వడ్డెర: కట్నప్రసక్తి లేదు/B.Tech/ C.Govt. ఇన్స్‌పెక్టర్/ ఎక్సైజ్Dept/ 80,000/- pm/ 5'11" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618008271 [H-14773]

రజక: B.Tech/ Govt.Asst. ఇంజినీర్/ ఇరిగేషన్ Dept/ 1 Laksh. pm/ 5'7" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [H-14773]

SC మాల: ఏకైక కుమారుడు/B.Tech/ Govt.Jr. ఇంజినీర్/ పవర్‌గ్రిడ్/ 1లక్ష pm/5'8"ఎత్తు/ 30 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 8897389698 [H-14773]

SC మాల: కట్నప్రసక్తి లేదు/B.Tech/ C.Govt. ఎలక్ట్రికల్ ఇంజినీర్/ రైల్వే/ 80,000- pm/5'10"ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [H-14773]

గౌడ: B.Tech/ C.Govt. బ్యాంక్ P.O/ ఇండియన్ బ్యాంక్/ 60,000/- pm/5'8"ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి అందమైన వధువు కావలెను. Ph: 7032058965 [H-14773]

SC (మాల): కట్నప్రసక్తిలేదు/కులపట్టింపు లేదు/ చదువు. డిగ్రీ/ Good Job/ సొంత ఇల్లు/ Good Family గల వరుడికి వధువు కావలెను. మొదటి/2వ పెళ్లైనా OK Ph: 8367619529 [H-793360]

ముదిరాజ్: 2వ పెళ్ళి/Good Looking/ వయస్సు: 37/చదువుడిగ్రీ/గవర్నమెంట్ జాబ్/సొంతఇల్లు/ Good Familyగల వరుడికి వధువు కావలెను. మొదటి/ 2వపెళ్లైనా OK కట్నప్రసక్తి లేదు. Ph: 8367619529 [H-793360]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Atlanta, BE MS, 29, 6', H1, Engineer, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 9", Apple, 125 K, 50 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Pakanati, BE (IIT), MS, 26, 5' 9", SWE, 40 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 30, 5' 7", Manager, 120 K, 25 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి California, BE, MS, 26, 5' 5", Sr SWE, 120 K, H1, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK, BE, MBA, 26, 5'6", 5 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Amazon, BE, MS, 26, 5' 6", SWE, 130 K, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Motati, BE, MBA, 27, 5' 3", Analyst, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 30, 5' 8", SWE, 140 K, 26 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIT), 30, 5' 8", SWE, 40 L P/A, 10 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి New York, BE, MS, 27, 6', Associate, 140 K, 200 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BITSBE, 30, 5' 7", 40 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5' 4", Sr SWE, 105 K, 5 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 28, 5'2", Sr Consultant, 11 L P/A, 7 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 27, 5' 6", USA, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 5", SWE, 100 K, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

SC మాల & క్రిస్టియన్/M.Tech/NIT/ Govt. A.E.E/ ఇరిగేషన్ Dept/18Lakhs PA/5'9" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-14776]

యాదవ/B.Tech(EEE)/Govt.A.E.E/ ట్రాన్స్‌కో/14 Lakhs PA/5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. Ph: 9515755529 [HA-14776]

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/B.Tech/ బ్యాంక్ మేనేజర్/HDFC/1 Lakh. PM/ 5'8"ఎత్తు/33 సం॥ల పిల్లలు లేని వరునికి వధువు కావలెను. Ph: 9550650024 [HA-14776]

రజక/కట్న ప్రసక్తి లేదు/B.Tech/Govt. బ్యాంక్ మేనేజర్/యూనియన్ బ్యాంక్/ 60,000/-PM/ 5'10"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 7075953400, 7842467591 [HA-14776]

గౌడ/29 /5'5" / B.Tech, NIT/Own హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్/2 Lakhs. PM/20Cr ప్రాపర్టీ గల అబ్బాయికి అమ్మాయి కావలెను. Ph: 9441039962 [HA-14776]

ఆర్యవైశ్య/46yrs/5'.5"/ బిజినెస్, జాబ్, 30Cr స్థిరాస్తి గల ఏకైక అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను. Cell: 7995585722, 7680872085. [T-2193]

కమ్మ, 56Y, 5'10H, Fair, NRI Doctor ఇక్కడే స్థిరపడిన అతనికి ఏ బాదర బంధి లేని అందమైన చదువుకున్న 45 సం॥లోపు ఇంట్లో ఉండిపోయే యువతి కావలెను. CNB Ph : 80746 87749 [V-1162484]

Reddy /40/ 5.6/ B.Tech Soft Ware Employee. Good Salary Any 1st & 2nd fair. అందమైన వధువు కావలెను. Direct contact: 73375 86682 [L-798814]

Reddy- 28/5'9"/ BBM / Fair/ Business. 500CR. Contact : PP Reddy, 9391198332 [H-788325]

★

పద్మశాలి: 36Y, ఎత్తు 5'4", Govt జాబ్, నెలకు 25,000 జీతం, సొంత ఇల్లు గల వరుడికి తగిన అమ్మాయి (వధువు) కావలెను. 7730883543, 7095392432. [W-189182]

పద్మశాలి: 31Y, ఎత్తు 5'11", సాఫ్ట్‌వేర్ జాబ్, నెలకు 80,000 జీతం, సొంత ఇండ్లు & ప్రాపర్టీస్ గల వరుడికి తగిన వధువు కావలెను. 7730883543, 7095392432. [W-189182]

పద్మశాలి: 29Y, ఎత్తు 5'6", సాఫ్ట్‌వేర్ జాబ్ బెంగుళూరు నెలకు 2 లక్షలు జీతం, సొంత ఇల్లు & ప్రాపర్టీస్ గల వరుడికి తగిన వధువు కావలెను. 7730883543, 7095392432. [W-189182]

అన్ని కులాలు అమ్మాయి కావలెను. 1వ కోమట్ల అబ్బాయి 35, ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం 20 వేలు, M.Ed., ఆస్తి 90 లక్షలు, నల్లగొండ. : 9121325068 [Y-772545]

★★

నో క్యాస్ట్, మతం, కట్నం, చదువుతో పనిలేదు విడో / డైవర్సీ, 39 సం.లోపు అమ్మాయి కావలెను. కొత్త దుర్గా నాగేంద్ర వర ప్రసాద్ BA, జర్నలిజం, NGO, రైటర్, ప్రవేట్ జాబ్. డైరెక్ట్, తెనాలి-2. 6301554541. [B-1193672]

రెడ్డి Male, 33 సం॥ Fair 5'-10", M.Tech, M.S (USA) 2.5 Cr ప్రాపర్టీ Rs. 3.L / PM గల వరుడుకి డిగ్రి చదివిన వధువు కావలెను. Cont: 94932 42896 [G-786001]

మాల క్రిస్టియన్ వయస్సు 38 సం॥లు. H-5'9" B.Tech., సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అమెరికాలో జాబ్ వరుడుకి వధువు B.Tech., MCA, M.Pharmacy, సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి కావలెను. ✆ 77949 11019 [R-1952]

OC వయస్సు 50, బిజినెస్ వెల్ సెటిల్ వరుడుకు 45 టు 50 అందమైన OC వెల్‌సెటిల్ వధువు కావలెను.(డైరెక్ట్) సంప్రదించండి: 9490878646 [P-772912]

వరుడు కావలెను



No Caste Bar/1వ, 2వ 1కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు. వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK. త్వరగా చూసు కునే వారి కోసం మాత్రమే. Ph: 7794960803 [H-793456]

రెడ్డి/26yrs/5'4"Fair/M.Tech/2L PM/కోట్ల ప్రాపర్టీ, కాపు 28y/5'4"/B.Tech/18L PM/4 ఎ॥ పార్మ్ ల్యాండ్, Own House గల వధువులకు వరులు కావలెను. PH: 9848226983 [H-793501]

కుల పట్టింపు లేదు/విడో/52y/డిస్ట్రిక్ రూరల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్/1 L PM/Own House/30 ఎ॥ ల్యాండ్స్/5 కోట్ల ప్రాపర్టీ గల వెల్ సెటిల్ రిచ్ ఫ్యామిలీ వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 8019657451 [H-793501]

కాపు/డైవర్సీ/30/5'4"/VFair/B.E/Govt Job (JE) ఇరిగేషన్Dept 70,000/-PM/ Own House (Rents) కోట్ల ప్రాపర్టీ గల పిల్లలు లేని వధువుకు తగిన వరుడు కావలెను Ph: 6309344166 [H-793501]

రెండవ పెళ్ళి/విడో/50y/గైనకాలజీ డాక్టర్/ Hyd/ Own House (Rents) పిల్లలులేని/ఏ భాదర బందీలేని అందమైన ఒంటరి వధువుకు FC/BC వరుడు కావలెను (ఇల్లరికం OK) Ph: 8519803423 [H-793501]

రెడ్డి/విడో/28y/5'4" Fair/B.Tech/MBA/SWE/1.5 LPM. కాపు/విడో/26y/5'4"/MBA/Pvt Job/50K PM/Hyd లో Own Plots 7 ఎ॥ల్యాండ్ గల అందమైన వధువులకు తగిన వరులు కావలెను. Ph: 9553652167 [H-793501]

FC/విడో/60Y/రిటైర్డ్ పెన్షనర్/రెండు ఇల్లు/ కమర్షియల్ బిల్డింగ్ & రెంట్స్/పొలాలు మంచి ఆర్థిక స్థోమత గల వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 7702151499 [H-793456]

కాపు/40yrs/ కుల పట్టింపులేదు/2nd మ్యాచ్, Govt. ఎంప్లాయ్ 50K (pm), వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ బిజినెస్ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok) సంప్ర: 9492081545 [H-788687]

2వ పెళ్లి/కుల ప్రసక్తిలేదు/35 yrs/ M A English, PhD/ Govt. లెక్చరర్ 2 లక్షలు (pm) పిల్లలు లేని తెల్లని అందమైన 30 కోట్ల ఆస్తి గల వెల్‌సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా & ఇల్లరికం Ok) సంప్ర: 7396213324 [H-788687]

కాపు/35 yrs/ కుల పట్టింపులేదు/1st మ్యాచ్/ ఫెయిర్/ Govt. ఎంప్లాయ్ 60K (pm), వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ & 3 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok) సంప్ర: 8374802603 [H-788687]

రెడ్డి/30 yrs/ కుల పట్టింపులేదు/1st మ్యాచ్/ Govt. ఎంప్లాయ్ 40K (pm), వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ & 32 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok) సంప్ర: 7095282404 [H-788687]

రెడ్డి, డాక్టర్స్/ *28, PG, *36 Divorce, PG *51, Divorce, Elite ప్రొఫైల్. WhatsApp 9392023911 (రెడ్డి డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, బిజినెస్, విదేశీ రిచ్ Matches కు కాంటాక్ట్). [HA-11784]

రెడ్డి/ 2nd మ్యారేజ్ / కుల, ఆస్తి ప్రసక్తిలేదు/ వయసు: 30, చదువు: డిగ్రీ / సొంత వ్యాపారం కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం Ok). Ph: 8143011223 [HA-11784]

రెడ్డి/60yrs/5'4", V.Fair, సొంత ఇల్లు, రెంట్స్, బిజినెస్, 15 ఎకరాల పొలం గల వధువుకు వరుడు కావలెను. కుల పట్టింపులేదు. Ph: 7730088968 [HA-11784]

కుల, ఆస్తి పట్టింపులేదు/బిజినెస్, జాబ్, 2L pm, 6 కోట్ల ప్రాపర్టీ అందమైన వధువుకి 1, 2వ వరుడు కావలెను. ముఖాముఖి కల్పించబడును. ఇల్లరికం Ok. ఖచ్చితంగా కుదుర్చబడును. Ph: 9704477206 [H-793456]

రెడ్డి/విడో/ఒంటరి/58/ఇంటర్ డెయిరీ ఫామ్ (సొంత క్లాత్ షోరూం/ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తిలేని వరుడు కావలెను. (మనీ సపోర్ట్). (నో బ్రోకర్స్). Ph: 7799083500 / 7386660643 [H-793456]

రెడ్డి/51yrs/ విడో/ డిగ్రీ/ ప్రైవేట్ జాబ్/ సొంత ఇల్లు/ 9 ఎకరాల పొలం గల వధువుకి కుల, ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను. Ph: 9703982351 [H-793456]

రజక: ఏకైక కుమార్తె/ M.Sc/ Agri/ Govt.AEO/ అగ్రికల్చర్ Dept / 45,000/- pm/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [H-14773]

SC హిందు మాదిగ: B.Tech/ C.Govt. P.O/ SBI/ 50,000/- pm/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9963410191 [H-14773]

యాదవ: B.Tech/ Govt. Asst. ఇంజినీర్/ జెన్‌కో/ 70,000/- PM/ 5'5" ఎత్తు/ 27 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9963757612 [H-14773]

రెడ్డి: చాలా అందమైన/వయస్సు: 26 5'5"/ B.Tech/ MS(USA)/ Good Family కోట్ల ఆస్తి గల వధువుకి వరుడు కావలెను. Ph: 8367619529 [H-793360]

విశ్వబ్రాహ్మణ (గోల్డ్‌స్మిత్): వయస్సు: 35/ రెండవ పెళ్ళి/పిల్లలు లేరు/గుడ్‌లుకింగ్/ చదువు డిగ్రీ/గవర్నమెంట్ జాబ్/ సొంత ఇల్లు గల వధువుకి వరుడు కావలెను. Ph: 8367619529 [H-793360]

కులపట్టింపు లేదు: వయస్సు: 42/ ఎత్తు 5'5"/MA/గుడ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. మొదటి/ 2వ పెళ్లైనా OK Ph: 8367619529 [H-793360]

రెడ్డి/40yrs/5'4"/కుల పట్టింపు లేదు/ ఫెయిర్/ PG/ Govt.ఎంప్లాయి/75K. PM బిజినెస్ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకు వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర: 8008474869 [HA-14776]

రెండో పెళ్లి/62y & 60y & 59y & 58y & 56y & 55y & 54y & 52y & 50y & 49y&48y&46y&45y& 44y &42y& 41y&39y&37y&35y&33y& 31y&29& 27Y & 25y/ "మా సేవ" (Since: 1998). Ph/WA: 9291503949 [HA-14776]

బ్రాహ్మణ/24/5'3"/B.Sc *27/5'4"/MBA *30/5'3"/ B.Sc *27/5'2"/ఇంటర్ *32/5'2"/ ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్/పురోహితులకు మ్యారేజ్ త్వరగా కుదుర్చబడును. Ph: 7842635086 [HA-14776]

యాదవ/B.Tech /SWE / 40,000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 7075953400, 7842467591 [HA-14776]

రెడ్డి/విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/A:30, Qly: డిగ్రీ/బిజినెస్‌లు కలిగిన అందమైన వధువుకు 1st or 2nd మ్యారేజ్ వరుడు కావలెను (ఇల్లరికం OK) Ph: 9121300377 [HA-14776]

రెడ్డి /32/ డిగ్రీ. రెడ్డి/34/ ఇంటర్ లేట్ మ్యారేజ్ వధువులకు రెడ్డి కులమునకు చెందిన వరులు కావలెను. సంప్రదించండి. 89855 87754. [L-798815]

★

హిందూ/SC/ఆది ఆంధ్ర/ఇంటర్/ 43y/ 5'3"/ లేట్ మ్యారేజ్ వధువుకు Hydలో 40K పైన జీతం జాబ్ ఉన్న అప్పర్‌క్లాస్ 1st మ్యారేజ్ వరుడు కావలెను. Ph: 9502172967 [H-189524]

పద్మశాలి: 26Y, ఎత్తు 5'5", ఫేర్ కలర్, సాఫ్ట్‌వేర్ జాబ్ గల వధువుకి తగిన వరుడు కావలెను. సెల్: 7730883543, 7095392432. [W-189182]

★★

పద్మశాలి, క్రిస్టియన్, డైవర్సీ (BPT, MIAP) 30 yrs, 5'.1", Good Look, ఇస్కం, 35,000/- (PM), Property : 50 Lakhs, Girl. 5 Yrs, No Caste, No Brokers, VJA ✆ 94946 50753 [B-1210228]

ఆదర్శవంతమైన ఆధ్యాత్మికమైన కాపు వరుడు కావలెను. అందమైన విద్యావంతురాలైన ఐశ్వర్య వంతురాలైన 28 సం॥ విశాఖపట్నం మూగ వధువుకి. Cell: 7032375388, 8341014640 [S-771189]

వేదికలు



పెళ్లి లేటా? డోంట్ వర్రీ! మేము శ్రద్ధతో, మంచి సర్వీస్‌తో తగిన Match ని చూస్తాము. అన్ని కులాల, వయస్సుల, ప్రాంతాల వారికి, Registration కోసం WhatsApp 6304826162 చేయండి. (మీ పెళ్లి మా బాధ్యత). [HA-11784]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14777]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14777]

Kamma - Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14777]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14777]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14777]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt/సాఫ్ట్‌వేర్/గెజిటెడ్/ MBBS/ PG/ NRI/Pvt/బిజినెస్/1వ/2వ/లేట్ AP, TS 15 సం॥ Exp. Ph: 8712384555 [H-30503]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/Est: 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690909 [H-788919]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్సీ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-189422]

18 సం.ల అనుభవం. జాతక లగ్నంలో వివాహ సమస్య-పరిష్కారములతో సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, NRI,Govt., రిచ్ వార్కి పెళ్లి సంబంధాలు ఫాస్ట్ సెటిల్మెంట్. పూర్ణ మాట్రిమోని, తిరుపతి, ఒక నమ్మకం. నమో వెంకటేశాయ. 7093722724. [T-1953]

మాల, మాదిగ స్పెషల్ : IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK, Ph : 73969 15712 (A). [M-10275]

★

1వ, 2వ, లేట్ మ్యారేజెస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్స్, అన్ని కులాల వారికి త్వరగా కుదుర్చబడును. సెల్: 7730883543, 7095392432. [W-189182]

★★

Free Registration బ్రాహ్మణ మరియు అన్నికులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2ndMatches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp). [HA-500]

హిందూ, క్రైస్తవ, మాలల వివాహ పరిచయ వేదిక కళ్యాణ మాల 14-10-2023 శనివారం ఉ. 10 గం. నుండి 2 గం. వరకు సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి, రామారావుపేట, కాకినాడ. ✆ 9440545049 [B-788195]

भारत सरकार GOVERNMENT OF INDIA
परमाणु ऊर्जा विभाग DEPARTMENT OF ATOMIC ENERGY
भारी पानी संयंत्र (मणुगूरु) HEAVY WATER PLANT (MANUGURU)

निविदा सूचना TENDER NOTICE

भारत के राष्ट्रपति के लिए और उनकी ओर से महाप्रबंधक, भारी पानी संयंत्र (मणुगूरु), द्वारा निम्नलिखित कार्य के लिए मुहरबंद निविदाएं आमंत्रित की जाती हैं। For and on behalf of President of India, General Manager, HWP(M) invites online item rate tender (GEM Service custom bid) on two bid system for following work :

GeM Bid No.: **GEM/2023/B/3984598,** File No. : **HWPM/E-P/NIT/12MWp/S-O&M/2023-25,** Name of the work: **Operation & Maintenance of 12 MWp Solar Power Plant at Heavy Water Plant (Manuguru),** Estimated Cost: **Rs. 1,92,13,800/-**, Earnest Money: **Rs. 3,84,276/-**, Duration of work: 24 Months, Date of online availability of e-tender for view and download : **From 20.09.2023 to 19.10.2023 (15:00 hrs)**. Last date & time for online submission of bid: **15:00 Hrs on 19.10.2023;** Date and time of technical bid opening **On 19.10.2023,** after **15:30** hrs.

The bid forms, technical specifications and other details can be obtained from the website **www.gem.gov.in** विस्तृत एनआईटी के लिए कृपया **www.hwb.gov.in** देखें The press notice is also available on **www.hwb.gov.in**

Sd/-
(निविदा आमंत्रित अधिकारी के हस्ताक्षर)
(Signature of Tender inviting authority)

HWPM/Admn/(G)/NIT/10/2023/2640 Dt. 30/09/2023

भारत सरकार GOVERNMENT OF INDIA
परमाणु ऊर्जा विभाग DEPARTMENT OF ATOMIC ENERGY
भारी पानी संयंत्र (मणुगूरु) HEAVY WATER PLANT (MANUGURU)

ई - निविदा सूचना आमंत्रण Notice Inviting e-Tenders

The GeneralManager, Heavy Water Plant, Manuguru, Gautami Nagar, Aswapuram (PO), Bhadradri Kothagudem (Dist.), T.S. 507116, invites for and on behalf of President of India, online item rate tender for the following work.

भारत के राष्ट्रपति के लिए और उनकी ओर से महाप्रबंधक, भारी पानी संयंत्र (मणुगूरु), गौतमीनगर, पोस्ट:, अश्वापुरम 507116,, भद्राद्री-कोत्तागूडेम जिला (तेलंगाण) द्वारा पात्र ठेकेदारों से दो बोली ई-निविदा पद्दति द्वारा निम्नलिखित कार्य एवं ब्यौरे के अनुसार आंन लाइन ई-निविदाएं आमंत्रित की जाती हैं।

E_NIT No. **HWPM/PP/RWTP/23/01** भापासं (म)/पी-पी/आर डब्ल्यू टी पी/23/01. Name of the work: **Various activities of water treatment plant and other units in Production (Process).** कार्य का नाम : उत्पादन की इकाइयों अन्य और संयंत्र उपचार जल में (प्रक्रिया) गतिविधियों विभिन्न

Estimated cost : Rs. **41,26,000/-** (Forty one lakh Twenty Six Thousand only) निविदा की आंकलित लागत : **Rs. 41,26,000/-** (एकचालिस लाख छवीस हजार मात्र) EMD: **Rs. 82,520/-** ईएमडी **Rs. 82,520/-**, Period of completion : **Two Years (730 Days)** कार्य पूर्ण होने की अवधि: **730** दिन. Dates of availability of Tender Documents for view and download: **27.09.2023 (10:00 Hrs) to 13.10.2023 (18:00 Hrs)**. निविदा आरेखण (यदि कोई हो) सहित देखने और डाउनलोड करने के लिए निविदा दस्तावेजों की उपलब्धता की तिथियां : **27.09.2023 (10:00 Hrs) to 13.10.2023 (18:00 Hrs)**. Last date and time of closing of online submission of tenders : **14.10.2023 (18:00 Hrs)**. ऑन लाइन निविदाओं को जमा करने की अंतिम तिथि एवं समय : **14.10.2023 (18:00 Hrs)**. Last date for submission of contractor credentials (Hard copies i.e. attested copies of certificates, EMD etc) निविदा प्रक्रिया शुलक एवं ईएमडी हेतु मूल डीडी/बीसी/पीओ जमा कराने की अंतिम तिथि : **On or before 19.10.2023 (14:00 Hrs)**. Date and time of online opening of Technical Bid तकनीकी बोली ऑन लाइने की अंतिम तिथि : **19.10.2023 (14:30 Hrs)**.

The tender details can be obtained from the website https://eprocure.gov.in Detailed NIT can be viewed at www.hwb.gov.in

Sd/-
(Signature of Tender inviting authority)

HWP(M)/Admn/(G)/NIT/19/2023/2640. Dt. 30/09/2023.

పారా మెడికల్ సిబ్బంది తొలగింపునకు కుట్ర

రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య



ముషీరాబాద్: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న పారా మెడికల్ సిబ్బందిని తొలగించి ఆ శాఖను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 142ను వెంటనే రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 5న హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద వేలాది మందితో భారీ ధర్నా తలపెట్టాలని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ బీసీ ఉద్యోగుల సంఘం నిర్ణయించినట్లు తెలిపారు. ఆయన శనివారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. పెరుగుతున్న జనాభా ప్రకారం అర్బన్ హెల్త్ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, వైద్య కళాశాలలు, ఏరియా ఆస్పత్రులు, నూతన భవనాలను ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం.. వాటికి సరిపడినంతమంది సిబ్బందిని నియమించకుండా.. ఉన్నవారిని కుదించడానికి కుట్ర పన్నుతూ జీవో 142ను అమలు చేస్తోందని ఆరోపించారు. ఈ జీవో వల్ల దాదాపు రాష్ట్రవ్యాప్తంగా ఆరు వేల మంది ఉద్యోగులకు నష్టం కలుగుతుందని వివరించారు. కానీ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుని కార్యాలయంలో, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పనిచేసే పారా మెడికల్ సిబ్బందిని తొలగించాలని కొందరు అధికారులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని తప్పుదోవ పట్టిస్తున్నారని కృష్ణయ్య ఆరోపించారు.

లేఅవుట్లపై కేసు ఉపసంహరించుకోవాలి

తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ డిమాండ్

ముషీరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ లేఅవుట్లలో నిలిపి వేసిన ఓపెన్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారగోని ప్రవీణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.నర్సయ్య, ప్రధాన కార్యదర్శి పగడాల రంగారావు డిమాండ్ చేశారు. శనివారం ముషీరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన కేసును వెంటనే ఉపసంహరించుకొని గ్రామ పంచాయతీ లేఅవుట్లలో ఓపెన్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ల కోసం జీవో జారీ చేయాలని కోరారు. ఈ రిజిస్ట్రేషన్లను నిలిపి వేయడం వల్ల గత మూడేళ్లుగా వేలాదిమంది కష్టమర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను సానుకూలంగా స్పందించనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న సుమారు 25 లక్షల మంది వినియోగదారులు తిరుగుబాటు చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్‌రావు, నేతలు బొమ్మ వెంకటేశ్వర్లు, బిల్లా సతీశ్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
టెండరు ప్రకటన

Engineer-in-Chief (R&B), State Roads & CRN, NIT No. 1416/DCE (R)/EE-R/DEE-5/AEE-1/2023-24 తేది: 29.09.2023

మంచిర్యాల, కుమరం భీమ్ ఆసిఫాబాద్ మరియు నిర్మల్ జిల్లాలలో రూ. 28.03 కోట్ల మొత్తానికి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. i) మంచిర్యాల జిల్లాలో DMFT క్రింద 6 నెం.ల పనులు. ii) నిర్మల్ జిల్లాలో DMFT క్రింద 1 నెం. పని. iii) కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 3 నెం.ల పనులు. టెండరుదార్లు టెండరు షెడ్యూళ్ళు మరియు తదుపరి వివరాలను http://tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. మంచిర్యాల మరియు నిర్మల్ జిల్లాలోని పనుల కోసం ఆఖరి తేదీ: 11.10.2023వ సా. 5.00 గం॥ వరకు.

సం/- ఇంజనీర్-ఇన్-చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN

DIPR RO No.1892-DP/CL/Advt/1/2023-24, Dt: 30.09.2023

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

"e" NIT No. 36/E-in-C, SR&CRN/SE(D&P)-II/EE(SR)/DEE-II/AEE1/2023-24 తేది: 30.09.2023

నాన్ ప్లాన్ పనులు 2023-24 క్రింద మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 1 హైలెవల్ బ్రిడ్జి పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి - 1 పని - ECV మొత్తం రూ. 201 లక్షలు. టెండరుదారులు టెండరు షెడ్యూలును మరియు తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అంటే https://tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు చూడవచ్చును. బ్రిడ్జి పని కోసం టెండర్ల స్వీకరణకు చివరి తేది: 10.10.2023

సం/- ఇంజనీర్-ఇన్-చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN తరఫున

DIPR RO No.1920-DP/CL/Advt/1/2023-24, Dt: 30.09.2023

మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, సిద్దిపేట, (సిద్దిపేట జిల్లా)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

E-Procurement NIT No. E1/623/2023, E1/623/1/2023, E1/2090/2023, E1/531/2023, E1/2073/2023 తేది: 30.09.2023

మొత్తం పనుల సంఖ్య : జనరల్ ఫండ్స్ -1పని, 15th FC-2 పనులు, R&B డిపాజిటెడ్ ఫండ్స్-1 పని, DMFT ఫండ్స్-1 పని, బిడ్ దాఖలు ప్రారంభ తేది మరియు సమయం : 30-09-2023వ రా. 9.00 గం., బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం : 06-10-2023వ మ. 3.30గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అంటే https://tender.telangana.gov.in/ లో చూడవచ్చును. ఫోన్ మరియు ఫ్యాక్స్ నం. : 08457-222440, 9505507243, siddipetmunicipality@gmail.com.

సం/- కమిషనర్, సిద్దిపేట మున్సిపాలిటీ

DIPR RO No.7490-PP/CL/Advt/1/2023-24, Dt:30.09.2023

MSME-TOOL ROOM, HYDERABAD

(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)
(A Government of India Society, Ministry of MSME)
Balanagar, Hyderabad, PIN - 500 037. Ph No : 040-29561793.

ADMISSIONS ARE IN PROGRESS FOR SHORT TERM TRAINING PROGRAMMES OF CAD / CAM, CIVIL ENGINEERING, ESDM, AUTOMATION & INDUSTRIE 4.0 TECHNOLOGIES

Central Institute of Tool Design is an ISO 9001:2015, ISO14001:2004 and ISO 50001:2011 certified premier Institute in India to provide Specialized training in Tool Engineering, CAD/CAM, Civil Engineering VLSI & Embedded Systems, Industrial Automation, 3D Printing and Industrie 4.0 Technologies, designed for Mechanical / Production / Automobile / Manufacturing Science / Civil / Computer Science / Electrical & Electronics / Electronics & Instrumentation / Information Technology Candidates and working professionals.

- New batches will be commenced on **1st & 3rd Wednesday of every month.**
- **For SC/ST candidates fee waiver will be provided as per Govt. of India norms, for NSQF Compliance & NSQF Exampted Courses & Registration fee only to be paid.**
- Placement assistance will be provided to all eligible candidates.
- Limited hostel facility is available inside the campus for boys & girls on chargeable basis.
- For more details visit our website: **www.citdindia.org** and contact Tel Phone No. **040-29561793**
- **How to apply:** Interested candidates can register for the respective course on any Starting day of the batch (1st or 3rd Wednesday of every month)

Sd/-
PRINCIPAL DIRECTOR

తెలంగాణ ప్రభుత్వం
గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ

NIT No. SE/TW/HYD/277 to 280/2023-24 (2వ పిలుపు) తేది: 29.09.2023

పనుల పేర్లు: నిర్దిష్ట జిల్లాలలో కొన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు. పనుల సంఖ్య: 5. 5 పనుల మొత్తం వ్యయం: రూ.2500.00 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభ తేది: 05-10-2023 సా.5:00 గం. మరియు బిడ్ దాఖలు ముగింపు తేది: 13-10-2023 మ.3:00 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in// లో చూడవచ్చును. ఫోన్ నం: 9492770365

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, గిరిజన సంక్షేమం, హైదరాబాద్

DIPR RO No.1908-DP/CL/Advt/1/2023-24, Dt: 30.09.2023

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

E-in-C(R&B), SR&CRN, e-NIT No.35/E-in-C(SR&CRN)/SE(D&P)-II/EE(SR)/DEE/AEE/2023, తేది:29-09-2023

ప్రకారం ఆదిలాబాద్ జిల్లాలో 1 మేజర్ బ్రిడ్జి పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. జిల్లా పేరు: ఆదిలాబాద్, పనుల సంఖ్య: 1, ECV: రూ.3286.92 లక్షలు. టెండరుదార్లు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in వద్ద ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నుండి టెండర్ షెడ్యూల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు తదుపరి వివరాలను చూడవచ్చును. టెండరు స్వీకరణకు ఆఖరి తేది: 17-10-2023వ లేదా అలోగా.

సం/- ఇంజనీర్-ఇన్-చీఫ్ (R&B) స్టేట్ రోడ్స్ & CRN

DIPR RO No.1893-DP/CL/Advt/1/2023-24, Dt:30.09.2023

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

Engineer-In-Chief (R&B) State Roads, CRN- NIT No.3215DCE-R/EE-R/DEE-1/AEE3/2023, తేది:29-10-2023

1. నిజామాబాద్ జిల్లాలో రూ.12.83 కోట్ల మొత్తానికి 7 పనులు అంటే ఆరు (06) SCST నివాస ప్రాంతాలు PLAN వర్క్స్ మరియు ఒకటి (01) మున్సిపల్ వర్క్ కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. 2. టెండరుదార్లు టెండరు షెడ్యూళ్లను 03-10-2023వ రా.9.00 గం.ల నుండి ఇ-మార్కెట్ ప్లేస్ అంటే https://tenders.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది: 11-10-2023వ సా.5.00 గం.ల వరకు లేదా అలోగా.

సం/- ఇంజనీర్-ఇన్-చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN

DIPR RO No.1891-DP/CL/Advt/1/2023-24, Dt:30.09.2023

ప్రాంతీయ కార్యాలయం.
ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ
కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం
कर्मचारी राज्य बीमा निगम
EMPLOYEES' STATE INSURANCE CORPORATION
Ministry of Labour & Employment, Govt. of India

ప్రాంతీయ కార్యాలయం, 5-9-23, హిల్‌ఫోర్ట్ రోడ్, ఆదర్శనగర్, హైదరాబాద్-63
5-9-23, Regional Office, 1st Floor, Adarsh nagar, Hyderabad-500063 Telangana
Phone: 040-23232550/23232560
Email: rd-telangana@esic.nic.in
Website: www.esic.nic.in/www.esic.in

తెలంగాణ రీజియన్‌లో పారామెడికల్ ఉద్యోగాల కోసం నియామకం

దిగువ తెలిపిన విధంగా నేరుగా నియామకం ద్వారా రెగ్యులర్ ప్రాతిపదికన తెలంగాణ రీజియన్, ESIC లో పారామెడికల్ ఉద్యోగాలను భర్తీ చేయడానికి ఆన్‌లైన్ దరఖాస్తులు (ESIC వెబ్‌సైట్ www.esic.gov.in ద్వారా) కోరబడుచున్నవి.

A. ఖాళీల వివరాలు

ఉద్యోగం/ కేటగిరీ	UR	SC	ST	OBC	EWS	మొత్తం	PwBDs కేటగిరీ A	PwBDs కేటగిరీ B	PwBDs కేటగిరీ C	PwBDs కేటగిరీ D&E	Ex. SM
ECG టెక్నీషియన్	5	2	0	1	0	8	0	0	0	0	0
జూనియర్ రేడియోగ్రాఫర్	14	3	1	7	2	27	0	0	0	0	2
జూనియర్ మెడికల్ లేబొరేటరీ టెక్నాలజిస్ట్	8	1	0	3	1	13	0	1	0	0	1
మెడికల్ రికార్డ్ అసిస్టెంట్	0	1	0	0	0	1	0	0	0	0	0
OT అసిస్టెంట్	8	2	1	3	1	15	0	0	0	0	1
ఫార్మసిస్ట్ (ఆయుర్వేద)	1	0	0	0	0	1	0	0	0	0	0
రేడియోగ్రాఫర్	0	1	0	1	0	2	0	0	0	0	0
సోషల్ గైడ్ సోషల్ వర్కర్	2	0	0	1	0	3	1	0	0	0	0

ఖాళీల వివరాలు, PwBD కోసం ఉద్దేశించబడిన కేటగిరీ, వయస్సు, అర్హత, ఎంపిక విధానం, దరఖాస్తు రుసుము, ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలు చేయడానికి సూచనలు, పరీక్ష స్కీమ్, అభ్యర్థులకు ఇతర ముఖ్యమైన నిబంధనలు / మార్గదర్శకాలు కలిగిన వివరమైన ప్రకటన ESIC వెబ్‌సైట్ www.esic.gov.in/recruitmentలో లభిస్తుంది. పైన తెలిపిన ఉద్యోగాల కోసం దరఖాస్తు చేయగోరు అభ్యర్థులు దరఖాస్తు చేసే ముందు వివరమైన ప్రకటనను రిఫర్ చేయవలసిందిగా సూచించబడుతున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలు చేసేందుకు లింక్ 1 అక్టోబర్, 2023 నుండి ESIC వెబ్‌సైట్ www.esic.gov.inలో లభిస్తుంది.

ESIC వెబ్‌సైట్ www.esic.gov.in ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలు చేసేందుకు ముగింపు తేది: 30 అక్టోబర్, 2023

తేది: 29 సెప్టెంబర్, 2023

డిప్యూటీ డైరెక్టర్ I/C
అపాయింటింగ్ అథారిటీ తరఫున

క్లుప్తంగా...

వయోవృద్ధుల కోసం వృద్ధమిత్ర డెస్క్

రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటు

హసన్‌పర్తి: రాష్ట్రంలో తొలిసారిగా వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో శనివారం వృద్ధ మిత్ర డెస్క్‌ను ఏర్పాటు చేశారు. వృద్ధులపై బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూనే, మనోధైర్యాన్ని నింపుతూ వారి సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారానికి వృద్ధమిత్ర డెస్క్ సహకారం అందించనుంది. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2007- తల్లిదండ్రులు వృద్ధుల పోషణ సంరక్షణ చట్టం, 2011 నియమావళి ప్రకారం స్థానిక వయోవృద్ధులతో ప్రత్యేక కమిటీలను రూపొందించాలని సీపీ ఏవీ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో తొలి వృద్ధ మిత్రడెస్క్‌ను ప్రారంభించినట్లు పోలీస్‌వర్గాలు తెలిపాయి.

కొత్తగా 130 ఆలయాలు : ఇంద్రకరణ్



సాక్షి, హైదరాబాద్: దేవాదాయ శాఖ అధీనంలోని సర్వశ్రేయోనిధి నుంచి రూ.37.34 కోట్లను వెచ్చించి రాష్ట్రంలో కొత్తగా 130 ఆలయాలను నిర్మించాలని దేవాదాయ శాఖ నిర్ణయించింది. దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అధ్యక్షతన శనివారం సచివాలయంలో సర్వశ్రేయోనిధి కమిటీ సమావేశం జరిగింది. ఇందులో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఊరిలో గుడి ఉండేలా చూస్తున్నామని, ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో దేవాలయాలను నిర్మించాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో 2,378 దేవాలయాల నిర్మాణానికి రూ. 598 కోట్లు గతంలో మంజూరు చేశామని, అందులో ఇప్పటివరకు రూ.225 కోట్లను వెచ్చించామన్నారు. వాటికి అదనంగా ఇప్పుడు 130 ఆలయాలను నిర్మించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, అదనపు కమిషనర్ కృష్ణవేణి, చీఫ్ ఇంజనీర్ జి.సీతారాములు, ఎస్ఈ మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వాలి

భౌతికకాయానికి నివాళి అర్పించిన మంత్రి నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కోరారు. శనివారం చెన్నైలోని తారామణిలో స్వామినాథన్ భౌతికకాయానికి రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కలిసి మంత్రి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ఆకలితో అలమటించి లక్షలాదిమంది చనిపోయిన పరిస్థితిని చూసి చలించిన ఆయన వైద్యవిద్యను వదిలేసి వ్యవసాయ విద్యను ఎంచుకుని శాస్త్రవేత్తగా మారారన్నారు. పరిశోధకుడిగా తిండిగింజలను అందించి ఆకలిని రూపుమాపేందుకు కంకణం కట్టుకున్న శాస్త్రీయ యోధుడు స్వామినాథన్ అని కొనియాడారు. రెండునెలల క్రితమే స్వామినాథన్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నామని, ఆరోగ్యం కుదుటపడితే తెలంగాణకు వస్తానని చెప్పారన్నారు. తెలంగాణ రైతాంగం, ప్రజలు, ప్రభుత్వం పక్షాన వారికి శిరస్సు వచ్చి శ్రద్ధంజలి ఘటించినట్లు వివరించారు.

బీఎస్సీ, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలు

సాక్షి, హైదరాబాద్: బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలకు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ శనివారం మొదటి విడత నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్యాచిలర్ ఆఫ్ నర్సింగ్ (బీఎస్సీ నర్సింగ్) నాలుగేళ్ల డిగ్రీ కోర్స్, పోస్ట్ బేసిక్ బ్యాచిలర్ ఆఫ్ నర్సింగ్ రెండేళ్ల డిగ్రీ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. తుది మెరిట్ జాబితా, సీట్ల వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. నేడు ఉదయం 8 గంటల నుంచి ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చునని పేర్కొంది. పీడబ్ల్యూడీ అభ్యర్థులతో సహా అర్హులైన అభ్యర్థులు అందరూ కోర్స్, కళాశాల వారిగా ఆప్షన్లను నమోదు చేసుకోవాలని సూచించింది. మరింత సమాచారానికి www. knruhs. telangana.gov.inలో చూడాలని యూనివర్సిటీ పేర్కొంది.

ఎంఎస్సీ నర్సింగ్, ఎంపీటీ కన్వీనర్ కోటా సీట్లకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: ఎంఎస్సీ నర్సింగ్, ఎంపీటీ కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి కాళోజి నారాయణ రావు ఆరోగ్య విశ్వ విద్యాలయం శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆదివారం ఉదయం 8 గంటల నుండి ఈనెల 7 తేదీ సాయంత్రం 6గంటల వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొంది. ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలన అనంతరం తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తారని, మరింత సమాచారం కోసం www.knruhs.telangana.gov. inను చూడాలని యూనివర్సిటీ సూచించింది.

సచివాలయంలో రిటైర్డు అధికారులకు తేనీటి విందు



సాక్షి, హైదరాబాద్: రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం సాయంత్రం సచివాలయంలో తేనీటి విందు ఇచ్చారు. కొత్తగా నిర్మించిన సచివాలయం ప్రాంగణంలోని దేవాలయం, మసీదు, చర్చిలతో పాటు సచివాలయం భవనంలోని 6వ అంతస్తు, ఇతర అంతస్తులను రిటైర్డు అధికారులు పరిశీలించారు. సచివాలయ నిర్మాణం తీరు, ప్రత్యేకతలను ఈ సందర్భంగా సీఎస్ వారికి వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను, యాదాద్రి ఆలయ ప్రసాదాలను రిటైర్డ్ అధికారులకు అందచేశారు. నూతన సచివాలయ నిర్మాణాన్ని, రాష్ట్రంలో అభివృద్ధిని రిటైర్డ్ అధికారులు ప్రశంసించారని సమాచార, పౌరసంబంధాల శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. సంక్షేమ, అభివృద్ధి రంగాల్లో తెలంగాణ దేశంలో ప్రథమ స్థానంలో నిలవడం తెలంగాణ ప్రజానీకానికి గర్వకారణమని వారు అభిప్రాయపడ్డారని వెల్లడించింది. తొమ్మిదేళ్లలో సాధించిన రాష్ట్ర ప్రగతిని సీఎస్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వారికి వివరించారు.

వందేభారత్ X గరుడ ప్లస్!

బెంగళూరు రూట్‌లో రైల్వే, ఆర్టీసీ మధ్య పోటీ

- తక్కువ వ్యవధితో వందేభారత్‌కు బస్సు ప్రయాణికులు మొగ్గు
- వారిని ఆకర్షించేందుకు ఆర్టీసీ చర్యలు
- భారీగా గరుడ చార్జీల తగ్గింపు
- రూ. 300 వరకు తగ్గింపు
- దీంతో గరుడ వైపు క్రమంగా మొగ్గు
- సిద్దిపేట, కృష్ణాల నుంచి త్వరలో రైలు సేవలు





సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైల్వే విస్తరణతో ఆర్టీసీకి పోటీ ఎదురైంది. ఇటీవలే ప్రారంభమైన కాచిగూడ-బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఆదరణ లభించడం.. ప్రతి ట్రిప్పులో దాదాపు 500 మంది ప్రయాణికులు ఈ రైల్లో ప్రయాణిస్తుండటంతో ఇది హైదరాబాద్-బెంగళూరు మధ్య పగటిపూట తిరిగే ఆర్టీసీ గరుడ బస్సులపై కొంత ప్రభావం చూపుతోంది. వందేభారత్ సైతం పగలే పరుగులు తీస్తున్నా కేవలం ఎనిమిదిన్నర గంటల్లోనే గమ్యం చేరుతుండటం ప్రజాదరణకు కారణమవుతోంది. దీంతో రానున్న రోజుల్లో మరింత ఎక్కువ మంది ఈ రైలు వైపు మళ్లితే గరుడ ప్లస్ బస్సుల ఆక్యుపెన్సీ రేషియో తగ్గే అవకాశం ఉందని గుర్తించిన ఆర్టీసీ యాజమాన్యం అప్రమత్తమైంది. ప్రయాణికులను ఆకర్షించే చర్యలు చేపట్టింది.

పక్కాగా డైనమిక్ ఫేర్ సిస్టం...

కాచిగూడ-బెంగళూరు వందేభారత్ ఎనిమిదన్నర గంటల్లో గమ్యం చేరుకుంటుంటే హైదరాబాద్-బెంగళూరు గరుడ ప్లస్ బస్సు 11 గంటలు తీసుకుంటోంది. దీంతో ప్రయాణికులు పెద్ద సంఖ్యలో అటు మళ్లుతున్నారు. ఈ నేపథ్యంలో బస్సులపై ప్రభావం పెద్దగా లేకుండా ఉండేందుకు డైనమిక్ ఫేర్ విధానాన్ని పక్కాగా నిర్వహించాలని ఆర్టీసీ నిర్ణయించింది. వందేభారత్ రైలు టికెట్ చార్జీ (భోజనం చార్జీ లేకుండా) రూ. 1,255గా ఉండగా ఆర్టీసీ గరుడ ప్లస్ బస్సు టికెట్ చార్జీ 1,200గా ఉంది. అందువల్ల డైనమిక్ ఫేర్ విధానాన్ని పక్కాగా అమలు చేయడం ద్వారా వారాంతాల్లో కాకుండా డిమాండ్ తక్కువగా ఉండే సాధారణ రోజుల్లో టికెట్ ధర రూ. 880గా మారుతోంది. మంగళ, బుధ, గురువారాల్లో తక్కువ ధర, మిగతా రోజుల్లో కాస్త ఎక్కువ ధర ఉంటోంది. సాధారణ రోజులు, ప్రయాణ సమయం వంటి మొత్తం 44 అంశాలను పరిగణనలోకి తీసుకొని టికెట్ ధరలను రకరకాల మొత్తాలకు తగ్గించి ఆర్టీసీ ఖరారు చేస్తోంది. ఇది ఆటోమేటిక్‌గా ఖరారయ్యేలా సాంకేతికను వినియోగిస్తోంది. టికెట్ చార్జీ భారీగా తగ్గడంతో బస్సుల వైపు ప్రయాణికులు మొగ్గు చూపుతున్నారు.

సిద్దిపేట, ఇతర ప్రాంతాలకు రైలు సర్వీసులతో..

ఇక ప్రస్తుతం సిద్దిపేటకు ఆర్టీసీ నిత్యం 15 నిమిషాలకో బస్సు నడుపుతోంది. ఇవి ఆర్టీసీకి కాసులు కురిపిస్తున్నాయి. కానీ మరో మూడు రోజుల్లో సిద్దిపేట నుంచి కాచిగూడకు రైలు సర్వీసు ప్రారంభం అవుతోంది. ఒక ట్రిప్పులో వెయ్యి మందిని తరలించే అవకాశం ఉండటంతో ఇది కూడా ప్రభావం చూపుతుందని ఆర్టీసీ భావిస్తోంది. ఇక మహబూబ్‌నగర్ సమీపంలోని జక్లేర్, మక్తల్, మాగనూరు, కృష్ణా లాంటి ప్రాంతాల నుంచి ప్రయాణికులు ఎక్కువగా ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడి ప్రయాణిస్తుంటారు. అయితే దేవరకద్ర-కృష్ణా మధ్య ఆదివారం నుంచి రైలు సర్వీసు ప్రారంభం కానుంది. దీంతో కృష్ణా-కాచిగూడ, సిద్దిపేట-కాచిగూడ రైళ్ల ప్రారంభమయ్యాక వాటిల్లో ప్రయాణికుల సంఖ్య ఏ మేరకు ఉంటోంది? ఏయే ప్రాంతాల్లో ఎక్కువ మంది ఎక్కి దిగుతున్నారు లాంటి అంశాలను పరిశీలించేందుకు ఆర్టీసీ ఉన్నతాధికారులు కొందరు సిబ్బందిని నియమించారు. వారు ఈ వివరాలు పరిశీలించి సమాచారం ఇచ్చాక తదనుగుణంగా బస్సుల విషయంలో మార్పుచేర్పులు చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది.

రూ.60కే కేజీ శనగపప్పు

30కేజీల బస్తా తీసుకుంటే కేజీ రూ.55కే

- రాయితీపై వివిధ రాష్ట్రాలకు సరఫరా చేయనున్న హాకా
- నేడు హైదరాబాద్‌లో 'భారత్ దాల్' పేరుతో పంపిణీకి శ్రీకారం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ హాకా(హైదరాబాద్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్) తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా శనగ పప్పు పంపిణీ చేయనుంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 'భారత్ దాల్' పేరుతో రాయితీపై పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం మార్కెట్లో కిలో శనగపప్పు ధర రూ.90 ఉండగా హాకా మాత్రం వినియోగదారులకు రాయితీపై రూ. 60కే అందించనుంది. ఈ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం హెచ్‌ఐసీసీలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, కేంద్ర వినియోగదారుల శాఖ కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్ కలిసి ప్రారంభించనున్నారు. ఇక్కడ పంపిణీని ప్రారంభించిన అనంతరం హాకా ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో పంపిణీ చేపట్టనుంది. డీ-మార్ట్, మెట్రో, రిలయన్స్‌మార్ట్, టాటామార్ట్‌తో పాటు చిన్న పెద్ద స్టోర్స్‌లలోనే కాకుండా ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్ అయిన జొమాటో, స్విగ్గి, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, జొమాటోలలో కూడా అందుబాటులో ఉంచనున్నారు. వీటిల్లో కూడా కేజీ రూ.60కే అందించనున్నారు. కాగా 30కేజీల బ్యాగ్ తీసుకుంటే కేజీ రూ.55కే చొప్పున రూ.1650కే అందజేస్తారు. రాయితీపై అందిస్తున్న ఈ పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే పప్పు కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరి ఫోన్ నంబర్, ఆధార్ నెంబర్‌ను సేకరించనున్నారు. అధికారులు కోనుగోలుదారుల్లో ఎవరికైనా ఫోన్ చేసి నిర్ణీత ధరకే పప్పు అందిందా లేదా అనే విషయాన్ని క్రాస్ చెక్ చేయనున్నారు.

18 రాష్ట్రాలు... 180 పట్టణాలు

రాయితీ శనగ పప్పును హాకా దేశ వ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఒక్కో రాష్ట్రంలో కనీసంగా 10 పట్టణాలను ఎంపిక చేసింది. ఈ విధంగా దేశ వ్యాప్తంగా 180 పట్టణాల్లో పంపిణీ చేయడం ద్వారా వినియోగదారులకు అందుబాటులో ఉంచనుంది. తెలంగాణతో పాటు ఏపీ, బీహార్, చత్తీస్‌గఢ్, గుజరాత్, హరియాణా, జార్ఖండ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిస్సా, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పంపిణీ చేయనుంది.


నాయబ్ తహసీల్దార్లుగా సీనియర్ అసిస్టెంట్లు

838 మంది పదోన్నతులకు ఆమోదం

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 838 మందికి పదోన్నతి లభించనుంది. వీరికి నాయబ్ తహసీల్దార్ హోదా కల్పించేందుకు శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) ఆమోదం తెలిపింది. పెద్దఎత్తున సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పిస్తూ డీపీసీ నిర్ణయం తీసుకోవడం పట్ల తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) హర్షం వ్యక్తం చేసింది. ట్రెసా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్‌కుమార్‌ల నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్‌ను కలిసి ఈ మేరకు కృతజ్ఞతలు తెలిపింది. పదోన్నతులు పొందనున్న నాయబ్ తహసీల్దార్లకు ప్రస్తుతం వారు పనిచేస్తున్న జిల్లాల్లోనే పోస్టింగులు ఇవ్వాలని ఈ సందర్భంగా ట్రెసా నేతలు మిత్తల్‌ను కోరారు. జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా, ఆఫీస్ సబార్డినేట్లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయాల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు, హ్యాండ్ హోల్డింగ్ సిబ్బంది వేతనాల బిల్లులు మంజూరు చేయాలని, వారిని రెన్యువల్ చేయాలని కోరింది.

సింగరేణిలో బదిలీ వర్కర్ల క్రమబద్ధీకరణ

- జనరల్ మజ్దూర్లుగా మారుస్తూ ఆదేశాలు
- 2,266 మందికి ఒకేసారి అవకాశం
- ఉత్తర్వులు జారీ చేసిన డైరెక్టర్ బలరాం



సింగరేణి యువకార్మికులు

గోదావరిఖని/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి సంస్థలో బదిలీ వర్కర్లుగా పనిచేస్తున్న 2,266 మంది కార్మికులను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీచేసింది. ఏడాదిలో భూగర్భగనుల్లో 190 మస్టర్లు, ఉపరితలంలో 240 మస్టర్లు పనిచేసిన బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజ్ చేశారు. ఈ మేరకు సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశాల మేరకు డైరెక్టర్ ఎస్.బలరాం శనివారం ఉత్తర్వులు జారీచేశారు. 2023 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఇవి అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. తొలిసారి 2017 అక్టోబర్‌లో ఒకేసారి 2,718 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరించినట్లు ఆయన తెలిపారు. 2022 డిసెంబర్ 31వ తేదీకి ముందు సంస్థలో బదిలీ వర్కర్లుగా చేరినవారిలో కనీసం 190/240 మస్టర్ల అర్హత కలిగిన వారిని ఇప్పుడు జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజ్ చేసినట్లు వెల్లడించారు. 2017 నుంచి ఇప్పటివరకు 13,981 మందిని రెగ్యులరైజ్ చేసినట్లు వివరించారు.


ఏరియాల వారీగా ఇలా..

జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరణ అయినవారిలో ఏరియాల వారీగా పరిశీలిస్తే.. శ్రీరాంపూర్‌లో 677 మంది, ఆర్జీ-1లో 522, ఆర్జీ-2లో 51, ఆర్జీ-3, అడ్రియాలలో 323, భూపాలపల్లిలో 274, మందమర్రిలో 261, మణుగూరులో 79, బెల్లంపల్లిలో 32, ఇల్లెందు, కార్పొరేట్‌లో 38, కొత్తగూడెంలో 9 మందిని రెగ్యులరైజ్ చేశారు.

సీఎం కేసీఆర్ హామీ మేరకు

గతంలో బదిలీ వర్కర్లుగా ఉద్యోగంలో చేరిన కార్మికులకు జనరల్ మజ్దూర్లుగా గుర్తింపు రావడానికి కనీస మస్టర్లు ఉన్నప్పటికీ ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. అయితే తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల మేరకు 2017 నుంచి ఎప్పటికప్పుడు బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తున్నారు.

పనిచేసే వారికి గుర్తింపు



సింగరేణిలో బాగా పనిచేసే వారికి ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుంది. గతంలో జనరల్ మజ్దూర్లుగా ఎంపికైన అనేక మంది మరింత శ్రద్ధగా పనిచేస్తూ కంపెనీ నిర్వహించిన ఇంటర్నల్ పరీక్షల్లో పాల్గొని పదోన్నతులు సాధించారు. ప్రతి ఒక్కరూ విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ సంస్థ ఉన్నతితో పాటు మంచి లాభాలు, ఇన్సెంటివ్‌లు అందుకోవాలి. – ఎస్ బలరామ్, డైరెక్టర్

సమ న్యాయం.. సత్వర న్యాయం

లోక్ అదాలత్‌ల ధ్యేయం ఇదే

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. సామ్ కోషి వెల్లడి
- యాదాద్రి భువనగిరి జిల్లా కోర్టు సందర్శన



జిల్లా కోర్టు ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.సామ్ కోషి

సాక్షి, యాదాద్రి: సమ న్యాయం, సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్‌ల ధ్యేయమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి. సామ్ కోషి అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కోర్టులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ అధికారులు, పోలీస్ అధికారులు, న్యాయవాద ప్రతినిధులతో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, ప్రి లిటిగేషన్ కేసులను సత్వరమే పరిష్కరించడం ద్వారా కక్షిదారుల సమయాన్ని, డబ్బును ఆదా చేసి వారి కుటుంబ ప్రగతికి తోడ్పడే అవకాశం ఉందన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్‌లను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని జస్టిస్ సామ్ కోషి చెప్పారు. గత నెల 9న జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో అధికంగా కేసులు పరిష్కరించి దక్షిణాదిలోకెల్లా తెలంగాణ రెండో స్థానంలో నిలిచిందన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థకు త్వరలోనే మధ్యవర్తిత్వ వ్యవస్థను పటిష్ట పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డిసెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసులను పరిష్కరించేలా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.మారుతీదేవి మాట్లాడుతూ పెండింగ్ కేసులు, రాజీకి వీలైన కేసులను కూడా పరిష్కరిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె. దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, వర్చువల్ విధానం ద్వారా రామన్నపేట న్యాయమూర్తులు ప్రదీప్ చందన, ఆలేరు న్యాయమూర్తి సుమలత, చౌటుప్పల్ న్యాయమూర్తి మహతి వైష్ణవి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, డీసీపీ రాజేష్ చంద్ర, భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగారం అంజయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జి. శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, పి.ఎస్. సత్యనారాయణ, ప్రభుత్వ న్యాయవాదులు బి.కేశవరెడ్డి, జి.బాబురావు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు భువనగిరి కోర్టు ప్రాంగణంలో జస్టిస్ సామ్ కోషి మొక్కను నాటారు. భువనగిరి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి కె. మురళి మోహన్ వందన సమర్పణ చేశారు.

ఫేక్ లోన్ యాప్‌లతో జాగ్రత్త!

సైబర్ నిపుణుల హెచ్చరిక.. ప్రముఖ సంస్థల పేర్లతో ప్రకటనలిస్తున్నాయని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వేధింపులకు, ఆర్థిక మోసాలకు పాల్పడే ఫేక్ లోన్‌యాప్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని ఆన్‌లైన్ రుణ యాప్‌లు ప్రముఖ కంపెనీల పేర్లను సైతం వాడుకొని ఆన్‌లైన్‌లో ప్రకటనలు ఇస్తున్నాయని వారు పేర్కొన్నారు. రూపీ ప్రో అనే ఆన్‌లైన్ రుణ యాప్ బజాజ్ ఫైనాన్స్ పేరును వినియోగించినట్లు కేంద్ర హోంశాఖ ఇప్పటికే గుర్తించింది. ఫేక్ యాప్‌ల వివరాలను ఎక్స్ (ట్విట్టర్) ద్వారా వెల్లడిస్తోంది. చైనా సహా శత్రుదేశాల నుంచి కొన్ని సంస్థలు ఆన్‌లైన్ రుణ యాప్‌లను నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వాటి సర్వర్లు ఆయా దేశాల్లో ఉంటున్నందున బాధితులు మోసపోయినప్పుడు కేసుల దర్యాప్తు సైతం కష్టసాధ్యమని వారు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో రుణం తీసుకొనే ముందు యాప్‌ల వివరాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచిస్తున్నారు.

ఫేక్ రుణ యాప్‌ల బారిన పడకుండా ఈ జాగ్రత్తలు తప్పనిసరి...

- వెరిఫై చేయని ఆన్‌లైన్ రుణ యాప్‌లను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవద్దు.
- ఆర్బీఐ రిజిస్టర్డ్ బ్యాంకులు లేదా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలతో అఫిలియేషన్ లేకపోయినా అది మోసపూరిత ఆన్‌లైన్ లోన్ యాప్‌గా గుర్తించాలి.
- తక్కువ మంది యూజర్లు, ప్రతికూల రేటింగ్స్ ఉన్న యాప్‌ల జోలికి వెళ్లవద్దు.
- రుణం ఇచ్చేందుకు నిబంధనలేమీ లేకుండా వెంటనే సొమ్ము ఖాతాలో జమ చేస్తామని పేర్కొనే యాప్‌లు నకిలీవేనని తెలుసుకోవాలి.
- బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్ లేకుండా, ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండానే లోన్ ఇస్తామంటే అనుమానించాలి.

కేంద్ర హోంశాఖ గుర్తించిన నకిలీ రుణ యాప్‌లు	ఐహౌరి లెండ్స్, క్యాష్ పార్క్, ఆన్‌లైన్ రూపీ ప్రో, మొబాబా కాయిన్స్, ఫిన్‌కాష్, లోన్‌బడ్డీ.

అక్రమాలు అరికట్టేందుకు 'ఈ మొబైల్ మైనింగ్ యాప్'


యాప్‌ను ఆవిష్కరించిన మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మైనింగ్ విభాగంలో పారదర్శకతకు పెద్దపీట వేయడంతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు 'ఈ మొబైల్ మైనింగ్ యాప్'కు రూపకల్పన చేసినట్లు రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని జాతీయ సమాచార విజ్ఞాన కేంద్రం (ఎన్ఐసీ)తో కలసి గనులు, భూగర్భ వనరుల శాఖ రూపొందించిన మొబైల్ యాప్‌ను శనివారం ఆయన సచివాలయంలో ఆవిష్కరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, గనుల శాఖ డీఎం కాత్యాయనిదేవి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఖనిజాలు, ఇటుక, ఇసుక తదితరాల రవాణా సమయంలో తనిఖీలు చేసి అనుమతులు ఉన్నాయా లేదా? అనే అంశాన్ని గనుల శాఖ సిబ్బంది తక్షణమే తెలుసుకునేందుకు ఈ యాప్ దోహదం చేస్తుందని మంత్రి మహేందర్‌రెడ్డి వెల్లడించారు. అనుమతులు లేకుండా అక్రమ రవాణా చేయడం, అనుమతులు ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా అధిక మోతాదులో ఖనిజాల తరలింపు.. తదితరాలకు అడ్డకట్ట వేయడంతో పాటు జరిమానాల విధింపునకు కూడా ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. జరిమానా విధింపు, చెల్లింపు అంశాల్లో పారదర్శకతతో పాటు, ఆన్‌లైన్‌లో చెల్లింపులు ఈ యాప్ ద్వారా సాధ్యమవుతుందన్నారు. ఖనిజ రవాణా సమాచారాన్ని డీలర్లు, లీజు హోల్డర్లు ఎప్పటికప్పుడు తెలుసుకోవడం, అనుమతుల నిర్ధారణ కూడా ఈ యాప్ ద్వారా సాధ్యమవుతుందన్నారు. ఈ యాప్ ఉపయోగంలోకి వస్తే క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసే గనుల శాఖ ఏడీలు, అసిస్టెంట్ జియాలజిస్టులు, టెక్నీషియన్లు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లకు విధుల నిర్వహణ సులభతరమవుతుందని మంత్రి వెల్లడించారు.

ప్యాడీ ఫిల్లింగ్ మెషీన్‌కు పేటెంట్ హక్కులు

- మెషీన్ రూపొందించిన విద్యార్థి మర్రిపల్లి అభిషేక్
- విద్యార్థి తండ్రికి పత్రాలు అందజేసిన సిరిసిల్ల కలెక్టర్



అభిషేక్‌ను అభినందిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల ఎడ్యుకేషన్/వేములవాడ రూరల్: కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం బస్తాల్లో నింపే సమయంలో తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని చూసి చలించిన ఓ విద్యార్థి తయారు చేసిన ప్యాడీ ఫిల్లింగ్ మెషీన్‌కు పేటెంట్ హక్కులు దక్కాయి. వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటకు చెందిన విద్యార్థి మర్రిపల్లి అభిషేక్ 2019లో 8వ తరగతి చదువుతుండగా ఇన్‌స్పైర్ మానక్‌లో భాగంగా ప్యాడీ ఫిల్లింగ్ మెషీన్ తయారు చేశాడు. ఇది జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. దీనిని వివిధ స్థాయిలలో పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం ఇన్నాళ్లకు పేటెంట్ హక్కులు కల్పించింది. ఈ పేటెంట్ హక్కులు విద్యార్థి తండ్రి లక్ష్మీరాజం పేరిట వచ్చేలా పత్రాలు సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం పంపిన పేటెంట్ హక్కుపత్రాలను కలెక్టర్ అనురాగ్ జయంతి శనివారం వారికి అందించారు. ఒక విద్యార్థికి పేటెంట్ హక్కులు దక్కడం తెలంగాణలో ఇదే తొలిసారి కావడం విశేషం. అభిషేక్‌ను డీఈవో రమేశ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, స్కూల్ హెచ్‌ఎం శ్రీకాంత్‌రావు, గైడ్ టీచర్ కోరెం వెంకటేశం అభినందించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.